ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 29.10.2025 | సంపుటి : 12 సంచిక : 98 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ప్రాజెక్టుల వారీగా నివేదికలివ్వండి

**తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు**

- కాళేశ్వరం బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలి
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేం దుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మిగతా 2లో..



## సినీకార్మికులకు లాభాల్లో వాటా ఇస్తేనే టికెట్లరేట్ల పెంపునకు అనుమతి

- వారికి టిక్కెట్ల రేట్లలో 20శాతం వాటా ఇవ్వాల్సిందే..
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు సదుపాయాలు
- ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే..
- సినీకార్మిక సంఘం సన్మాన సభలో సీఎం రేవంత్ రెడ్డి

వార్త 2లో

# డీజీపీ ముందు లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

**జనజీవనస్రవంతిలోకి పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్‌లు**

- సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతోనే మావోయిస్టులు లొంగిపోతున్నారు
- వారికి అన్నివిధాలా పునరావాసం కల్పిస్తాం : డీజీపీ శివధర్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపు నిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు ఆజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న, చంద్రన్న ,మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్ బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు.

మిగతా 2లో..




**సీఎం పిలుపుతోనే ముందుకు..**


తమది లొంగుబాటు కాదని, అభివృద్ధిలో కలిసి పని చేయడానికి వచ్చామని చంద్రన్న పేర్కొన్నా రు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతో ముందుకు వచ్చాం. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశాను. భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తాను. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించ డం ఎవరితరం కాదు. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నాను. నా ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చాను’ అని వెల్లడించారు.

**– పుల్లూరి ప్రసాద్ రావు**

# ముంచేస్తున్న మొంథా

**కాకినాడ- మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకిన తుపాను**






- గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో గాలులు
- తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- అప్రమత్తం అయిన జిల్లా అధికార యంత్రాంగం
- వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం
- అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు హెచ్చరిక
- ప్రజలకు సహాయ సహకారాలు అందించాలి
- ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**విశాఖపట్నం(జనంసాక్షి):** బంగాళాఖాతంలో ఏర్పడిన ’మొంథా’ తీవ్ర తుపానుగా బలపడింది. ఈ మేరకు విశాఖలోని వాతావ రణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను తీరాన్ని తాకింది. కాకినాడ– మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90–110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు. తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందిన మొంథా ప్రభావంతో ఏపీ, ఒడిశా, తెలంగా ణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంతో ఒడిశా, ఏపీలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున మిగతా 2లో..







## హరీశ్‌రావుకు పితృవియోగం

- తండ్రి సత్యానారాయణ కన్నుమూత
- నివాళి అర్పించిన కేసీఆర్, కేటీఆర్
- సీఎం రేవంత్, వైఎస్ జగన్ తదితరుల నివాళి

2లో..

## అమెజాన్‌లో కొలువుల కోత

14 వేల ఉద్యోగుల తొలగింపు

2లో..

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తప్పిన పెనుప్రమాదం

విమానం పక్కనే దగ్ధమైన బస్సు
మూడో టర్మినల్ వద్ద ఘటన

# 8వ వేతన కమిషన్‌కు పచ్చజెండా

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు తీపికబురు**

- ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్ట్ సబ్సిడీ
- సంస్థలకు రూ.37,952 కోట్ల చెల్లింపులు
- కేంద్ర కేబినేట్ పలు కీలకనిర్ణయాలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఉద్యోగులకు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఉద్యో గులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ పెంచేలా 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఇవాళ జరిగిన సమావేశంలో కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎనిమిదవ సెంట్రల్ పే కమిషన్ విధి విధానాలకు (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) రూపొందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.కేంద్ర కేబినెట్ నిర్ణయంతో ఎనిమిదో పే కమిషన్ 18నెలల్లో సిఫారసులు చేయనుంది. పే కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు పెంచనుంది. కమిషన్ సిఫారసులతో 50 లక్షల మంది కేంద్ర ప్రభు త్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఎనిమిదో పే కమిషన్ ఛైర్ పర్సన్‌గా జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయి సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ ఘోష్ ,పంకజ్ జైన్‌లు వ్యవహరించనున్నారు.మరోవైపు రబీ సీజన్‌లో న్యూట్రియంట్ ఫర్టిలైజర్స్ సబ్సిడీకి ఆమోదం తెలిపింది. పాస్పెటిక్ , పొటాషిక్, డిఏపి ఫెర్టిలైజర్స్ సబ్సిడీ ఇవ్వనుంది. ఫర్టిలైజర్ సబ్సిడీల కోసం 37,952 కోట్ల రూపాయలను కేంద్రం ఖర్చు చేయనుంది. ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ ఎరువుల ఉత్పత్తి కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ మిగతా 9లో..

# పోటీ పరీక్షల కోసం అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

- తెలంగాణలో ప్రభుత్వ విద్యాసంస్థలన్నిటిపైన సోలార్ రూఫ్ టాప్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్: డిప్యూటీ సీఎం భట్టి



**జనంసాక్షి(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై ప్రత్యేక దృష్టి సారించారని వారి అంచనాలకు అనుగుణంగా ఆర్థిక శాఖలో ప్రణాళికలు చేసుకుని ముందుకు పోతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన మధిర క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి అధికార బృందం అంతా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్ష నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ సీఎం అన్నారు. గ్రామీణ ప్రాంత యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వెళ్లి ప్రత్యేకంగా రూములు తీసుకొని, భారీగా వెచ్చించి కోచింగులు తీసుకునే అవసరం లేకుండా నియోజకవర్గ కేంద్రాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికోసం మిగతా 2లో..

# మళ్లీ మొదలైన అణుటెన్షన్..!

**అమెరికాతో ప్లుటోనియం ఒప్పందం రద్దు**




- ట్రంప్‌కు షాకిచ్చిన పుతిన్..
- ఇందుకు సంబంధించిన చట్టంపై తాజాగా సంతకం చేసిన రష్యా అధ్యక్షుడు

**మాస్కో(జనంసాక్షి):** ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యవహరిస్తోన్న తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ అమెరికాకు పుతిన్ గట్టి షాకిచ్చారు. అగ్రరాజ్యంతో ఉన్న ప్లుటోనియం ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన చట్టంపై పుతిన్ తాజాగా సంతకం చేశారు. దీంతో మళ్లీ అణు టెన్షన్ మొదలైనట్లయ్యింది. అమెరికా, రష్యాల మధ్య 2000 సంవత్సరంలో ది ప్లుటోనియం మేనేజ్‌మెంట్ అండ్ డిస్పొజిషన్ అగ్రిమెంట్ కుదిరింది. 2010లో దీన్ని సవరించారు. ఈ ఒప్పందం ప్రకారం.. ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి కాకుండా.. పౌర అణు విద్యుత్ మిగతా 2లో..



## బీహార్‌లో హామీల వర్షం

ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం • 200 యూనిట్ల ఉచిత విద్యుత్

- అధికారంలోకి రాగానే అమలు చేస్తాం
- మహాగఠ్‌బంధన్ మ్యానిఫెస్టో విడుదల

**పాట్నా(జనంసాక్షి):** బిహార్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలో విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ మ్యానిఫెస్టో విడుదల చేసింది. ‘తేజస్వీ ప్రతిజ్ఞా ప్రాణ్’ పేరుతో ఈ మ్యానిఫెస్టోను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేడా తదితరుల సమక్షంలో విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలు ఇందులో పేర్కొన్నారు. బిహార్‌ను అభివృద్ధిపథంలో నడిపించడంతోపాటు దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా తేజస్వీ యాదవ్ వెల్లడించారు.అంతకుముందు పార్సా, సారణ్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తేజస్వి.. రాష్ట్రంలో శాంతిభద్రతలు మిగతా 2లో..

## పార్కు స్థలానికి విముక్తి

**1.27 ఎకరాల భూమిని కబ్జా చెరనుంచి విడిపించిన హైడ్రా**

**హైదరాబాద్(జనంసాక్షి):** అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఆ దిశగా దూసుకుపోతోంది. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్ల ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 29.10.2025



హైదరాబాద్ నల్లకుంటలోని శంకరమఠంలో గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి, ఆదిశంకరాచార్యుల ఆలయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకరమఠంలో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. 'ధర్మ విజయ యాత్ర' లో భాగంగా హైదరాబాద్‌కు భారతీస్వామికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు



# ప్రాజెక్టులవారీగా నివేదికలివ్వండి

మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై మంగళవారం జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు.

## సినీకార్మికులకు లాభాల్లో వాటా ఇస్తేనే

# టికెట్ల రేట్ల పెంపునకు అనుమతి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను

## మళ్లీ మొదలైన 'అణు' టెన్షన్!

కోసం వినియోగించేలా నిర్ణయించారు. ఈ ఒప్పందంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారుకాకుండా అడ్డుకున్నట్లు అవుతుందని అప్పట్లో అమెరికా అధికారులు అంచనా వేశారు.అయితే, 2016లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సమయంలో అగ్రరాజ్యంతో రష్యా సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ ఒప్పందం అమలును పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం వేళ.. ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. దీంతో రష్యా మళ్లీ అణ్వాయుధ తయారీని వేగవంతం చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## పార్కు స్థలానికి విముక్తి

ఎకరాల పార్క్ కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లేఔట్‌లో బడాబాబు పాగా వేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ప్లాట్లుగా మార్చాడు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది.

## హరీశ్‌రావుకు పితృవియోగం

హైదరాబాద్,అక్టోబర్28(జనంసాక్షి):సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చనున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కటుఉంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఎపి మాజీ సిఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తప్పిన పెనుప్రమాదం

**విమానం పక్కనే దగ్ధమైన బస్సు.. మూడో టర్మినల్ వద్ద ఘటన**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియాకు చెందిన ఓ బస్సు దగ్ధమైంది. ఎయిర్‌పోర్టులోని మూడో టర్మినల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గమనించిన ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే మంటలు ఆర్పివేశారు. బస్సు సమీపంలో ఉన్న విమానం దెబ్బతినలేదని, అందులోని ప్రయాణికులంతా సురక్షితమేనని అధికారిక వర్గాలు వెల్లడించాయి.ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అనే థర్డ్ పార్టీ ప్రొవైడర్ ఎయిరిండియాకు ఈ బస్సు సర్వీసులను అందిస్తోంది. షార్ట్ సర్క్యూట్ వల్లే బస్సుకు మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంపై ఎయిర్‌పోర్టు అధికారులు దర్యాప్తు చేపట్టారు. దీనిపై ఎయిరిండియా ఇంకా స్పందించలేదు.

## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేత !

- కొత్తగా ఆర్డర్లు ఇవ్వని భారత రిఫైనరీలు
- చమురు కొనుగోలుకు ద్వారాలు తెరిచే ఉన్నాయి
- సరఫరాదారులపైనే ఆంక్షలు.. చమురుపై కాదు
- భారత కంపెనీలకు సూచించిన అధికారులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. ఆంక్షలపై మరింత స్పష్టత కోసం వేచిచూసే వైఖరిని అనుసరిస్తున్నాయి. స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని రిఫైనరీలకు చెందిన కీలక వ్యక్తులు మంగళవారం వెల్లడించినట్లు ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొంది.రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా, పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. 2025లో ఇప్పటివరకు సగటున రోజుకు 1.7 మిలియన్ బారెళ్ల (ఎంపీడీ) చమురును మనం దిగుమతి చేసుకున్నాం. ఇందులో 1.2 ఎంపీడీ ఆ రెండు సంస్థల నుంచే వచ్చింది. ఇందులో ఎక్కువ భాగాన్ని రిలయన్స్, నయారా వంటి ప్రైవేటు సంస్థలే కొనుగోలు చేశాయి. పాశ్చాత్య దేశాల నుంచి ఆంక్షలు పెరగడంతో, ముడిచమురు కొనుగోలు కోసం మన కంపెనీలు పశ్చిమాసియా వైపు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పందించిన సంగతి తెలిసిందే. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపింది. అమెరికా, బ్రిటన్, ఈయూ ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని పేర్కొంది. ఆంక్షల అమలు, నియంత్రణ చట్టాలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. అమెరికాకు సహకరిస్తామన్న సంకేతాలను అందించేందుకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్లు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం.

**చమురు కొనుగోలుకు ద్వారాలు తెరిచే ఉన్నాయి**

రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత్‌కు ఇంకా ద్వారాలు తెరిచే ఉన్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహా, ఇతర భారత చమురు సంస్థలేవీ పూర్తిగా కొనుగోళ్లను నిలిపివేయాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. ఆంక్షలు కేవలం రష్యాకు చెందిన సప్లయర్లకే వర్తిస్తాయని, ఆంక్షలు లేని కంపెనీల నుంచి చమురు కొనుగోలుకు వెసులుబాటు ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఆంక్షలు లేని కంపెనీల నుంచి దిగుమతి చేసుకునేందుకు అడ్డంకులు లేకపోవడంతో భారత్‌లోకి రష్యా చమురు దిగుమతులు కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు.ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో గుర్రుగా ఉన్న అమెరికా.. గత వారం రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్, లుకోయిల్ చమురు ఎగుమతి సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. మాస్కోకు చెందిన సుర్గుట్నెఫ్టెగాస్ పీఏఓ, గాజ్‌ప్రోమ్ నెఫ్ట్‌ను గతంలోనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు.

## పోటీ పరీక్షల కోసం అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ లను ప్రారంభిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. పోటీ పరీక్షలకు కావలసిన పూర్తి మెటీరియల్ తో పాటు డిజిటల్ లైబ్రరీ ఈ నాలెడ్జ్ సెంటర్లలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్ లైన్ లో కోచింగ్ ఇప్పిచ్చే ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఇవి ప్రారంభించేందుకు ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. దేశానికి ఆదర్శంగా రాష్ట్ర విద్యా వ్యవస్థలో గేమ్ చేంజర్ గా నిలిచే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించబో తున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. సాంక్షన్ చేసిన అన్ని పాఠశాలల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని పిల్లలు పౌష్టిక ఆహారం లోపంతో ఇబ్బంది పడవద్దు అనేది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన ఆ మేరకు వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందించే ఆలోచ నలో ఉన్నామని ఆ మేరకు ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. మారిన పరిస్థితిలకు అనుగుణంగా ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంట ర్లుగా అప్గ్రేడ్ చేసుకుంటున్నాం ఉపాధి కల్పన ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా విద్యాశాఖ పై దృష్టి సారించి టాప్ ప్రయారిటీ కింద కావలసిన నిధులు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం అన్నారు. ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం సిఎస్ఆర్ నిధుల ద్వారా స్థానికంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## బీహార్‌లో హామీల వర్షం

క్షీణించాయని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం స్వేచ్ఛగా లభిస్తోందని, ఇంటికే నేరుగా మద్యం సరఫరా అవుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే నిషేధం నుంచి కల్లుకు మినహాయింపు ఇస్తామన్నారు. విద్య, ఆరోగ్య సదుపాయాలు, ఉపాధి, సాగునీటిని అందించే ప్రభుత్వాన్ని బిహార్ ప్రజలు కోరుకుంటున్నారని.. గత ఇరవై ఏళ్లలో ఎన్డీయే కూటమి వీటిని చేపట్టలేకపోయిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే వీటిని పూర్తి చేసి చూపిస్తామన్నారు. "సారణ్‌లో హత్యలు, దోపిడీ, అపహరణలు నిత్యకృత్యమయ్యాయి. అయినప్పటికీ సీఎం నీతీశ్ కుమార్ పట్టించుకోవడం లేదు. ఒక్కసారి కూడా బాధితులను పరామర్శించలేదు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. విపక్ష కూటమి అధికారంలోకి వస్తే శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్యోగాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం" అని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. బిహార్‌లో 2016 నుంచి సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు అవుతోంది. మద్యం తయారీ, అమ్మకం, వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ ఉల్లంఘనలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ కూడా తాము అధికారంలోకి వస్తే మద్యం నిషేధాన్ని ఎత్తివేస్తామని ఇదివరకే ప్రకటించింది. 243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో నవంబర్ 6 తొలిదశ, నవంబర్ 11న రెండోదశలో పోలింగ్ జరగనుంది.

## అమెజాన్‌లో కొలువుల కోత


**- 14 వేల ఉద్యోగుల తొలగింపు**

**వాషింగ్టన్(జనంసాక్షి):**ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. 14 వేల కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెద్దఎత్తున ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగాల తొలగింపును అమెజాన్ ప్రకటించింది. అంతకుముందు అమెజాన్‌లో దాదాపు 30 వేల ఉద్యోగాల తొలగింపు ఉంటుందని ప్రచారం వేళ ఆ సంస్థ నుంచి అధికారికంగా ఈ ప్రకటన వెలువడింది.కస్టమర్ల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త పంథాలో ముందుకెళుతున్నామని అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెతత్ గలెట్టి ఉద్యోగులకు రాసిన సందేశంలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బ్యూరోక్రసీని తగ్గించి, అనవసర లేయర్లను తొలగిస్తున్నామని, వనరులను సంపూర్ణంగా వినియోగించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. గతేడాది అమెజాన్ సీఈఓ యాండీ జెస్సీ ఉద్యోగులకు రాసిన లేఖను కూడా మెమోకు జత చేశారు. లేఆఫ్‌ల కారణంగా ఉద్యోగుల కోల్పోయిన వ్యక్తులు, టీమ్స్‌ను త్వరలో నోటీఫై చేయనున్నారు. అమెజాన్‌లో 30 వేల ఉద్యోగాలను తొలగిస్తారంటూ తొలుత ప్రచారం జరిగింది. అమెజాన్‌లో దాదాపు 3, 50,000 మంది కార్పొరేట్ ఉద్యోగులు పనిచేస్తుండగా.. వారిలో 10 శాతానికి సమానమైన 30వేల మందిని తప్పిస్తారంటూ 'రాయిటర్స్' వార్తా సంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెజాన్ నుంచి అధికారికంగా ఉద్యోగాల తొలగింపు ప్రకటన వెలువడింది. అమెజాన్ గత రెండేళ్లుగా పరికరాలు, కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్ సహా ఇతర విభాగాల్లోని ఉద్యోగులను తగ్గిస్తూ వచ్చింది. సీఈఓగా యాండీ జెస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లేఆఫ్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది.

## డీజీపీ ముందు లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. ఇప్పటి వరకు 427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడ య్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు.

# ముంచేస్తున్న 'మొంథా'



ఎగసిపడుతున్నాయి. దీంతో బీచ్‌ల వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సముద్రం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మైక్‌లలో అనౌన్స్ చేస్తున్నారు.

**తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు**

మొంథా తుపాను ప్రభావంతో ఏపీవ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి మరింత పెరిగింది. ఈ ప్రభావంతో ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు ధ్వంసమైంది. తుపాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పలు చోట్ల చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తోంది.ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై నీటమునిగిన సర్వీసు రోడ్డు బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్‌వేపై నుంచి పారుతున్న నీరు విశాఖపట్నంలోని 13వ వార్డులో చెట్టు కూలింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీఎంసీ పరిధిలోని మూడు నియోజకవర్గాలను ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లద్దని అధికారులు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తు న్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల సహా పలు చోట్ల వానలు పడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. తీరప్రాంత గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు.నెల్లూరు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల భారీ, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడుతున్నాయి. కృష్ణపట్నం పోర్టులో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. నెల్లూరు తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. తుపాను కారణంగా విశాఖకు వచ్చే 16 రైళ్లు రద్దయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. తుపాను సహాయక చర్యల కోసం తూర్పు నౌకాదళం సన్నద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుపాను ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటికే కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనూ పలుచోట్ల చిరుజల్లులు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 233 మండలాలు, 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీలపై తుపాను ప్రభావం ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 2,194 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 3,465 మంది గర్భిణీలు, బాలింతల సంరక్షణకు అధికారులు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపింది. 19 జిల్లాల పరిధిలోని 54 రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాల్లో కమ్యూనికేషన్ కోసం 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు ఏర్పాటు చేశామని తెలిపింది. 11 ఎన్డీఆర్ఎఫ్ 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు పేర్కొంది.

**లీడర్ నుంచి కేడర్ వరకు అంతా అక్కడే**

మొంథా తుపాను నేపథ్యంలో సీఎం చంద్రబాబు కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను దృష్ట్యా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలంతా అందుబాటులో ఉండాలన్నారు. కూటమి కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అవసరమైతే కేంద్ర సాయం కూడా కోరతామన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉంది. రియల్ టైమ్‌లోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నాం. పంట నష్ట నివారణ చర్యలను అధికారులకు తెలియజేశాం. ఆకస్మిక వరదల దృష్ట్యా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించాం అని సీఎం తెలిపారు. మొంథా తుపాన్ రాష్ట్రాన్ని గడగడాలాడిస్తోంది. ఈ క్రమంలో ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ కారణంగా రెండ్రోజులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని నేతలకు సీఎం పిలుపునిచ్చారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో సీఎం చంద్రబాబు ఆదేశించారు

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మొంథా తుఫాన్ దృష్టిలో పెట్టుకొని కొనుగోళ్లను చేపట్టాలి
- కొనుగోలు కేంద్రాల వద్ద తూకం ఐపోతే అక్కడి అధికారులే బాధ్యత ఉండేలా చూడండి
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- రైస్ మిల్లులకు తరలించే వరకు రైతులకు బాధ్యత పెట్టొద్దని సూచన



హైదరాబాద్ (జనంసాక్షి) : ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి. మొంథా తుఫాన్ దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద వుండే అధికారులు వేగవంతంగా పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా తూకం వేయాలన్నారు. అదేవిధంగా లారీలకు ఎక్కించిన ధాన్యం.. రైస్ మిల్లులకు వెళ్ళేదాకా రైతులను బాధ్యుల్ని చెయ్యొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాంట ఐపోగానే రైస్ మిల్లులకు తరలించే బాధ్యత కొనుగోలు కేంద్రాల్లో వుండే అధికారులు, సిబ్బంది చూసుకోవాలన్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, ఏర్పాట్లు, ఇతర సదుపాయాలపై పౌరసరఫరాల శాఖ అధికారి ప్రొక్యూర్మెంట్ జీఎం నాగేశ్వర్ రావు తో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు రాష్ట్ర వ్యాప్తంగా 8,342 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు జీఎం నాగేశ్వర్ రావు కమిషన్కు వివరించారు. అందులో 4.428 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 3, 814 కేంద్రాలు ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా ఏర్పాట్లు చేసిన విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ అధికారులు సంధ్య రాణి, హరి వెంకట ప్రసాద్, మహేష్ లు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లతో ఒరిగేదేమీ లేదు
- అభివృద్ధి కావాలంటే బిజెపి అభ్యర్థిని గెలిపించాలి
- ప్రచారంలో ఎంపి ఈటెల రాజేందర్ పిలుపు

హైదరాబాద్, అక్టోబర్28 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్‌లో రిచెస్ట్ ప్లేస్ కానీ ఈ నియోజకవర్గం లోని బస్తీల ప్రజల బాధలు మాత్రం వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెడితేనే చలనం వస్తుందని ప్రజలకు సూచించారు. పెన్షన్లు రావాలన్నా, డబుల్ బెడ్ రూం ఇళ్లు రావాలన్నా, మురికి కాలువలు కట్టాలన్నా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వారి మెడలు వంచి బీజేపీ కొట్లాడుతుందని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఆయన అందరికి సుపరిచితుడన్నారు. తాను మూడవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు. అయితే పేరుకే జూబ్లీహిల్స్.. పారే మురికి కాలువలు, కంపు వాసనలు, గతుకుల రోడ్లు ఏ పేదవాడిని కదిలించినా మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. భర్త చనిపోయి ఐదేళ్లు అయినా.. 65 ఏళ్ళు దాటినా తమకు పెన్షన్ రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ఇస్తామంటూ మోసం చేసిందని.. ఇవన్నీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ సైతం తమను మోసం చేసిందని ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు. పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు చెబుతున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టామని.. కాంగ్రెస్ పార్టీకి సైతం అదే గతి పడుతుందని వారు అంటున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం ఎలా ఉందో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అలాగే ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సమస్యలపై అసెంబ్లీ వేదికగా కొట్లాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తమ పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, లీడర్లు ఇలా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.

## శాతవాహనకు ఇక జనగామలో స్టాప్

హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) : ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ- సికింద్రాబాద్- విజయవాడ మధ్య రెగ్యులర్‌గా సర్వీసులందిస్తోన్న శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు స్టాపేజీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 30 నుంచి ప్రయోగాత్మకంగా ఈ రైలు జనగామ రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని తెలిపింది. విజయవాడ-సికింద్రాబాద్ (12713) శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం క నిమిషం పాటు; సికింద్రాబాద్- విజయవాడ రైలు (12714) సాయంత్రం 5.19/5.20 గంటల మధ్య జనగామ రైల్వే స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# పసిగుడ్డును అమ్మేశారు!

- తక్షణ చర్యలకు ఆదేశించిన టీజీఎస్సి పిసిఆర్
- తెలంగాణ స్టేట్ హెూం పరిరక్షణలో పది రోజుల పసికందు



హైదరాబాద్ (జనంసాక్షి) : నాలుగో సారి ఆడబిడ్డ పుట్టిందని కేవలం పది రోజులు పసిగుడ్డును అమ్మేశారు కన్నవారు. ఈ దారుణమైన సంఘటన నల్గొండ జిల్లా కేంద్రంగా చోటు చేసుకుంది. నల్గొండ బిటిఎస్ కి చెందిన కుర్ర బాబుకి నాలుగో సంతానంలో కూడా అమ్మాయి పుట్టడంతో కుటుంబానికి అమ్మాయి భారంగా ఉందనే ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ లోని ఏలూరుకు చెందిన వ్యక్తులకి అమ్మ చూపాడు. నల్గొండ జిల్లా ఐసిడిఎస్ సిబ్బంది, చైల్డ్ ప్రొటెక్షన్, సిడబ్ల్యుసి అధికారులు అతని పట్టుకొని విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పాప తండ్రి తను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మూలంగా ఈ పని చేసినట్లు తెలిసింది. చట్ట విరుద్ధంగా పసికందు దత్తతను ప్రోత్సహించిన వారి పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించిన తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్. మరోవైపు నల్గొండ జిల్లా కేంద్రంలో పదే పదే ఈ విదంగా జరుగుతున్న అధికారులు నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు. ఈ కారణంగా అధికారుల నిర్వహణపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది.

### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సీరియస్

నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా తో మాట్లాడి వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పిల్లల అమ్మకాలపై, అక్రమ దత్తత పై ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తున్నా.. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. శిశువును సంరక్షణలోకి తీసుకొని తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. "తల్లి-బిడ్డల రక్షణ మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. పేదరికం లేదా అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు బాధ కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు. సమాజం కూడా ఇలాంటి అన్యాయాలను నిరోధించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### అంగన్‌వాడీ చిన్నారిపై లైంగిక దాడి ఘటనపై మంత్రి ఆగ్రహం

వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన చిన్నారిపై జరిగిన లైంగిక దాడి ఘటన పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అమానుష ఘటనలు సమాజాన్ని కలచివేస్తాయని, దోషులను కఠినంగా శిక్షించాలన్నది ప్రభుత్వ సంకల్పమని ఆమె స్పష్టం చేశారు. మంత్రి సీతక్క ఈ ఘటనపై వెంటనే సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల నుంచి వివరాలు తెప్పించుకున్నారు. చిన్నారి ఇంటికి చేరుకుని కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. బాధిత చిన్నారికి తగిన వైద్య, మానసిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చిన్నారుల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికీ తావు ఉండదు. చిన్నారులపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీతక్క స్పష్టం చేశారు.

# హైదరాబాద్ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

- జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఉధృత ప్రచారం
- పాదయాత్రలతో ఓటర్ల దగ్గరకు నేతలు
- బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో మాస్ క్యాంపెయిన్..
- పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి..



హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మంగళవారం నియోజకవర్గంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో 'మాస్ కాంపెయిన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు ప్రతి ఓటరునూ కలుసుకుని ఓట్లు అభ్యర్థించేలా పాదయాత్రలు ఘనంగా నిర్వహించారు. ఎన్ రామచంద్రరావు ఎర్రగడ్డ డివిజన్‌లో పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డిగూడలో, కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ బోరబండ డివిజన్ రాజ్ నగర్‌లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సహా సీనియర్ పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేశారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా నేతలు మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విధానాలపై మండిపడ్డారు. ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు అవకాశం కల్పించారని, ఈసారి బీజేపీకి అవకాశం ఇస్తే జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పదేండ్లు బీఆర్ఎస్, రెండేండ్లుగా కాంగ్రెస్ జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గడపగడపకూ తిరుగుతూ ఓటర్లకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను వివరించారు. ఆరు గ్యారంటీలు సహా ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు.

### ఎంఐఎం, కాంగ్రెస్ పొత్తుపై మండిపాటు

అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్‌తో ఎంఐఎం లోపాయికారీ ఒప్పందంపై మండిపడ్డారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో కలిసిపోతూ హైదరాబాద్ అభివృద్ధిని ఎంఐఎం అడ్డుకుంటుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, ఎంఐఎం అనైతిక పొత్తుతో ఎదురయ్యే సమస్యలను వివరించారు. రౌడీషీటర్లను ప్రోత్సహిస్తూ, కబ్జాలకు పాల్పడే వ్యక్తులకు ఈ రెండు పార్టీలు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల పోటీలో లేకుండానే జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పెత్తనం అంతా ఎంఐఎం చేస్తుందని ఆరోపించారు. నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుండాయిజం, కబ్జాలు, రౌడీషీటర్ల నుంచి రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకారంతో జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోడ్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం.. అవసరమైన చోట బస్తీ దవాఖానాల ఏర్పాటు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు ఆరా తీస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ నేతలు ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

# బీఆర్ఎస్ అభ్యర్థిని విచారించిన శేరిలింగంపల్లి తహసీల్దార్

హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్) అభ్యర్థి మాగంటి సునీత కుటుంబ సభ్యులను మంగళవారం శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ తన కార్యాలయానికి పిలిపించారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తల్లి, గోపీనాథ్ సోదరుడు, గోపీనాథ్ మొదటి భార్య, రెండో భార్య పిల్లలనుసైతం పిలిపించి లీగల్ హెయిర్ విషయంలో తలెత్తిన సమస్య విషయం అడిగి తెలుసుకున్నారు. కాగా గోపీనాథ్ మరణం అనంతరం వచ్చిన ఉపఎన్నిక సందర్భంలో నామినేషన్ దాఖలు లో భాగంగా మాగంటి సునీత సమర్పించిన అఫిడవిట్ వివరాలలో గోపీనాథ్ తల్లి పేరు లేకపోవడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ఏకంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి తహసిల్దార్ వారిని పిలిపించి వివరాలను సేకరించారు. ఎమ్మార్వో ముందు కూడా మాగంటి గోపీనాథ్ తల్లి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు, మాగంటి గోపీనాథ్ పేరును వినియోగించుకున్న క్రమంలో అతనికి తల్లినైన నేను ఎలా కుటుంబ సభ్యురాలిని కానో తేల్చి చెప్పాలని ఎమ్మార్వోను గట్టిగా నిలదీసినట్లు తెలిసింది.

# తుఫాన్‌లోనూ అంతరాయం లేని విద్యుత్ సరఫరా దిశగా చర్యలు

- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- మధిరలో విద్యుత్ రంగం ఆధునీకరణకు నాంది
- 27.76 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు శ్రీకారం
- మధిర పట్టణంలో భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం



మధిర (జనంసాక్షి) : భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా దిశగా చర్యలు చేపట్టామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డిప్యూటీ సి.ఎం. మంగళవారం మధిర పట్టణంలో పర్యటించి 27.76 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం నెరవేరాలంటే విద్యుత్ శాఖ చాలా కీలకమని, ప్రతి రంగ అభివృద్ధికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కీలకమని అన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని పాలసీలను రూపొందించుకొని ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు. మధిర పట్టణ పరిధిలో ముందస్తుగా 27 కోట్ల 76 లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ 3.5 కిమీ 33 కేవిలైన్, 17.3 కిలో మీటర్ల 11కేవి లైన్, 15 కిలోమీటర్ల ఎల్.టీ. లైన్ భూగర్భంలో వేయడం జరుగుతుందని అన్నారు. మధిర సబ్ స్టేషన్ నుంచి ఆత్కూరు రింగ్ రోడ్డు, విజయవాడ రోడ్డు లోని హెచ్.పి. గ్యాస్ గోడౌన్ (రెండు వైపులా), వైయస్సార్ విగ్రహం నుండి అంబర్ పేట చెరువు వరకు ప్రస్తుత 11 కేవి ఓవర్ హెడ్ లైన్లను భూగర్భంలో మార్చుటకు ప్రతిపాదించామని, నందిగామ బైపాస్ రోడ్డు హెచ్.పి. పెట్రోల్ బంకు నుండి డంప్ యార్డ్ వరకు భూ గర్భ విద్యుత్తు లైన్ పనులు ప్రతిపాదించామని అన్నారు. భూగర్భ విద్యుత్ లైన్లు వేయడం వల్ల మధిర పట్టణంలో వైర్లు వేలాడకుండా అందంగా కనపడుతుందని, కాలుష్యం, విద్యుత్ ప్రమాదాలు తగ్గుతాయని, రోడ్ల పక్కన మంచి చెట్లు పెంచుకోవచ్చని అన్నారు. భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ అంబులెన్స్ లను ట్రాన్స్ ఫార్మర్ తో సహా అవసరమైన సామాగ్రి, టెక్నీషియన్స్‌తో ఏర్పాటు చేశామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కనీసం ఒక విద్యుత్ అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర హస్తకళల సంస్థ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఇఇ తానేశ్వర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల విద్యాసదస్సు గోడపత్రిక విడుదల



మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల విద్యాసదస్సు గోడపత్రిక విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో నిర్వహించారు. హైదరాబాద్ వేదికగా ఈ కార్యక్రమాన్ని అతిపెద్ద స్థాయిలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంక్షేమం కోసం ముఖ్యంగా టెట్ 190జీవో తాత్కాలిక డిప్రెషన్ కాకుండా..పూర్తి శాశ్వత మార్గదర్శకాల మార్పుకు. ప్రయత్నం చేయాలని తీర్మానించడం జరిగింది. సివిల్ సర్వీస్ జాన్ స్టాప్ కౌన్సిల్లో శాశ్వత సభ్యత్వంగా ఉన్న మనం మన ఉనికిని కాపాడుకుంటూ భవిష్య ఉద్యోగ ఉపాధ్యాయుల ప్రతి సమస్యను రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ముందు ఉంటూ ప్రభుత్వాన్ని సహకరించేలా విన్నవిస్తూ డిఏలు, పిఆర్సిలను, మెడికల్ బిల్స్.. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ మంజూరు చేయడానికి మానసికాలు ఇవ్వడంలో.. వాటి గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, గౌరవ సలహాదారు కావాలి అశోక్ కుమార్, ఉమ్మడి జిల్లాలో ని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. మురళి, రామ్ రెడ్డి, భాస్కర్, ఖాసీం, స్వామి రవీందర్ రెడ్డి ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగాల సతీష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.



## సీఎం ప్రజావాణిలో 256 దరఖాస్తులు

హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 256 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 71, రెవెన్యూ శాఖకు సంబంధించి 37, ఇందిరమ్మ ఇండ్ల కోసం 83, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ప్రపంచస్థాయి సంస్థల్లో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా...

- టీసీయస్ అయాన్ తో అంబేద్కర్ వర్శిటీ అవగాహనా ఒప్పందం
- అంబేద్కర్ వర్శిటీ వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) : డా. బీ ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అభ్యసించే విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను కల్పిస్తూ వారికి ప్రఖ్యాత సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి వెల్లడించారు. మంగళవారం డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి సమక్షంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ (టీ.సీ.యస్ ఐ.ఓ.ఎన్) తో అంబేద్కర్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి, టీ.సీ.యస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణా దుండిగల్ల అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందంతో 2025-26 విద్యా సంవత్సరం నుండి బి.ఎ/బి.కామ్/బి.ఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ బీఆర్ఏవోయూ టీసీఎస్ఐఓఎన్ ఇంటిగ్రేటెడ్ జాబ్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్"లో చేరేందుకు అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. "ఆన్‌లైన్", టీసీఎస్ఐఓఎన్ డిజిటల్ లెర్నింగ్ హబ్", లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఇంగ్లీష్ మీడియంలో మాత్రమే అభ్యసించే అవకాశం ఉందని వెల్లడించారు. నిపుణులతో ప్రత్యేకంగా రికార్డ్ చేసిన వీడియోలు, సందేహ నివృత్తితో చర్చా వేదికలు, లైవ్ చాట్, ఇండస్ట్రీ అసైన్‌మెంట్‌లు, మాడ్యులర్ ప్రాక్టీస్ ప్యాకేజీలు, మెంటరింగ్‌తో కూడిన ఇండస్ట్రీ ప్రాజెక్ట్‌ల ఏర్పాటు తదితరాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారిలో కనీసం 70% కంటే ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రజాస్వామ్యానికి శ్వాస-విమర్శనాత్మక ఆలోచన

ప్రజాస్వామ్యానికి, ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు...
సత్యం, అసత్యం మధ్య తేడా మసకబారిన యుగంలో మన ఆలోచన స్వేచ్ఛే అత్యంత విలువైనదిగా మారింది. అబద్ధాలకు శబ్దం ఎక్కువ, కానీ సత్యానికి శక్తి అపారమని తెలుసుకునే బుద్ధి అవసరం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు, ప్రశ్నించే హక్కును వినియోగించడం కూడా. మన ఆలోచనా స్వాతంత్ర్యం క్షీణిస్తే, ప్రజాస్వామ్యం శ్వాస ఆగిపోతుంది.

ప్రస్తుత కాలంలో మనం "సత్యానంతర" సమాజంలో జీవిస్తున్నాం. రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక వక్రీకరణలు దైనందిన జీవితంలో మమేకమైపోతున్నాయి. నకిలీ వార్తలు, అబద్ధాలు, పాక్షిక వాస్తవాలు ఇప్పుడు సమాచారం కంటే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఒకప్పుడు దౌర్జన్యాలు దైవలీలల పేరుతో జరిగేవిబీ ఇప్పుడు అవే "ఇదే మీకు మంచిది" అంటూ సాంకేతిక ముసుగులో సోషల్ మీడియా ద్వారా ప్రజల మనసుల్లోకి చొరబడుతున్నాయి. ప్రశ్నించని సమాజం మౌనంలో మునిగిపోతుంది. ఆ మౌనం మన ఆలోచనా శక్తిని మంటించిన మంటల్లా దహిస్తుంది. సగటు మనిషి స్వతంత్రంగా ఆలోచించే, వాస్తవాలను విచారించే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. హేతుబద్ధతకు బదులు భావోద్వేగాలు, శాస్త్రీయ దృష్టికి బదులు ఆరాధనాత్మక దృష్టి చోటు దక్కుతోంది. ఫలితంగా, విలువల వ్యవస్థ పతనమవుతోంది. "నీతి, నిజాయితీ, మర్యాదలు" అన్నవి ఇప్పుడు ప్రదర్శనాత్మక పదాలుగా మారాయి. సత్యానికి విలువ లేని దేశంలో సత్యవంతుడు సులభంగా దోషిగా మారుతాడు. ఇలాంటి స్థితినే పాశ్చాత్య సమాజంలో "పోస్ట్ ట్రూత్" అని పిలుస్తారు. ఇక్కడ వాస్తవాల కంటే వ్యక్తిగత నమ్మకాలు, భావోద్వేగాలే ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. నకిలీ వార్తల ప్రభావం వల్ల ప్రజలు తమకు నచ్చినది నిజమని నమ్ముతున్నారు. వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం అలవాటైపోతోంది. ఫలితంగా సమాజంలో తప్పుడు సమాచారమే "ప్రజా జ్ఞానం"గా మారుతోంది. సోషల్ మీడియా వేదికలపై అబద్ధాలకు లైకులు ఎక్కువ, సత్యానికి నిశ్శబ్దం ఎక్కువ. ఆ పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని సున్నితంగా, కానీ ఘోరంగా దెబ్బతీస్తోంది.

ప్రశ్నే ప్రగతికి పునాది. ఏ వైజ్ఞానిక ఆవిష్కరణైనా, సామాజిక సంస్కరణైనా, ఆధ్యాత్మిక అన్వేషణైనా ఒక ప్రశ్నతోనే మొదలవుతుంది. కానీ ఆధునిక సమాజంలో విమర్శనాత్మక ఆలోచన శక్తి తగ్గిపోతోంది. విశ్లేషణకు బదులు నమ్మకాలు, విచారణకు బదులు మూసభావాలు, ఆలోచనకు బదులు వ్యక్తి ఆరాధన పెరుగుతోంది. విమర్శను విరోధం గా చూడటం, భిన్నాభిప్రాయాలను ద్రోహం గా పరిగణించడం - ఇవి ప్రమాదకరమైన ధోరణులు. ప్రభుత్వాల నుండి మీడియా వరకు అన్నీ భావోద్వేగాల ఆధారంగా నడుస్తున్నట్లున్నాయి. సమాచార హక్కు కోసం పోరాడిన ఉద్యమకారులపై దాడులు, వారి హత్యలు - ఇవన్నీ ప్రజాస్వామ్యపు ఆత్మను గాయపరుస్తున్న దృశ్యాలు.

సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేక్ న్యూస్ ఛానెల్స్ వల్ల ప్రజల్లో ఆలోచన కంటే ప్రతిస్పందన వేగం పెరిగింది. ఆలోచన తగ్గి, ఆక్రోశం పెరిగింది. భిన్న అభిప్రాయాలపై అసహనం రోజురోజుకూ పెరుగుతోంది. "నేను అనుకున్నదే సత్యం" అనే భావం మన సామాజిక సంభాషణలను విషపూరితం చేస్తోంది. రాజకీయాల్లో వ్యక్తి పూజ పరాకాష్టకు చేరింది. నాయకుడు తప్పుడు నిర్ణయం తీసుకున్నా, ఆయన అభిమానులు దానిని సమర్థించడమే కాదు, దానిని సత్యంగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. విధానాలపై విమర్శలు చేయడం ప్రమాదకరమని భావించే వాతావరణం నెలకొంది. ఈ ధోరణి ప్రజాస్వామ్య ఆత్మను మెల్లగా హరించేస్తోంది.

విద్యా వ్యవస్థ కూడా విచారణాత్మక దృష్టిని పెంపొందించడంలో విఫలమవుతోంది. "ఎలా ఆలోచించాలి?" అన్న ప్రశ్నను ప్రాధాన్యంగా బోధించాల్సిన చోట, కేవలం మార్కులు సాధించే విద్యకే ప్రాధాన్యం ఇచ్చింది. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా "విద్య అంటే విషయాలు తెలుసుకోవడం కాదు, ఆలోచించడం నేర్చుకోవడం." అందుకే పాఠశాలల నుంచే "క్రిటికల్ థింకింగ్" అనే అంశాన్ని బోధించాలి. పిల్లలు ప్రశ్నించడానికి, విశ్లేషించడానికి, వాస్తవాలను పరిశీలించడానికి ప్రోత్సహించాలి. మూఢనమ్మకాల నిరోధక చట్టాలు, సోషల్ మీడియా నియంత్రణ చట్టాలు వంటి సంస్కరణలు కూడా అవసరం. సమాజంలో ఆలోచనాత్మక దిశను బలోపేతం చేయడం అత్యవసరం.

"2025" అని బలవంతం చేసే ఉపాధ్యాయుడి ముందు నిలబడి "అది నాలుగు" అని రాసే విద్యార్థి ధైర్యం అదే విమర్శనాత్మక ఆలోచన యొక్క జీవచిహ్నం. నియంతృత్వం తుపాకీతో భయపెట్టినా, సత్యం కోసం లేచిన ఆ విద్యార్థి మనసు ప్రతి మనిషిలో ఉండాలి. ఆ ధైర్యం సత్యానికి, ప్రజాస్వామ్యానికి ఆధారం.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించని మనిషి ఓ నిష్క్రియ పౌరుడు మాత్రమే. ఆలోచించని విద్యార్థి భవిష్యత్తుకే ప్రమాదం. విమర్శించని మేధావి జాతి దురదృష్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులను ఎంచుకోవడం కాదుబీ వారి పనిని ప్రశ్నించడం, విశ్లేషించడం, తప్పు అయితే సరిదిద్దమని చెప్పడం కూడా పౌరుని బాధ్యత.సత్యాన్ని తెలుసుకోవడమే కాదు, దాన్ని నిలబెట్టే ధైర్యం చూపడమే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం.

మన సమాజం ప్రగతిపథంలో కొనసాగాలంటే విమర్శనాత్మక ఆలోచన సజీవంగా ఉండాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి, ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు,ఆలోచనే దారి చూపులు,సత్యమే శాశ్వతం.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# భారత్‌ది బుకాయింపు
# ట్రంప్ చెప్పిందే నిజమా!?




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న భారీ సుంకాల ఒత్తిడికి భారత్ బెదిరిపోయి లొంగిపోయినట్లే కనిపిస్తోంది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను తక్షణం ఆపేయాలని ట్రంప్ పదేపదే హెచ్చరిస్తున్నారు. ఆ చమురు కొనుగోలు కొనసాగితే 50% సుంకాలు మోతాడమని, ఇది భారత ఎగుమతులకు మరింత దెబ్బ తీస్తుందని చెబుతున్నారు. ఈ ఒత్తిడికి మోదీ ప్రభుత్వం 'జీ హుజూర్' అంటూ తలొగ్గినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా 'రష్యా చమురు ఆపేస్తాను' అని హామీ ఇచ్చారని ట్రంప్ అక్టోబర్ 15న వైట్ హౌస్‌లో ప్రకటించారు. ఈ ప్రకటనకు బీజేపీ ప్రభుత్వం ఖండనలు వ్యక్తం చేసింది. కానీ, సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వెలుగైన వివరాలు ట్రంప్ చెప్పిందే నిజమని నిరూపిస్తున్నాయి. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆగస్టు 2025లో రష్యా నుంచి ఒక్క చురుగ్గా చమురు కూడా దిగుమతి చేసుకోలేదని జవాబు ఇచ్చింది. ఈ పరిణామం విపక్షాల ఆరోపణలకు బలం తగిలిస్తోంది - మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థను ప్రమాదాల్లోకి నెట్టిందని. విదేశాంగ శాఖ అధికారులు 'చర్చలు జరుగుతున్నాయి' అని చెప్పినా, ఆర్‌టీఐ జవాబులకు పొంతను కనుగొనడం కష్టమే. ఇందులో ఎవరు అబద్ధాలు చెబుతున్నారో భారత ప్రజలకు, విపక్షాలకు కూడా అర్థం కావటం లేదు. ఈ వివాదం భారత-అమెరికా సంబంధాలను మరింత దెబ్బతీస్తుంది. ప్రభుత్వం త్వరగా పారదర్శకత చూపాలి, లేకపోతే ఈ 'బుకాయింపు' దేశవ్యాప్తంగా విస్తరిస్తుంది.

2022 సెప్టెంబర్ నుంచి 2025 సెప్టెంబర్ వరకు రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు నెలవారీ వివరాలను తెలియజేయాలని 'ఫెడరల్' మీడియా ఆర్‌టీఐ కింద కోరింది. దీనికి హెచ్‌పీసీఎల్ మాత్రమే జవాబు ఇచ్చింది. ఇతర ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు - భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) - గోప్యతా నిబంధనలను సాకుగా చూపుతూ వివరాలు వెల్లడించడానికి నిరాకరించాయి. రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) కూడా అదే కారణంగా సమాచారం ఇవ్వలేదు. ప్రైవేట్ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఆర్‌టీఐ మినహాయింపు ఇవ్వాలని కోరారు. హెచ్‌పీసీఎల్ ఇచ్చిన వివరాల ప్రకారం, 2022 ఏప్రిల్ నుంచి 2025 జూలై వరకు కంపెనీ నిరంతరంగా రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంది. 2025 ఫిబ్రవరిలో అత్యంత తక్కువగా 131 వేల మెట్రిక్ టన్నులు (టీఎంటీ) దిగుమతి చేసుకుంది. అయితే, 2024 అక్టోబర్‌లో అత్యధికంగా 1,146 టీఎంటీ చమురు తీసుకుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత 2022 ఆగస్టు, అక్టోబర్‌లలో మాత్రమే సున్నా దిగుమతులు చూపించింది. అదే విధంగా 2025 ఆగస్టులో కూడా దిగుమతులు సున్నాగానే ఉన్నాయి. ఈ డేటా ట్రంప్ చెప్పిన 'మోదీ హామీ'కు సంబంధం ఉందా అనేది ప్రశ్నార్థమే. రష్యా చమురు భారత్ మొత్తం దిగుమతులలో 40% ఉంటుంది, ఇది ధరలు తక్కువగా ఉండటానికి కారణమే. దీన్ని ఆపడం ఇంధన ధరలు పెంచి, ప్రజల జీవనోపాధికి దెబ్బ తీస్తుంది. రిలయన్స్ జమ్నాగర్ రిఫైనరీలో రష్యా చమురు వాడకం 50%కి చేరినా, ఇప్పుడు తగ్గుతోంది. యూరోపియన్ యూనియన్ రష్యా చమురు నిషేధం వల్ల ఎగుమతి-ఆధారిత రిఫైనరీలు కూడా ఆగిపోతున్నాయి. ఈ మలుపు భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పు తెచ్చింది %-% చమురు ధరలు పెరిగితే పెట్రోల్, డీజిల్ రేట్లు బాహ్య ఒత్తిడికి గురవుతాయి, దీని ప్రభావం ఆహారం, రవాణా ఖర్చులపై కూడా పడుతుంది.

భారత్‌పై అమెరికా భారీ సుంకాలు విధించిన తర్వాత ఈ విధంగా సున్నా దిగుమతులు జరగడం గమనార్హం. ఆగస్టు 6న ట్రంప్ అదనపు 25% సుంకం విధించారు, మొత్తం 50%కి పెంచారు. ఇది 'రష్యా చమురు కొనుగోలుకు శిక్ష'గా చెప్పారు. ఫలితంగా భారత ఎగుమతులు 37.5% కుంటిపడ్డాయి - మే 2025లో $8.8 బిలియన్ల నుంచి సెప్టెంబర్‌లో $5.5 బిలియన్లకు. వాణిజ్య లోటు 13 నెలల రికార్డు స్థాయి $32.15 బిలియన్లకు చేరింది. టెక్స్‌టైల్స్, రత్నాలు, ఇంజినీరింగ్ వస్తువులు, కెమికల్స్ వంటి లేబర్-ఇంటెన్సివ్ సెక్టర్లు గణనీయంగా దెబ్బతిన్నాయి. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం, 50% సుంకాలు భారత జీడీపీకి 60 బేసిస్ పాయింట్లు ($23 బిలియన్లు) దెబ్బ తీస్తాయి. భారత్-అమెరికా ద్విపక్ష వాణిజ్యం 2024లో $129 బిలియన్లకు చేరినా, అమెరికా లోటు $45.8 బిలియన్లు. ఈ సుంకాలు 55% భారత ఎగుమతులను ప్రభావితం చేశాయి. ఫలితంగా భారత్ ఎగుమతులు సెప్టెంబర్‌లో 20% (-1% నుంచి 6.7%కి పెరిగినా) కుంటిపడ్డాయి. హెచ్‌పీసీఎల్ శుద్ధి చేసిన చమురులో రష్యా వాటా 13% ఉంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత 2022 జనవరి-మార్చిలో దిగుమతులు ఆగాయి, కానీ తర్వాత పెరిగాయి. ఇప్పుడు యూఎస్ ట్రెజరీ రోస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై సాంక్షన్లు విధించింది. భారత రిఫైనర్లు రష్యా చమురు కాంట్రాక్టులను సమీక్షిస్తున్నాయి. ఈ మార్పు భారత్‌కు బిలియన్ల డాలర్ల ఆదాను కోల్పోయేలా చేస్తోంది. భారత్ యూఎస్ నుంచి ఆయిల్ దిగుమతులు 120% పెంచింది, కానీ ట్రంప్ గోల్‌పోస్ట్ మార్చారు - రష్యా చమురు ఆపకపోతే సుంకాలు కొనసాగుతాయని. IMF అంచనాల ప్రకారం, 2025-26లో భారత వృద్ధి 6.6%గా ఉంటుంది, కానీ ఈ ట్రేడ్ బారియర్లు దీన్ని ప్రభావితం చేస్తాయి. భారత్ ఎగుమతులను డైవర్సిఫై చేస్తోంది - 24 దేశాల్లో పెరిగాయి - కానీ యూఎస్ మార్కెట్ కోల్పోవడం లక్షలాది ఉద్యోగాలకు ముప్పు.

మోదీ ప్రభుత్వం మొదటి నుంచి ట్రంప్‌తో చేసుకున్న ఒప్పందాలు, షరతులు గురించి పారదర్శకంగా భారత ప్రజలకు, మీడియాకు, పార్లమెంటుకు చెప్పకపోవడం మోసమే. ఈ రహస్య ఒప్పందాలు దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు తెచ్చేలా దాచిపెట్టడం రాజ్యాంగ ఉల్లంఘన. మోదీ నోరు తెరవకపోయినా, ట్రంప్ మాత్రం మోదీ ఇచ్చిన 'రహస్య హామీలు'ను మీడియా ముందు బహిరంగంగా చెబుతున్నారు. ఫిబ్రవరి 13న వైట్ హౌస్‌లో మోదీ-ట్రంప్ సమావేశం తర్వాత ఈ చర్చలు మొదలయ్యాయి. ఆగస్టు 6న 25% అదనపు సుంకాలు విధించారు. అక్టోబర్ 15న ట్రంప్ 'మోదీ హామీ ఇచ్చారు, షార్ట్ పీరియడ్‌లో ఆపేస్తారు' అన్నారు. కానీ, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ 'చర్చలు జరుగుతున్నాయి, ఆయిల్ ఇంపోర్ట్స్ ఎనర్జీ సెక్యూరిటీకి' అని చెప్పి తప్పించుకుంది. భారత ఎంబసీ 'ఫోన్ కాల్ గురించి తెలియదు' అని చెప్పింది. ఈ రకంగా విదేశీ ఒత్తిళ్లకు లొంగి నిర్ణయాలు తీసుకోవడం భారత పరిపాలనలో అమెరికా జోక్యం. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నట్లు - భారత నిర్ణయాలు మోదీ చేత కాక ట్రంప్ చేతే తీసుకుంటున్నారు. ఈ విషయాలు ఆర్‌టీఐలో వెల్లడించకపోవడం విడ్డూరం. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ 'దేశ భక్తి' పేరుతో ఈ రహస్యాలు దాచడం ఏమిటి? భారత్ BRICSలో రష్యాతో బంధాలు బలోపేతం చేస్తోంది, కానీ యూఎస్ ఒత్తిడికి లొంగుతోందా? ఈ వివాదం 2025 యూఎస్-ఇండియా డిప్లొమాటిక్ క్రైసిస్‌గా మారింది. మోదీ పుతిన్, ఎక్సీ జిన్‌పింగ్‌తో బీజింగ్ సమావేశం ట్రంప్‌కు సిగ్నల్‌గా ఇచ్చారు, కానీ ఫలితం సుంకాలే. భారత్ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌లో ఫైల్ చేసే అవకాశం ఉంది. ట్రంప్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నావారో 'రష్యా చమురు ఆపితే 25% సుంకాలు తగ్గుతాయి' అన్నారు. కానీ, భారత కామర్స్ మినిస్టర్ 'బో డౌన్ చేయము, కొత్త మార్కెట్లు కనుగొంటాం' అన్నారు. ఈ ట్రేడ్ వార్ భారత జెమ్స్, టెక్స్‌టైల్స్, ష్రింప్ ఎగుమతులకు 70% ముప్పు తెచ్చింది. సూరత్ డైమండ్ కట్టింగ్ యూనిట్లలో ఉద్యోగాలు, జీతాలు తగ్గుతున్నాయి. అమృత్‌సర్ గార్మెంట్ ఫ్యాక్టరీలు కూడా దెబ్బతిన్నాయి. భారత్ యూఎస్‌కు 40% జెనరిక్స్ సప్లై చేస్తుంది, సుంకాలు ధరలు పెంచుతాయి. ఈ పరిస్థితి 'మేక్ ఇన్ ఇండియా'కు, లక్షలాది జీవనోపాధులకు ముప్పు. ప్రభుత్వం కౌంటర్-టారిఫ్ స్ట్రాటజీతో ఎగుమతులు డైవర్సిఫై చేస్తోంది - H1FY26లో మెర్చండైజ్ ఎగుమతులు 3% పెరిగి $220 బిలియన్లు, ఇంపోర్ట్స్ 4.5% పెరిగి $375 బిలియన్లు. కానీ, యూఎస్ లోటు $45.7 బిలియన్లు కొనసాగుతుంది. భారత్ యూఎస్‌తో ట్రేడ్ డీల్ చేస్తూ, రష్యా చమురు క్రమంగా తగ్గించాలని ప్లాన్ చేస్తోంది. కానీ, ఈ 'గ్రాడ్యువల్ విండ్ డౌన్' ప్రజలకు ధరలు పెంచి, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది.


మైనర్ బాలికలు, మహిళలపై వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ విజయ్ కుమార్ హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, ఉద్యోగినులు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. విద్యాసంస్థల్లో బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. విద్యాసంస్థలు స్వేచ్ఛాయుత, సురక్షిత, గౌరవప్రద వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి భద్రతా చర్యలు బలోపేతం చేయాలని ఆదేశించారు. కేసు పురోగతిని కమిషన్ పర్యవేక్షిస్తుందని, బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా వ్యవస్థల బలోపేతానికి మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తలపిస్తోంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# తెలంగాణ సాహిత్యంలో 'రూఢి కాని' కవులు

కందుకూరి వీరేశలింగం ఇతడిని గోదావరి మండల వాడిగా పేర్కొనగా, సురవరం ప్రతాపరెడ్డి గారు ముదుంబై వంశానికి చెందిన కవులు తెలంగాణ ప్రాంతంలో ఉండటాన్ని ఆధారంగా తీసుకుని ఇతడు మహబూబ్‌నగర్ లేదా వరంగల్ ప్రాంత వాడని అభిప్రాయపడ్డారు.ప్రాంత వివాదాల ప్రభావం కూడా కొంత ఉంది.ఈ వివాదాలు కేవలం భౌగోళిక నిర్ధారణపైనే కాకుండా, ఆయా కవుల సాహిత్య మూలాలను, భాషా మాండలికాలను, ప్రేరణలను కూడా ప్రభావితం చేస్తాయి.ప్రాంత నిర్ధారణలో పొరపాట్లు జరగడం వల్ల కవుల కృషి అనుకోకుండా ఇతర ప్రాంతాలకు చెందిపోవడం, లేదా తెలంగాణ సాహిత్య వారసత్వం తగ్గిపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.తెలంగాణ సాహిత్య చరిత్రలో ఇలాంటి "రూఢి కాని" కవులపై నిర్ధారణాత్మక పరిశోధన అత్యవసరం. కవుల రచనల భాషా విశ్లేషణ, భౌగోళిక ఆధారాలు, స్థానిక మాండలిక పరిశీలన వంటి అంశాలను సమన్వయంతో పరిశీలిస్తే తెలంగాణ సాహిత్యానికి మరిన్ని అసలైన కవుల స్థానం ఖరారవుతుంది. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి వంటి పరిశోధకుల కృషి ఈ దిశలో దారితీస్తుంది.ధర్మపురి శేషాచల కవి ప్రసిద్ధ శతక రచయిత. ఇతడు ధర్మపురిలోని నరసింహ క్షేత్రాన్ని సంభోదిస్తూ మకుటంతో కూడిన శతకం రచించాడు. ఆ శతకంలో ని మకుటం మరియు ఇంటిపేరును బట్టి ఈ కవి కరీంనగర్ ప్రాంతానికి చెందినవాడేనని ఆరుద్ర గారు సమగ్రాంధ్ర సాహిత్యం (13వ సంపుటం, పేజీ 224),నిడదవోలు వెంకటరమణమూర్తి (తెలుగు శతక కవులు, గ్రంథం), శేషాద్రి, మలయశ్రీ వంటి పరిశోధకులు స్పష్టం చేశారు.అయితే, జనమంచి సుబ్రహ్మణ్య శర్మ మాత్రం తన వ్యాసం దక్షిణ భారత సాహిత్య మూలాలు (ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, 1987, పుట. 49)లో శేషాచల కవి అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రాంతానికి చెందినవాడని పేర్కొన్నారు. ఈ భిన్నాభిప్రాయాల మూలకారణం కవి పేరు మరియు క్షేత్రం మధ్య సారూప్యత. ధర్మపురి అనే పేరుతో తెలంగాణలోనూ, రాయలసీమలోనూ గ్రామాలు ఉండటమే ఈ గందరగోళానికి కారణమని సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు (ముంగిలి, పుట. 114) అభిప్రాయపడ్డారు. రాజవోలు సుబ్బారాయుడు కవి ఏ ప్రాంతానికి చెందినవాడన్న విషయంపై కూడా పరిశోధకుల మధ్య విభేదాలున్నాయి. కవి పేరు ఆధారంగా ఇతడు మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజవోలు ప్రాంతానికి చెందినవాడని కపిలవాయి సత్యనారాయణ పేర్కొన్నారు. కానీ, కొంతమంది ఆంధ్ర సాహిత్య చరిత్రకారులు ఇతడిని తూర్పు గోదావరి రాజవోలు వాడని సూచించారు. ఈ వివాదానికి మూలకారణం "రాజవోలు" అనే గ్రామనామం రెండు ప్రాంతాల్లోనూ ఉండటం.భారద్వాజ రామానుజాచార్యులు గురించి కూడా ప్రాంత నిర్ధారణ వివాదాస్పదమే. ఇతడు ఆంధ్ర ప్రాంతం కాకపోవచ్చుని, ఖమ్మం జిల్లా పాల్వంచ ప్రాంతానికి చెందిన కవిగా బి. రామరాజు గారు (తెలంగాణ కవుల సమీక్షా చరిత్ర, వ్యాసం %-% విశ్వవిద్యాలయ తెలుగు పరిశోధనా జర్నల్, 1995, పుట. 93) పేర్కొన్నారు. కవి రచనల్లో ద్రావిడ వాద ప్రభావం, భక్తి ఆవేశం, స్థానిక వాక్యనిర్మాణ శైలి కనిపిస్తాయని ఆయన నిర్ధారించారు.ఇదే విధంగా అనుమగుర్తి రంగయ్య, ఎడపాటి ఏర్రన వంటి కవుల ప్రాంత విషయమూ ఇప్పటివరకు స్పష్టత చెందలేదు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు ముంగిలి (పుట. 127)లో ఈ కవుల మీద ప్రస్తావిస్తూ "ఇవారి రచనలు తెలంగాణ భాషా మాధుర్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, వీరి వాస్తవ వాసస్థలం పై నిర్ధారణ జరగాల్సి ఉంది" అని వ్యాఖ్యానించారు.ఈ ప్రాంత నిర్ధారణలలో ఉన్న అనిశ్చితి కేవలం భౌగోళిక అంశం మాత్రమే కాదుబీ అది సాహిత్య చరిత్రను నిర్మించే పద్ధతికి సంబంధించినది. "రూఢి కాని




కవులు" అనేది కేవలం చరిత్రలో కనిపించని పేర్లు కాదుబీ అది మన సాహిత్య పరిశోధనలో ఇంకా అన్వేషించాల్సిన విభాగం. ఈ కవుల రచనలు, వారి భాషా విన్యాసం, మకుటం నిర్మాణం, స్థలప్రస్తావనల ఇవన్నీ భవిష్యత్ పరిశోధనకు మార్గదర్శకాలు.

కవి ఏ ప్రాంతానికి చెందినవాడో నిర్ధారించడాని కి కేవలం జన్మస్థలం కాదు,కవిత్వంలోని భాషా మాండలికం కూడా ఆధారం అవుతుంది. ఉదాహరణకు సింహాద్రి వేంకటాచార్యుల పద్యాలలో కనిపించే తెలంగాణ ప్రాకృత పదాలు ఆయన్ని ఖమ్మం ప్రాంతానికి చెందినవాడిగా నిర్ధారించడానికి ఆధారమయ్యాయి.ఇలాగే ధర్మపురి శేషాచల కవి పద్యాల్లో "మల్లన్న", "నరసింహ స్వామి" వంటి తెలంగాణ భక్తి సంప్రదాయ ప్రతిరూపాల ప్రస్తావన ఎక్కువగా ఉండటం, కరీంనగర్ ప్రాంత అనుబంధాన్ని బలపరుస్తుంది.కవుల కాలాన్ని నిర్ధారించడంలో వారు చేసిన రాజుల ప్రస్తావనలు, వారి సమకాలిక కవుల పేర్లు, రచనల్లో ఉపయోగించిన శైలీ విశేషాలు ముఖ్యంగా పరిగణించాలి. ఉదాహరణకు గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణంలో గోన వంశాన్ని గౌరవించడం ద్వారా ఆయన కాలాన్ని 13వ శతాబ్దంగా నిర్ధారించారు.కానీ చక్రపాణి రంగనాథుడు అనే పేరు కూడా వుండటంతో కొంతమంది పరిశోధకులు ఇద్దరూ వేర్వేరు కవులేనని, మరికొందరు ఒకరేనని వాదిస్తున్నారు. కవిజనాశ్రయం కర్త గురించి కూడా పరిశోధనలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి.కొందరు దీనిని జైన సంప్రదాయానికి చెందిన జిన వల్లభుడు రాసినదిగా భావిస్తే,మరికొందరు దీనిని ఆంధ్ర కవుల శాస్త్రసాహిత్య పద్ధతిలో ఉన్నదిగా వ్యాఖ్యానించారు. ఈ గ్రంథంలోని పదసంపద, దార్శనికతను బట్టి జైన గ్రంథరచనా ప్రభావం ఎక్కువగా ఉందని బి.ఎన్.శాస్త్రి గారు పేర్కొన్నారు. తపతి సంవరణోపాఖ్యానం - వసు చరిత్ర సంబంధం చూస్తే.ఈ రెండు రచనలు ఒకే పురాణ సంఘటన ఆధారంగా ఉన్నప్పటికీ, శైలీ పరంగా విభిన్నంగా ఉన్నాయని ఆరుద్ర "సమగ్రాంధ్ర సాహిత్యం"లో స్పష్టం చేశారు. బి.రామరాజు మాత్రం ఈ రచనపై ఖుత్స్ ముష్తరి అనే పర్షియన్ రచయిత ప్రభావం ఉండవచ్చని పేర్కొన్నారు, ఇది తెలుగు సాహిత్యంపై పర్షియన్ ప్రభావం ఉన్న అరుదైన ఉదాహరణలలో ఒకటి.వీరభద్ర విజయం శైలీ, ప్రాస, పదసంపద, ధార్మిక అభిముఖతల దృష్ట్యా ఇది పోతన శైలికి భిన్నంగా ఉందని మల్లంపల్లి సోమశేఖర శర్మ విశ్లేషించారు.అయితే పింగళి లక్ష్మీకాంతం "పోతన మొదట శైవుడు, తరువాత వైష్ణవుడు" అనే వాదన ద్వారా ఈ శైవ అంశాలు కూడా పోతన కాలాను గుణమని సూచించారు. అందువలన ఈ రచన పోతన ప్రారంభ దశలోని రచన కావచ్చుని కూడా కొత్త వాదనలు ఉద్భవించాయి.ఇంకా చిత్రకవి పెద్దన - ప్రాంత వివాదం ఉంది.పెద్దన "శ్రీమన్నారాయణ కథ"లోని భాషా రూపం దక్షిణాంధ్ర మాండలికం కంటే తెలంగాణ పదసంపదను కలిగి ఉందని కపిలవాయి లింగమూర్తి గారు సూచించారు.దీనికి వ్యతిరేకంగా చాగంటి శేషయ్య గారు పెద్దనను నిడదవోలు ప్రాంతం వాడిగా పేర్కొన్నారు.ఆధారాలు పరిమితంగా ఉన్నందున ఈ వివాదం ఇప్పటికీ ముగియలేదు. గజ్జరి ఎల్లదాసు విషయంలో "వైశ్య కవి" అని ఎస్.వి. జోగారావు, "పద్మశాలి కవి" అని దేవి ప్రసాద్ పేర్కొనడం తెలుగు సాహిత్య పరిశోధనలో కులపరమైన విభిన్నాభిప్రాయాల స్పష్టమైన ఉదాహరణ.ఇది కవుల కీర్తిని కులంతో అనుసంధానించే సంప్రదాయ విమర్శక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది.తెలంగాణ ప్రాంతంలోని పురాతన కవుల గురించి తగిన ప్రాథమిక గ్రంథాలు ఇంకా లభించని కారణంగా రూఢి కాని అంశాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి ముంగిలి, ఆరుద్ర, బి.ఎన్.శాస్త్రి, కపిలవాయి లింగమూర్తి, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి పరిశోధకుల గ్రంథాలు ప్రధాన ఆధారాలుగా పరిగణించాలి.కొత్తగా వెలువడుతున్న మాన్యుస్క్రిప్టులు, కవుల వంశపారంపర్య సమాచారం ఆధారంగా ఈ వివాదాలపై మరింత వెలుగు పడే అవకాశం ఉంది.ఇవన్నీ కలిపి చూడగలిగితే, తెలంగాణ సాహిత్య చరిత్రలో "రూఢి కాని" అంశాలు కేవలం సాంప్రదాయ విభేదాలు కాకుండా ు భాష, ప్రాంతం, మతం, కులం, కాలం వంటి సామాజిక సాంస్కృతిక మలినాలను ప్రతిబింబించే పరిశోధనా సవాళ్లు.ఇవి స్పష్టత పొందినప్పుడు మాత్రమే తెలంగాణ సాహిత్య పటంలో ప్రాచీన కవుల స్థానాలు ఖచ్చితంగా స్థిరపడతాయి.

తెలంగాణ కవుల విషయానికొస్తే ప్రాంతం, కాలం, కులం, రచనా స్వరూపం మొదలైన అంశాలపై అనేక సందేహాలు, వివాదాలు తలెత్తాయి. ఒకే గ్రామనామం అనేక ప్రాంతాలలో ఉండడం వలన కవుల జన్మస్థానాలపై భిన్నాభిప్రాయాలు ఉద్భవించాయి. ఉదాహరణకు కందుకూరి రుద్రకవి, సిరిప్రేగడ ధర్మన, తరిగొప్పుల మల్లన, సింహాద్రి వేంకటాచార్యులు మొదలైన కవుల ప్రాంత నిర్ధారణలో పరిశోధకుల మధ్య విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాగే ధర్మపురి శేషాచల కవి, రాజవోలు సుబ్బారాయుడు, భారద్వాజ రామానుజాచార్యులు మొదలైన కవుల ప్రాంతం విషయంలో కూడా ఖచ్చితత్వం లోపించింది. ఇదే విధంగా బంగారు రంగప్ప, యాముజుల శాయన్న శాస్త్రి, అరిణాణపాలము వేంకటాధ్వరి వంటి కవుల కాల నిర్ధారణకు కూడా ఆధారాలు పరిమితంగా ఉన్నాయి.రచనల విషయంలోనూ గోన బుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణం, కవిజనాశ్రయం, తపతి సంవరణోపాఖ్యానం, అనర్ఘ రాఘవం, వీరభద్ర విజయం వంటి గ్రంథాల కర్తృత్వంపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే పెద్దన, పోతన, గజ్జరి ఎల్లదాసు వంటి కవుల కుల, ప్రాంత, కాల అంశాలపై కూడా వివిధ మతభేదాలు చోటుచేసుకున్నాయి.ఈ విధంగా తెలంగాణ సాహిత్య చరిత్రలో అనేక కవుల విషయంలో "రూఢి కాని" (ఇంకా స్థిరపడని) అంశాలు మనకు కనబడుతున్నాయి.కాబట్టి ఈ అంశాలపై భవిష్యత్ పరిశోధకులు పునఃపరిశీలనతో, ఆధార గ్రంథాల ఆధారంగా మరింత విస్తృతమై న విశ్లేషణ చేపట్టడం అవసరం. ఈ ప్రయత్నాల ద్వారానే తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ కవుల స్థానం మరింత స్పష్టత పొందుతుంది.



డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335

## మలమధ్య మనుగడ
# రక్షణ కవచం ఎక్కడ?

**దుర్వాసన దుర్భరం: 12 గంటలు మలవిసర్జన సముద్రంలో మునిగి... శ్వాస ఆడక!**

**అట్టహాస శంకుస్థాపనలు జం రక్షణ లేని ఆత్మలు - హృదయం ఏడిపిస్తుంది!**

**టెండర్లలో తప్పనిసరి: మాస్క్-గ్లౌజ్-బూట్లు, ఆరోగ్య భీమా - లేకపోతే మరణాలు!**

**ఆర్భాట ఖర్చులు కార్మికుల రక్షణకు మళ్లిస్తే... జీవితాలు బతికేలా చేయండి!**



నగరాలు మెరుస్తున్నాయి. రోడ్లు విశాలం, వాహనాలు సాఫీగా పరుగులు పెడుతున్నా యి. వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపై నిలవకుండా, వరదలు రాకుండా భూగర్భ కాలువలు నిర్మాణం జరుగుతోంది. ఈ అభి వృద్ధి వెనుక ఎవరున్నారు? ఎవరి చేతులు మురికి మునిగాయి? ఎవరి శ్వాసలు దుర్వాస నతో నిండాయి? ఎవరి కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి? కాలువల కార్మికులు - మ నం చూడని హీరోలు, మనం మరచిన మను షులు, మన హృదయాలను ఏడిపించే ఆత్మలు!

ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు - 12 గంటలు - వీరు మనుషుల మలవిసర్జన సముద్రంలో మునిగి పని చేస్తారు. భయంకరమైన దుర్వాసన... కీటకాలు కుట్టినట్టు... విషవాయువులు శ్వాసను ఆపేస్తున్నట్టు... శ్వాస ఆడక, కళ్లు మండుతూ, చర్మం కుళ్లుతూ పని చేస్తారు. ముఖానికి మాస్క్ లేదు - దుర్వాసన గొంతు పట్టేస్తుంది. చేతులకు గ్లౌజులు లేవు - మురికి చర్మంలోకి చొచ్చుకుపోతుంది. కాళ్లకు పొడవైన బూట్లు లేవు - మలనీరు కాలికి చేరి వ్యాధులు పుట్టిస్తుంది. ఒక్క రక్షణ పరికరం కూడా లేకుండా వీరు పని చేస్తారు. ఇది దయనీయం కాదా? మానవత్వం లేనిది కాదా? హృదయం బద్దలయ్యే దృశ్యం కాదా? సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు ఎక్కడ? పర్యవేక్షణ శూన్యం. కార్మికులు ఆరోగ్యం కోల్పోతున్నారు - చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, ఇన్ఫెక్షన్లు, క్యాన్సర్ కూడా! ఒక్క కార్మికుడు చనిపోతే ఎవరు బాధపడతారు? భార్య కన్నీళ్లు? పిల్లల ఏడుపు? కానీ, ఈ పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మాత్రం అట్టహాసంగా జరుగుతాయి. రాజకీయ నాయకులు, అధికారులు ఎర్ర తివాచీలు వేసుకుని, పూలదండలతో అలంకరించబడి, రంగుల పూలతో సుందరంగా మారిన గడ్డపారలు, తట్టలు, కత్తెరలతో దృశ్యకావ్యం సృష్టిస్తారు. లక్షల రూపాయలు ఖర్చు పెడతారు. కానీ, కార్మికులకు ఒక్క మాస్క్ కూడా ఇవ్వరు. ఇది ఏమిటి? అభివృద్ధి కాదు - అసమానత! మానవత్వ హత్య! హృదయం ఏడిపించే ద్వంద్వ వైఖరి!

ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియల్లో తప్పకుండా కార్మికులకు అత్యుత్తమ నాణ్యమైన రక్షణ పరికరాలు సమకూర్చే నిబంధనలు తప్పనిసరి చేయాలి.

మాస్కులు (N95 లేదా అంతకంటే మెరుగైనవి) - దుర్వాసన, విషవాయువుల నుంచి రక్షణ, శ్వాస బతికించే దేవుడు

**గ్లౌజులు** - చేతులకు ఇన్ఫెక్షన్ నివారణ, చర్మం కాపాడే కవచం

**పొడవైన రబ్బర్ బూట్లు** - కాళ్లకు మురికి, నీటి నుంచి రక్షణ, అడుగులు సురక్షితం

**పూర్తి శరీర కవర్ దుస్తులు** - చర్మవ్యాధుల నివారణ, జీవితం కాపాడే గార్డ్

**ఆరోగ్య భీమా** -పని సమయంలో ఏమైనా ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స, కుటుంబం ఆశలు బతికేలా

**రోజువారీ ఆరోగ్య తనిఖీలు** - పని ముందు, తర్వాత, జీవితం ముందు జాగ్రత్త

పని సమయంలో ఈ పరికరాలు ధరించేలా కఠిన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. కాంట్రాక్టర్లు ఈ నిబంధనలు పాటించకపోతే టెండర్ రద్దు, భారీ జరిమానాలు, బ్లాక్‌లిస్ట్ చేయాలి. కార్మికులు ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే నిర్మాణాల్లో నాణ్యత మెరుగవుతుంది. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆర్భాటంగా ఖర్చు పెట్టకుండా, ఆ మొత్తాన్ని కార్మికుల రక్షణ, నిర్మాణ నాణ్యతకు వినియోగిస్తే కాలపరిమితి పాటించి, దీర్ఘకాలిక మన్నిక ఉంటుంది.

అధికారులు, కాంట్రాక్టర్లు ఈ బాధ్యతను సీరియస్‌గా తీసుకోవాలి. కార్మికుల జీవితాలు రక్షించడమే నిజమైన అభివృద్ధి. లేకపోతే, ఈ అట్టహాసాలు కేవలం ఫొటో ఆపర్చునిటీలుగా మిగిలిపోతాయి. మన నగరాలు సుందరంగా మారాలంటే, ముందు కార్మికులు సురక్షితంగా ఉండాలి. ఇది మానవత్వం. ఇది న్యాయం. ఇది హృదయం బద్దలయ్యే అవసరం! ఒక్క కార్మికుడి కన్నీటి చుక్క కూడా మన హృదయాలను తడిమితే... ఇప్పుడే మార్పు తీసుకొచ్చుకుందాం!
(

దండంరాజు
రాంచందర్ రావు,
9849592958

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న 8100 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ వీరపట్నం జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులతో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందడి శ్రీరామ్ మాట్లాడుతూ... సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా, దాదాపు 8100 కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ పెండింగ్ లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డాడు. పేద విద్యార్థులకు సంజీవని వంటి ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్ పథకానికి తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు అయినటువంటి ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయకపోవడం అనేది పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుంది అన్నారు. డిగ్రీ,



పీజీ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వేలమంది విద్యార్థులకు ఫీజు రియంబర్మెంట్, స్కాలర్షిప్ రాని కారణంగా యాజమాన్యాలు ఫీజు రియంబర్మెంట్ వస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికల్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయన్నారు. సంవత్సరాల తరబడి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్మెంట్, స్కాలర్షిప్స్ విద్యార్థుల యొక్క హక్కు అని జ్ఞప్తికి తెర్చుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వీర పట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ ఏబీవీపీ లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్ మల్లకేడి సాయి చరణ్, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ కృష్ణ, విభాగ్ సేఫ్ కన్వీనర్ భాను, టెక్నికల్ సెల్ కన్వీనర్ చరణ్, ఎస్ఎఫ్ఐ కన్వీనర్ నవీన్, జిల్లా టెక్నికల్ సెల్ కన్వీనర్ శివ, తదితరులు పాల్గొన్నారు

## నగరంలో వేర్వేరుచోట్ల ఆక్రమణల తొలగించిన హైడ్రా

- హస్తినాపురంలో కబ్జాల చెర వీడిన 1.27 ఎకరాల పార్కు
- చందానగర్ సర్కిల్లో 500 గజాల ప్రజావసరాల స్థలానికి విముక్తి



**హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కు కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వాళ్లు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించారు. పేదలకు ఉద్దేశించిన లే ఔట్‌లో బడాబాబు పాగా వేశారు. ఆ లేఔట్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ప్లాట్లుగా మార్చాడు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఆక్రమణలు తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

## విద్యా, వైద్య కళాశాలలు శంకుస్థాపన చేసిన స్థలంలోనే మాత్రమే నిర్మించాలి



**కోడంగల్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల, పాత కోడంగల్‌లో ఏర్పాటు చేయనున్న సమీకృత గురుకులాలు శంకుస్థాపన చేసిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని కెడిపి జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి గార్లకు మెమోరండం అందించారు,ఈ సందర్భంగా కేడీపీ జేఏసీ కో కన్వీనర్స్ గంటి సురేష్ కుమార్,ఎరన్ పల్లి శ్రీనివాస్,రమేష్ బాబు,భీమ్ రాజ్, సూర్య నాయక్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలు ఇతర ప్రాంతాలకు తరలించ కుండా చూడాలని వివరించారు. కోడంగల్ లోని ఏర్పాటు చేసే విధంగా చూడాలని, కోడంగల్ ప్రాంతానికి విద్య, వైద్యం లేక కొడంగల్ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మెడికల్ కళాశాల,సమీకృత గురుకులాల ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుందని భావిస్తే ఇతర ప్రాంతాలకు తరలించడంతో కొడంగల్ ప్రాంతం వెనుకబాటుకు గురవుతుందని వివరించారు. కొడంగల్, తాండూరు నియోజకవర్గాలకు మధ్యన ఉండడంతో రెండు నియోజకవర్గ ప్రజలకు అనుకూలంగా ఉంటుందని భూములు తీసుకొని విద్య,వైద్య కళాశాలలు మాత్రమే నిర్మించాలని ఇతర ఎటువంటివి మాకు అవసరం లేవని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుస చంద్రయ్య,రమేష్ బాబు, డాక్టర్ నవాజ్,పవన్ లహెూటి,పముద్దీన్, పకీరప్ప,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగి నిజాయితీగా పనిచేయాలి

- అవినీతి రహితంగా పారదర్శకంగా సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: విజిలెన్స్ అవగాహన వారోత్సవం – అక్టోబర్ 27 నుండి నవంబర్ 2– 2025 వరకు ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలని ప్రతి శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో, అవినీతి రహితంగా, పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రీజినల్ విజిలెన్స్ మరియు ఎన్ ఫోర్స్ మెంట్ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు మరియు సిబ్బందిచే సమగ్రత ప్రతిజ్ఞ' చేయించారు సెంట్రల్ విజిలెన్స్ అవర్నెస్ ఆర్గనైజేషన్ పోస్టర్స్ ఆవిష్కరించిన జిల్లా



కలెక్టర్ నారాయణ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా విజిలెన్స్ వారోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ ఉద్యోగి బాధ్యత విజిలెన్స్, అందరి బాధ్యత, ప్రభుత్వ ఉద్యోగులుగా సర్వీస్ లో చేరినప్పుడు కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పని చేయాల్సి ఉంటుంది. ప్రతి శాఖ ఉద్యోగి తనశాఖ పరిధిలో చేయాల్సిన సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని,ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అవినీతి లేకుండా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సుపరిపాలన అందించాలని అన్నారు జిల్లా కేంద్రం నుండి గ్రామం వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మంచి సేవలు అందించాలని సూచించారు జిల్లా కలెక్టర్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో విధి నిర్వహణలో నిజాయితీతో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ, న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, రీజినల్ విజిలెన్స్ ఏన్ఫోర్స్మెంట్ అధికారులు వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

**హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలకపాత్ర అని...తమ విధులు,బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. మంగళవారం షేక్ పేట జి. నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంకు 500 మందికి అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంకు హాజరైన ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ లు శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ పీఓ, ఏపీఓ లకు ఎన్నికల పోలింగ్ రోజు వారి విధులు, బాధ్యతలపై



జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ట్రైనింగ్ కోసం ఉపయోగించే బ్యాలెట్ యూనిట్ లు, కంట్రోల్ యూనిట్ లు, వివి ప్యాట్ లతో అనుసంధాన ప్రక్రియ, మాక్ పోలింగ్, ఓటింగ్ జరిపే విధానం పై మాస్టర్ ట్రైనర్ లు పీఓ, ఏపీఓ లకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. నోటా తో కలిసి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రానికీ 4 బ్యాలెట్ యూనిట్లను, ఒక కంట్రోల్ యూనిట్ , ఒక వివి ప్యాట్ కు అనుసంధానం జాగ్రత్తగా చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ, ఏపీఓ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిక్కచ్చిగా పాటిస్తూ ఎన్నిక పోలింగ్ సజావుగా జరిగేలా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పని చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల బాధ్యులు సునంద, మమత తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెల్లో నివాసముంటున్న నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య



**రంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: గుడిసెల్లో నివాసం ఉంటూ నిలువ నీడలేక పాములకు ఈగలకు దోమలకు వర్షానికి చలికి వణుకుతూ కాలం వెల్లదిస్తూ సొంత ఇండ్లు లేక బై నంబర్లతో కూడిన ఇంటి నెంబర్లతో కూడిన ఓట్లను మాత్రం పాలకులు ఉపయోగించుకుంటున్నారు తప్ప ఓటు వేసిన వారినీ మాత్రం ఆదుకోవడం లేదు... గత 35 సంవత్సరాలుగా ఎన్నికలు వచ్చిన ప్రతి సారి అన్ని రాజకీయ పార్టీలు తమకు ఓటు వేస్తే మీకు పక్కా ఇండ్లు మంజూరు చేస్తామని బూటకపు హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన తరువాత వారిని పట్టించుకోవడం లేదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య అన్నారు గతంలో అధికారంలో ఉన్నా రాజకీయ పార్టీల నేతలు కూడా అలాగే ప్రవర్తించారని ప్రస్తుత అధికార పార్టీ కూడా అలాగే ప్రవర్తించడంపై ఆయన మండిపడ్డారు సుమారు 60కుటుంబాలకు చెందిన డక్కలి కులస్తులు గత కొన్ని సంవత్సరాలుగా నిలువ నీడ లేక గుడిసెలు వేసుకొని కాలం వెల్లడదిస్తున్నరని ప్రస్తుతం ఆ స్థలానికి చెందిన వ్యక్తులు గుడిసెలు ఖాళీ చేసి వెళ్లాలని చెప్పడంతో డక్కలి కులస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు వెంటనే షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ఎలాంటి ఉపాధి అవకాశం లేని వారికి వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని గతంలో డక్కలి కళాకారులకు ఇచ్చినటువంటి పెన్షను మళ్ళీ ఇచ్చే విధంగా పునరుద్ధరించాలని వారికి విద్యా వైద్యం అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ డిమాండ్లను 15రోజుల్లో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి ప్రజా కళామండలి నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు ఎకరాకు 25 లక్షల పరిహారం చెల్లించాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**జడ్చర్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ఎకరాకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సందర్శించి, రిజర్వాయర్ ను పరిశీలించారు. నిర్వాసిత రైతులతో సమావేశమై వారి బాధలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవతా దృక్పథంతో భూ నిర్వాసితుల ప్యాకేజీ పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే తాము నష్టపోయిన పాలమూరు, రంగారెడ్డి జిల్లా రైతులు బాగుపడతారని ఆలోచించి ఉదండాపూర్ రైతులు ఉదార స్వభావంతో భూములు ఇచ్చారని, కానీ ఇక్కడి రైతులను ఆదుకోవడంలో మాత్రం అన్ని పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని, పాలమూరు బిడ్డను అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి 80 శాతం పూర్తయిన పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడం లేదని, వెంటనే ప్రాజెక్టు పనులను పూర్తి చేసి, ఇండ్లు, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి డిసెంబర్ 9 లోగా 25 లక్షల పరిహారం అందించేలా చూస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఆర్ ఎన్ ఆర్ ప్యాకేజీ ఏ సమయంలో ఇస్తారో ఆ సమయంలో ఉన్న భూముల ధరల ఆధారంగా వారికి డబ్బులు చెల్లించాలని ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి పరిహారం చెల్లించాలని కోరారు.



కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఉదండాపూర్ భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని మీనాంబరం పరుషవేదిశ్వర స్వామిని జాగృతి అధ్యక్షురాలు కవిత దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గోపాల్ తదితరులు ఉన్నారు.

## పార్కును కాపాడాలంటూ కాలనీవాసుల వినతి



**అల్వాల్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** అల్వాల్ డివిజన్ రామచంద్రపురం హౌసింగ్ కాలనీ పార్కును ఆక్రమణల నుండి రక్షించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న పార్కులో భారీ షెడ్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలుసుకున్న స్థానికులు పార్కు ఎదురుగా "పార్కు సేవ్" అంటూ నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, ఆ ప్రదేశంలో ఇతర నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజు, విజయచారి, శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జునగౌడ్, మురళి, కార్తీక్‌గౌడ్, రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, మహేందర్, భాగ్య, రత్నకుమారి, బాలమణి, శారద తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం గీత కార్మికులకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్రకార్యదర్శి బూడిద గోపి

**చేర్యాల, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రచారంలో కల్లు గీత కార్మికులకు ఎన్నో రకాల హామీలు ఇచ్చారని, కానీ ఇంతవరకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని ప్రైవేట్ పంక్షన్ హాల్ లో కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కమిటి సమావేశం కోహెడ కొమురయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి గోపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రికి, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చామని, ఎక్స్‌గ్రేషియా బాధితులే స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు చేశారని గుర్తు



చేశారు. బ్రతుకుతెరువు కోసం ప్రమాదకరమైనప్పటికీ గీత కార్మికులు తాడి చెట్లు ఎక్కుతున్నారనీ అన్నారు. శాశ్వత వికలాంగులైతే కుటుంబం మొత్తం నరకయాతన అనుభవిస్తున్నారు. వీరికి ఇస్తామన్న ఎక్స్‌గ్రేషియా ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉన్నాయని,ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు, ఏడాది గడిచినా ఇరవై వేలు మించ లేదు,ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్గానిక్, ప్రకృతి పానీయం నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించి, స్వయం సహాయక సంఘాల సభ్యులని కోటీశ్వరులను చేస్తామన్నా మాట ఎటు పోయింది. ప్రతి గ్రామానికి 5 ఎకరాల చొప్పున సొసైటీకి రిజిస్ట్రేషన్ చేసి తాటి ఈత వనాలను పెంచి వాటి ద్వారా వచ్చే నీరా, తాటి, ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోహెడ కొమురయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, వివిధ మండలాల అధ్యక్ష,కార్యదర్శులు అనగొని నర్సింలు,ఆకుల కనకయ్య, పోతుగంటి లింగం,కోల సత్తయ్య,రావుల కమలాకర్, గుడాల గణేష్,పచ్చిమడ్ల రాములు,తాళ్ళపల్లి రాజు, గణబోయిన నర్సింలు,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ హన్మన్లకాడి నవీన్, పవన్,మంతపురి శ్రీకాంత్, పొన్నం రాజు,యూత్ అధ్యక్షులుఆకులప్రదీప్,నాచగిని శ్రీనివాస్,చెప్యాల శ్రీనివాస్, కత్తి మల్లేశం,బూడిద చందు, పొన్నంవెంకటయ్య గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 అక్టోబర్ 2025

# డయాలసిస్ విభాగాన్ని క్రిటికల్ కేర్ యూనిట్‌కు మార్చాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ విభాగాన్ని ఎంసీహెచ్ వెనక నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం జిల్లా కేంద్రం శివారులో ఉన్న మెటర్నటీ చైల్డ్ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీటి నిల్వను పరిశీలించిన కలెక్టర్ నిల్వ లేకుండా చేసేందుకు డ్రైనేజ్ కాలువలను నిర్మించి నీరు బయటకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వెనుక వైపున ఇంకుడు గుంతలను తవ్వించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఎం సి హెచ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రెజర్ ఆక్సిజన్ ప్లాంట్ విభాగాన్ని పరిశీలించి వేగంగా వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. ఎం.సీ.హెచ్ తోపాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో త్వరితగతిన ఆక్సిజన్ వెంటిలేటర్ సదుపాయాన్ని వాడుకలోకి తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీజీఎంఎస్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ విభాగం మొదటి అంతస్తులో ఉన్నందున రోగులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.కాబట్టి నవంబర్ 1 నాటికి జీజీహెచ్ లో ఉన్న డయాలసిస్ విభాగాన్ని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. టీ హబ్ లో రిపేరుకు గురైన బయో కెమిస్ట్రీ యంత్రాన్ని వేగంగా మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూపరింటెంట్ కు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, సూపర్డెంట్ రంగారావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయినాథ్ రెడ్డి, పరిమళ, టిజిఎస్ఎమ్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వరి పంట రకాలను పరిశీలించిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



**చిలప్‌చేడ్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మండలంలోని ఫైజాబాద్, చండూరు గ్రామంలో తెలంగాణ రైతువిజ్ఞాన ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.ఎ.నిర్మల డా. కే.అరుణ వ్యవసాయ పంట పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ముఖ్యంగా వరి పంటలో ప్రస్తుతం చిరు సంచుల ప్రయోగ దశలో ఉన్న వరంగల్ పరిశోధన స్థానం నుండి WGL-1380 అనే మిక్కిలి మధ్యస్థ గింజ మధ్యస్థ వరి రకం పరిశీలించారు ,ఈ యొక్క రకం మధ్యస్థంగా 135 రోజులు కాలములో కోతకు వచ్చును అలాగే ఈ రకం వానకలానికి అనువైన రకం అని తెలిపారు KPS-10642 అనే రకం కూడా సన్న గింజ రకం, ఈ రకం 125 రోజులలో కోతకి వచ్చును అని తెలిపారు, RNRH-235 అనే రకం పంటనీ పరిశీలించారు. టమాటా పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రావ్, బాలరాజు, విక్రం రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ వైపి 1 - కే. ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కౌడిపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిఓ మహిపాల్ రెడ్డి, డి.ఎస్.ఓ, నిత్యానంద్ డిఎంసి ఎస్.జగదీష్, తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారులు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పకడ్బందీ టీమ్ వర్కుతో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రానున్న మూడు రోజుల్లో తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు. కోతలు వాయిదా వేయడం వల్ల ధాన్యం పాడవకుండా ఉంటుందని కోతలు కోయకుండా ఉంటే పంట త్వరగా ఆరడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయాలని ఆదేశించారు. ధాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరుబయట ఉన్న ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్స్ రైతులకు అందుబాటులో ఉంచాలని అన్ని సౌకర్యాలు కల్పించాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. రాబోయే మూడు రోజుల్లో తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందని రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఇప్పటివరకు జిల్లాలో 8442 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విధినిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత, నిజాయితీ అవసరం

● అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి
● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** విధినిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత, నిజాయితీ విలువలను కాపాడడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని కలెక్టర్ పి ప్రవీణ్ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాల్గొని, అధికారులతో కలిసి విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించి, విజిలెన్స్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వృత్తికి విలువతెచ్చేది నైతికత అని , విధినిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత, నిజాయితీ విలువలను కాపాడడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి యొక్క బాధ్యత అని అన్నారు. పారదర్శకత తో మంచి పాలన సాధ్యమవుతుందని, సమగ్రతతో సేవలందించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చని ఆమె సూచించారు.ప్రతి శాఖాధికారి తన కార్యాలయంలో అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో బాధ్యత, సమగ్రత విలువలను పెంపొందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ శ్రుత కీర్తి, ఎస్పీ, రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆరేంపురం యూనిట్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి , సతీష్ రెడ్డి, డీఎస్పి, వివిధ శాఖల అధికారులు, ఆరేంపురం యూనిట్‌కు చెందిన విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీ అవో బంజారా-వజావో నంగారా కార్యక్రమానికి కొమ్మూరికి ఆహ్వానం



**చేర్యాల, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** న్యూ ఢిల్లీలో వచ్చేనెల నవంబర్ 19వ శుక్రవారం నుండి 25 వ తేదీ వరకు బంజారా భారత్ సర్వోత్సవాల కార్యక్రమానికి డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని,బంజారా భారత్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్, మాజీ ఎంపీ ధరవత్ రవీంద్ర నాయక్ ప్రత్యేకంగా ఆహ్వానించడానికి చేర్యాల డిసిసి ఆఫీసులో కలుసుకొని ఢిల్లీ అవో బంజారా - వజావో నంగారా ప్రెస్ నోట్ ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ బంజారా ఆత్మగౌరవ సభకు ప్రతి రాష్ట్రం నుండి ఐదు మంది ముఖ్యమైన ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు అని, న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం లిపిలేని బంజారా భాష గోర్బోలి కి అధికారికంగా లిపిని ప్రకటించాలని,ఒకే సంస్కృతి, సాంప్రదాయాలు కలిగిన 14 కోట్ల జనాభా ఉండి 16 ఉపపేర్లతో పిలువబడే బంజారా సమాజం దేశంలోని 200 రెండువందలు పార్లమెంట్ %ట% 1000 వెయ్యి అసెంబ్లీ స్థానాల్లో గణనీయ నిర్ణాయక సంఖ్య కలిగి ఉన్న కూడా రాజ్యాంగంలో 7-ఏడు రాష్ట్రాల యందు ఆదివాసీ గిరిజనులుగా, 7-రాష్ట్రాల యందు ఎస్సీలుగా, కొన్ని రాష్ట్రాల్లో ఓబీసీలుగా విభజించబడి వివిధ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అన్ని రాష్ట్రాలలో బంజారా సమాజం ఎదుర్కొనే అనేక సమస్యలు పరిష్కరించి వారికి రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కొమ్మూరి మాట్లాడుతూ ఆదివాసీ,బంజారా,గిరిజనుల అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నారని వారిని, వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజె మల్లేశం,చేర్యాల టౌన్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూడైస్ పోర్టల్‌లో డేటా ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలి



**మక్తల్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన వివరాలు యూడైస్ పోర్టల్‌లో ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై మండల విద్యా అధికారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన శిక్షకులుగా వజ్జేల నర్సిములు యూడైస్ పోర్టల్‌లో డేటా ఎంట్రీ విధానం, పాఠశాల స్థాయి వివరాల సరిదిద్దడం, విద్యార్థుల వివరాల నవీకరణ, సిబ్బంది సమాచారం నమోదు వంటి అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. ఈ ట్రైనింగ్ ద్వారా పాఠశాల స్థాయి డేటా నమోదు మరింత సమర్థవంతంగా, తప్పులు లేకుండా జరుగుతుందని మండల విద్యాధికారి అనిల్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సిబ్బంది అల్తాఫ్ హుసేన్, శ్రీనివాసులు, సునీత, పరిమళ, సుగుణ, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత ప్రతిరోజు వ్యాయామం చేయాలి

● తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్




**తూప్రాన్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** యువత క్రీడారంగంలో రాణిస్తూ నిత్యం వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఉండాలని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపారు పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా తూప్రాన్ లో నర్సాపూర్ చౌరస్తా నుండి పెద్ద చెరువు కట్ట వరకు టూ కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగకృష్ణ ఎస్ఐ శివానందం తో పాటు యువకులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకు లు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ భావితరాలకు స్ఫూర్తిదాయకం

● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించబోయే "మేరా యువభారత్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ పోస్టర్ ను విడుదల చేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... దేశసమైక్యతకోసం పోరాడిన మహనీయుడు, ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ ఆశయసాధన మనందరి లక్ష్యం అని అన్నారు. భారతదేశాన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ గా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడు తన వంతు సాయం చేయాలని పిలుపునిచ్చారు. దేశం ముందు , ఆ తర్వాతే ఏదైనా అనే ఆలోచనతో యువత ముందుకు రావాలని అన్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని కళాశాలల్లో ఉపన్యాసాలు, వ్యాసరచన, రంగోలి వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, పోలీస్, విద్య, వైద్య తదితర ప్రభుత్వ శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. అంతకుముందు సంగారెడ్డి జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయములో అక్టోబర్ 31 తేదీ నుండి నవంబర్ 25 వ తేదీ వరకు నిర్వహించబోయే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలపై ఉమ్మడి మెదక్ జిల్లా మేరా యువభారత్ అధికారి రంజిత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగాఆయన మాట్లాడుతూ ... దేశసమైక్యతకోసం పోరాడిన మహనీయుడు, ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ ఆశయసాధన మనందరి లక్ష్యంగా ఆయన 150వ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని , ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్‌నన పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని అన్నారు. ఇందులో భాగంగా ఏక్తా ర్యాలీ (సర్దార్@150 యూనిటీ మార్చ్ పేరుతో పాదయాత్ర , కలిసి నడుద్దాం.. విజయవంతంచేద్దాం, ఈ ఏక్తా ర్యాలీ కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు . నిర్వహించబోయే కార్యక్రమాలు ఈనెల 31 న సర్దార్ పటేల్ విగ్రహాలకు నివాళులు, - కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా లోని ఐ. బి గెస్ట్ హౌస్ నుండి నుంచి పోతిరెడ్డి చౌరస్తా, వరకు ఏక్త మార్చ్, కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో ఈ ఏకతా మార్చ్ నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు ఈ ఏక్తా యాత్రలు నిర్వహించబోతున్నామని తెలిపారు. సంగారెడిలో నిర్వహించబోయే మేరా యువ భారత్ ఏక్తా ర్యాలీ లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కాశిం బేగ్, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్లు రాజు గౌడ్, పాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌పై అవగాహన



**రాజాపూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో గల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపూర్ పాఠశాలకు సమాజం వైపు శీసుకెళ్లడంలో భాగంగా పోలీసుల సైబర్ సెక్యూరిటీ మరియు సేఫ్టీ, ఓపెన్ హౌస్ సెషన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు రాజాపూర్ మండలం లో ఉన్నటువంటి పోలీస్ స్టేషన్ సందర్శించినైనది. ఇట్టి సందర్భంలో భాగంగా పోలీస్ స్టేషన్ లో నిర్వహించేటువంటి విధులు మరియు వారి బాధ్యతల గురించి తెలుసుకోనైనది స్థానిక ఎస్సై శివానందం వారి సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సమాజం పట్ల బాధ్యతలు సమాజంలో జరుగుతున్నటువంటి వివిధ రకాల నేరాలు, ముఖ్యంగా విద్యార్థినిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాలు లైంగిక వేధింపులు ఆపత్కాలంలో మన ప్రతిస్పన ఏ విధంగా ఉండాలి ఆ సమయంలో 1098 మరియు 100 డైల్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఏదైనా ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ ను ఏ విధంగా సంప్రదించాలి కంప్లైంట్ ఏ విధంగా చేయాలి కంప్లైంట్ చేసిన అనంతరము చేసేటువంటి ఎఫ్ఐఆర్ మొదలుకు అంశాల గురించి వివరించారు గ్రామంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసినటువంటి సీసీ కెమెరాలు పనితీరును వివరించారు ఇట్టి కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం సూచనల అనుసారం ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు మోజెస్, హనుమప్ప,ఎల్లయ్య, దివాకర్ రాజ్, వెంకటేశ్వర శెట్టి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాధిక, పద్మావతి, సరోజ పాల్గొన్నారు.

# ఓపెన్‌హౌస్ విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహనకు వేదిక

● వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ (ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో "ఓపెన్ హౌస్" కార్యక్రమానికి వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, వనపర్తి సీఐ కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. వనపర్తి పట్టణంలోని వివిధ విద్యాసంస్థల నుండి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొని పోలీసు వ్యవస్థ, చట్టపరమైన విధులు, సాంకేతిక పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన పొందారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... పోలీసులు కేవలం నేరస్తులను పట్టుకోవడమే కాదుబీ సమాజంలో చట్టపరమైన అవగాహన పెంపు, భద్రతా వాతావరణం నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఏంటో తెలుసుకోవాలి. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి," అని సూచించారు. అలాగే సైబర్ మోసాల నివారణకు 1930 టోల్‌ఫ్రీ నంబర్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, మహిళల భద్రత కోసం భరోసా కేంద్రం, షీ టీమ్స్, డ్రగ్స్ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది షీ టీమ్, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, నార్కొటిక్ (డ్రగ్స్), కమ్యూనికేషన్, యూనిట్లకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫింగర్ ప్రింట్ పరికరాల వినియోగం, డయల్ 100 సేవలు,ప్రదర్శన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపగా, పోలీసు-ప్రజల మధ్య అవగాహనా వంతెనగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణయ్య, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, రాంబాబు, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్, చెన్నమ్మ తామస్ షి టీమ్ ఎస్సై అంజద్, ట్రాఫిక్ ఎస్సై సురేందర్, పట్టణ ఎస్సైలు హరిప్రసాద్, శశిధర్, షీ టీం, భరోసా, నార్కొటిక్ (డ్రగ్స్), యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ అధికారులు, సిబ్బంది వివిధ కళాశాల, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నివర్గాల అభివృద్ధికి కృషి

- మత్స్యశాఖను ప్రోత్సహించేందుకు రూ.123 కోట్లు కేటాయించిన సీఎం
- పగడ్బందీగా చేపల పెంపకం చేపట్టాం
- వ్యవసాయంతో పాటు పాడి, మత్స్య పరిశ్రమలు అవసరం
- మంత్రి వాకిటి శ్రీహరి
- రేగొండ, గణపురం మండలాల్లో పర్యటన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సంక్షేమ పథకాలు పేదల దరికి చేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, అంచెలంచెలుగా అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, మత్స్యశాఖను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి రూ.123 కోట్లు కేటాయించారని, ఇందులో భాగంగా పగడ్బందీగా చేపల పెంపకం కార్యక్రమం చేపట్టామని రాష్ట్ర మత్స్య, పాడి, పశు సంవర్ధక యువజన సర్వీసులు క్రీడలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం రిజర్వాయర్ లో 14 లక్షల 50 వేల సైజు గలిగిన 21 లక్షల 21 వేల రూపాయల విలువైన చేప పిల్లలను నూరు శాతం సబ్సిడీపై భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్య సహకార సంఘాల చైర్మన్లు తదితరులతో కలిసి మంత్రి చెరువులో చేప పిల్లలు వేశారు. ఈ సందర్భంగా గణపురం సెంటర్ లో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ భూపాలపల్లి శాసనసభ్యులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయక గెలిచిన రెండు సంవత్సరాలలో సుమారు 450 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ముదిరాజ్ సామాజిక వర్గానికి మొట్టమొదటిసారి మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. చేపలు వ్యాపారం ద్వారా మత్స్యకారులు వ్యాపారులుగా ఎదగాలని తెలిపారు. మొబైల్ వాహనాలు ద్వారా చేపల విక్రయానికి 80 వాహనాలు మంజూరు చేశామని తెలిపారు. మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం 123 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి అజెండాతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజల సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. యువత మత్తు వదిలి గ్రౌండ్ బాట పట్టాలని జిల్లాలో క్రీడా మైదానాలు నిర్మాణానికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

**పాడి పరిశ్రమ, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి**

రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ, వ్యవసాయ అభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మంగళవారం రేగొండ మండల కేంద్రంలోని గుడ్ లైఫ్ పాఠశాల మైదానంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గాలికుంటి వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి, మత్స్య సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయి కుమార్ లతో కలిసి మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెంపు, పశువుల సంతానోత్పత్తికి గాలికుంటు వ్యాధి విఘాతం కలుగకుండా వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 26 లక్షల పశువులకు 26 లక్షల 55 వేల టీకాలు వేయడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 25 వేల టీకాలు పూర్తయ్యాయి అని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన గాలి కుంటు వ్యాధి వచ్చేనెల వరకు జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పాడి పరిశ్రమ, వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం కారణంగా నష్టాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ కుమార్ స్వామి, చిట్యాల, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు గుమ్మడి శ్రీదేవి, గూటోజు కిష్టయ్య, సింగిల్ విండో చైర్మన్ విజ్జన్ రావు మత్స్య సహకార సంఘాల చైర్మన్లు రాజు, మహేష్, జిల్లా మత్స్య శాఖ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఎంజెపి గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 28 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా గూడెప్పాడ్ వద్ద ఉన్న ఆత్మకూరు మండలం పెద్దాపూర్ కు సంబంధించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 8,9,10వ తరగతుల విద్యార్థినులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి విద్యా ప్రగతిని, పాఠశాల వసతులను గురించి విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలోని కిచెన్ షెడ్ ను పరిశీలించి వంట నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

- దీన్ దయాల్ ట్రైనింగ్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 28 (జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో యువతకు ఉద్యోగ, ఉప్పద అవకాశాలు కల్పించే చక్కటి సదవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ని బాలాజీ నగర్ లో గల సుప్రభాత్ స్కూల్లో ఏర్పాటుచేసిన దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేష్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందని అన్నారు. అందులో భాగంగానే మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశంలో శక్తివంతమైన, నైపుణ్యం గల ఉద్యోగులను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో కా గజ్ నగర్ పట్టణానికి ఈ శిక్షణ కేంద్రం మంజూరు కావడం అదృష్టం అన్నారు. సమాజంలో ఎస్సీ ,ఎస్టీ, బిసి , మైనారిటీ కులాల్ చెందిన వారు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుల తోనే ఉద్యోగాలు రాక చిన్నపాటి ఉపాధి అవకాశాలు వెతుక్కుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఈ డీ ఈజీ ఎం ఎస్ కృష్ణ, తాహసిల్దార్ మధుకర్ సుప్రభాత స్కూల్ చైర్మన్ గణపురం మురళీధర్ పాల్గొన్నారు.

## పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి): ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్న పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా గాయత్రీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ను మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌస్ విక్షించేందుకు నగరంలోని పలు విద్యా సంస్థల నుండి వచ్చిన విద్యార్థులకు, పోలీసులు నిర్వహిస్తున్న విధులు, వారు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, అలాగే బాంబు డిస్పొజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది చిన్నారులకు వివరించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... తమ కుటుంబ క్షేమం కన్నా.. సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేనని, పోలీసులను మీ స్నేహితులుగా భావించాలని, ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను మరువవద్దని తెలిపారు. ఈ కార్యక్రమం లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ పండేరి చేతన్, సిఐ సత్యనారాయణ, ఎస్.ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలంలో మత్స్యకారులకు జాగ్రత్తలు

- మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ జి.గణేష్



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అకాలభారీ వర్షాల వలన చేపల పెంపకదారులు నష్టపోయే అవకాశం ఉంది కావున మత్స్యకార రైతులను ఉద్దేశించి వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్.జి.గణేష్ సలహాలు,సూచనలు ఇచ్చారు. భారీ వర్షాలు లేదా వరదలు సంభవించినప్పుడు చేపల చెరువులు, వాటి పరిసరాల్లో పలు సమస్యలు ఎదురవుతాయని, ముఖ్యంగా నీటి మట్టం అధికమవడం, ప్రాణవాయువు లోపం, చెరువుల కట్టలు తెగిపోవడం,వ్యాధుల వ్యాప్తి వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. చెరువు కట్టలు బలంగా ఉన్నాయో లేదో ముందుగానే తనిఖీ చేయాలని, పగుళ్లు లేదా చీలికలు ఉంటే తక్షణమే మట్టి లేదా కంకరతో మరమ్మతు చేసుకోవాలి. వర్షపు నీరు చెరువులోకి ఒకే దిశలో చేరేలా సరైన ఇన్‌లెట్, అవుట్‌లెట్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అధిక వర్షాల సమయంలో నీటి మట్టం ఎక్కువైతే, అవుట్‌లెట్ ద్వారా నీటిని మెల్లగా విడుదల చేయాలని, చేపలు బయటకు పారిపోకుండా నెట్ లేదా జాలి గేట్లు అమర్చాలని సూచించారు.

మబ్బుగా ఉన్న సమయంలో లేదా వర్షం తరువాత ఎరియేటర్లు ఉపయోగించి నీటిలో కరిగి ఉన్న ప్రాణవాయువు స్థాయిని పెంచాలని, చేపలు నీటి పైన తేలుతూ కనిపిస్తే,తక్షణమే తాజా నీరు చేర్చడం లేదా సున్నం చల్లడం చేయాలని సూచించారు. వర్షాకాలంలో లేదా వరదలు సంభవించినప్పుడు చేపల చెరువులో నీటి నాణ్యతను సమతుల్యంగా ఉంచడం అత్యంత అవసరమని, చెరువులో పీహెచ్ స్థాయి 7.0-8.5 ఉండేటట్లు చూసుకోవాలి అలాగే నీటిలో కరిగి ఉన్న డివో 5-8 ఎం జి / ఎల్ గా, ఆల్కలినిటీ 80- 150 ఎం జి / ఎల్ మధ్య ఉండేలా చూసుకోవాలని, పీహెచ్ తగ్గినప్పుడు లేదా నీరు ఆమ్లత్వం కనబరిస్తే అగ్రికల్చర్ లైమ సిఏ సిఓ3 100- 200 కేజీ /హెచ్ ఎ మోతాదులో వేయాలని, నీరు క్షారత్వం ఎక్కువగా ఉన్నప్పుడు జిప్సం సి ఏ ఎస్ ఓ4 200- 250 కేజీ/ హెచ్ఏ వాడాలి. అదనంగా, ఎరియేటర్లు ఉపయోగించడం ద్వారా ప్రాణవాయువు స్థాయి స్థిరంగా ఉంచి చేపల ఆరోగ్యాన్ని కాపాడుకోవచని సూచించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో విజిలెన్స్ వారోత్సవాల సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఈ నెల 27వ తేదీ నుండి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతగా పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తూ అవినీతి, అక్రమాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న రెండు రోజులు మొంథా తుఫాన్ ప్రభావం

- అధికారులు అలెర్ట్‌గా ఉండాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ (ప్రతినిధి, అక్టోబర్ 28 జనం సాక్షి):** మొంథా తుఫాన్ ప్రభావం వల్ల రైతులు రాబోయే 2 రోజుల పాటు పంట కోతలు వాయిదా వేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,అదనపు కలెక్టర్ జి సంధ్య రాణి, ప్రభుత్వ ఆదేశాల మేరకు వాతావరణ శాఖ హెచ్చరికల ననుసరించి లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో పాటు జిల్లా ప్రత్యేక అధికారులు ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారులతో ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్ లో తుఫాన్ ప్రభావాన్ని బట్టి రెండు రోజులు రైతులు వరి కోతలు చేపట్టవదని, ఇప్పటికే వరి కోతలు చేపట్టిన రైతులు వరి తడవకుండా తర్పాలిన్ తో కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పరిధుల్లో పంచాయతీ సెక్రటరీలు గ్రామాలలో టాం టాం వేయించాలని, అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలలో విస్తృతంగా పర్యటించి రైతులకు ముఖ్య సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. జిల్లాలోని రైతుల పంట విస్తీర్ణం, ఆ విస్తీర్ణంలో ఏ పంటలు,ఏ మేరకు వేశారో కూడా మండల్ అగ్రికల్చర్ అధికారుల నివేదికలు తయారు చేయాలన్నారు. తద్వారా వాటి ఆధారంగా పిపిసి సెంటర్లకి వరి ధాన్యం, జొన్న,మొక్కజొన్న, కాటన్ ఏ మేరకు , ఏ ఏ పిపి సి సెంటర్లకు రావచ్చు అనేది ముందస్తు ప్రణాళికలు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నివేదికలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు రైతులకు వరి కోతల చేపట్టుటల్లో మెలకువలు తెలియజేయాలని, అదేవిధంగా పిపిసి సెంటర్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని వారు పేర్కొన్నారు. పిపిసి సెంటర్ల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. డిసిఎస్ఓ కార్యాలయంలో హెల్ప్ డేస్ ఏర్పాటు చేసి హెల్ప్ లైన్ నెంబర్ 7995050785 ద్వారా రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం అలర్ట్‌గా ఉందని తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఎలాంటి సంఘటన జరగకుండా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఆర్టీసీ మరియు స్కూల్ పిల్లల విషయంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియపరుస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ మండలాల తహసిల్దార్ల, మరియు మండల అగ్రికల్చర్ అధికారుల, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వారికి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని,రైతులకు ఎలాంటి పంట నష్టం,ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధ, డి సి ఓ నీరజ, డి సి ఎస్ ఓ కిష్టయ్య, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఎంవో సురేఖ, డి ఎం మార్క్ఫెడ్ రంజిత్, జిఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి,డి యం అండ్ హెచ్ ఓ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి విబి నిర్మలా గీతాంబ




**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** రెనోవా బన్ను క్యాన్సర్ హాస్పిటల్స్ వారు నిర్వహించిన 'వాకథాన్'లో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి..నిర్మలా గీతాంబ మాట్లాడుతూ "క్యాన్సర్ మహమ్మారిని ముందే గ్రహించగలిగితే, దాని నివారణ సులభతరం అవుతుందని, తద్వారా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చని తెలిపారు. సరైన అవగాహన లేక మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని, భయం కన్నా ప్రాణం విలువైనదని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలకు నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్ ను మొదటి దశలోనే ఆపడం సులభతరమని పేర్కొన్నారు. క్యాన్సర్ మహమ్మారి నుండి కోలుకున్న వారిని ఉదాహరణగా తీసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండి, సరైన నియమ నిబంధనలు పాటిస్తే క్యాన్సర్ ను ఎదుర్కొనవచ్చును అని తెలిపారు. రెగ్యులర్గా పరీక్షలు చేయించుకోవడం మనకి, మన కుటుంబానికి మనం ఇచ్చే గొప్ప బహుమతిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, వరంగల్ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వలుస.సుధీర్, రెనోవ బన్ను క్యాన్సర్ హాస్పిటల్ నుండి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివకుమార్, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ తరుణ్ రెడ్డి, డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు రోడ్డు నుండి హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

## డ్రైన్‌లలో చెత్త వేస్తే జరిమానాలు విధించండి

- పాపయ్య పేట చమాన్, ఎల్లం బజార్, పోతన ట్రాన్స్ ఫర్ స్టేషన్ లలో క్షేత్ర స్థాయి లో పర్యటన...



**వరంగల్ ఎంజీఎం అక్టోబర్ 28(జనంసాక్షి):** డ్రైన్ లలో చెత్త వేస్తే జరిమానాలు విధించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శానిటేషన్ పర్యటన లో భాగం గా 24 వ డివిజన్ పరిధి పాపయ్య పేట చమాన్ ఎల్లం బజార్ తో పాటు పోతన నగర్ లోగల ట్రాన్స్ ఫర్ స్టేషన్ లలో క్షేత్ర స్థాయి లో పర్యటించి సమర్థనిర్వహణకు అధికారులకు తగుసూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ 24 వ డివిజన్ పాపయ్య పేట చమాన్ ప్రాంతం లో పర్యటించి స్వచ్ఛ ఆటో లకు రూట్ ఆప్టిమైజేషన్ లో భాగం గా అప్ ద్వారా ఒక మార్గాన్ని నిర్దేశించిన తరుణం లో ఆ రూట్ లో ఆయా గృహాలకు స్వచ్ఛ ఆటో వెళుతుందా లేదా ధ్రువీకరణ కోసం కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆయా గృహాలకు వెళ్లి స్వచ్ఛ ఆటో వస్తుందా అని కమిషనర్ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది స్థానికులు డ్రైన్ లో చెత్త వేయడాన్ని గమనించి అలాంటి వారికి అవగాహన కలిగించాలని వారి ధోరణి లో మార్పు రాకుంటే జరిమానాలు విధించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఎల్లంబజార్ ప్రాంతం లో తోపుడు బండి పై టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న తరుణం లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ లను వారి వద్ద ఉన్నాయని గమనించి వాటి అనర్థాలను వివరించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తారని హెచ్చరించారు. అనంతరం పోతన నగర్ లో గల సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో పర్యటించి నిర్వహణ తీరును. కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఎం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, ఏ ఈ హబీబ్, ఐ టి మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

## సాయి ప్లైవుడ్ షాప్‌లో దొంగతనం

- రూ.12 లక్షలు అపహరణ
- పరిశీలించిన ఏఎస్‌పి శభం నగరాలే



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని జేపీఎన్ రోడ్లో ఓ ప్లైవుడ్ హార్డ్వేర్ షాప్ లో దొంగతనం జరిగిన సంఘటన చోటుచేసుకుంది. ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.జె పి ఎన్ రోడ్ లోని సాయి ప్లైవుడ్ మరియు హార్డ్వేర్ షాప్ యజమాని పసుపు నూతి శ్రీనివాస్ సోమవారం రాత్రి అందాద 10 గంటలకు అనగా (తేదీ: 27.10.2025) షాప్ క్లోజ్ చేసుకుని వెళ్లి తిరిగి మంగళవారం అనగా తేదీ 28. 10.2025 ఉదయం 10 గంటలకు షాపు ఓపెన్ చేయడానికి వచ్చేసరికి అప్పటికే షాపు లో ఎవరో గుర్తు తెలియని దొంగలు చొరబడి అందులో వ్యాపారానికి సంబంధించిన 12 లక్షల రూపాయలు ఉండగా వాటిని దొంగిలించుకుని వెళ్ళినారని షాపు యజమాని వచ్చి దరఖాస్తు ఇవ్వడం జరిగింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నేర స్థలమును వరంగల్ ఏఎస్పి శుభం నగరాలే , ఇంతజార్గంజ్ పోలీసులు పరీక్షించి విచారణ చేపట్టడం జరిగింది.

# పేద కుటుంబాల ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి

● ఎమ్మెల్యే మట్టా రాగమయి స్పష్టం



**కల్లూరు, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆసరాగా వివాహ సమయంలో ఆదుకునేందుకు ఆర్థిక చేయూతగా కళ్యాణ లక్ష్మి పథకం నిలుస్తుందని సత్తుపల్లిఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. మంగళవారం కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని టీటీడీ కళ్యాణ మండపంలో తాసిల్దార్ పులి సాంబశివుడు అధ్యక్షతన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి మండలంలోని 49 మంది లబ్ధిదారులకు 49 లక్షల 5,684 వేలరూపాయలు విలువ గల చెక్కులను అందజేశారు. తొలుత మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల కార్యక్రమంలో పాల్గొని అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి భారీ కేకను కట్ చేసి పొంగులేటి శ్రీను అన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడారు. అర్హులైన వారందరూ కళ్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు సొంత ఇంటికలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వంలో మన అందరి అన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయటం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తాసిల్దార్ పులి సాంబశివుడు మున్సిపాలిటీ మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరరావు, ఎంపీడీవో చంద్రశేఖర్ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, ప్రముఖ కాంట్రాక్టర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజలకు సుపరిపాలన అందించాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు సుపరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సరియైన రీతిలో ప్రజలకు చేరే విధంగా అధికారులు పారదర్శకతతో, బాధ్యతగా విధులు నిర్వహించి నియమ నిబంధనలు పాటిస్తూ అర్హులైన వారిని మాత్రమే గుర్తించాలని సూచించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ క్షేత్రస్థాయిలో అధికారులు విధి నిర్వహణలో ఏమైనా తప్పు చేసిన,లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా అవకతవకలు జరిగిన లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అధికారులు భాద్యతతో నిజాయితీగా,నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మంచిగా సేవ చేయాలని కోరారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 14432 గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.అనంతరం విజిలెన్స్ పోస్టర్ ను ఆవిష్కరించి అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామరావు,విజిలెన్స్ అధికారులు దశరథ, రాంబాబు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# మధిరలో విద్యుత్ రంగం ఆధునీకరణకు నాంది



**మధిర, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో కూడా మధిర పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా దిశగా చర్యలు చేపట్టామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.డిప్యూటీ సి.ఎం. మంగళవారం మధిర పట్టణంలో పర్యటించి 27.76 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం నెరవేరాలంటే విద్యుత్ శాఖ చాలా కీలకమని, ప్రతి రంగ అభివృద్ధికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కీలకమని అన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగాలని పాలసీలను రూపొందించుకొని ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తుందని తెలిపారు.పట్టణ ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని అన్నారు. మధిర పట్టణ పరిధిలో ముందస్తుగా 27 కోట్ల 76 లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ 3.5 కిమీ 33 కేవి లైన్, 17.3 కిలో మీటర్ల 11కేవి లైన్, 15 కిలోమీటర్ల ఎల్.టీ. లైన్ భూగర్భంలో వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర హస్తకళల సంస్థ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఆర్ అండ్ బి ఇఇ తానేశ్వర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

**కోదాడ, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో మొదటి వార్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒరిగినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదనీ వార్డు సభ్యులు రెడ్డపంగు సాయికుమార్ ఆరోపించారు.విద్యుత్ స్తంభం ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలుమార్లు స్తంభాన్ని తొలగించాలని సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణనష్టం జరగకముందే స్తంభాన్ని తొలగించాలని అధికారులను కోరుతున్నారు.



# ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఆయనకు చదవంటే ప్రాణం, విద్యార్థులు అంటే ఇష్టం, ఆయన జిల్లాకే బాస్.అయితేనేం విద్యార్థులు కనబడగానే తానొక ఉపాధ్యాయుడిగా మారిపోతారు ఆయనే సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.ఆయన ఎక్కడికి వెళ్లినా తప్పనిసరిగా ఒక పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటిస్తే కానీ తృప్తి చెందరు. చదువే అన్నింటికీ మూలమని ప్రగాఢంగా విశ్వసించే జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రతిరోజు తన పర్యటనలో భాగంగా ఒక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తానే ఒక ఉపాధ్యాయుడిగా మారతారు.ఇందులో భాగంగానే మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. వెంటనే 4,5వ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.వారితో ఇంగ్లీషు చదివించి తెలుగులో అర్థాలను అడిగి తెలుసుకున్నారు.అంతటితో ఆగకుండా గణితంలో సంకలనం, వ్యవకలనం, గుణాంకాలను బోర్డుపై లెక్కలు చేయించి వారితోనే సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ వెంట డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు ధర్మయ్య, నీరజ, సుధారాణి, వెంకన్న ఉన్నారు.

# ప్రజాభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**కామేపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలో పలు గ్రామాలలోజరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని పొన్నెకల్లు గ్రామంలో పేదలకు నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహ సముదాయాన్ని పరిశీలించారు.బర్ల గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కొమ్మినేపల్లి రైతువేదికలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన పోషణ మాసోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల తల్లులకు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యకరమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ఇతర ఆహార పదార్థాలను నాణ్యతతో ఎప్పటికప్పుడు అందించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని భారీ కేకును డిసిసిబి డైరెక్టర్ మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో కట్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర



అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్,కొండాయి గూడెం సొసైటీ చైర్మన్ డి హనుమంతరావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, తహసిల్దార్ సుధాకర్ ఎంపీడీవో రవీందర్, సిడిపిఓ దయామణి ఎస్సై శ్రీకాంత్,ఐసిడిఎస్ సూపర్వైజర్లు కృష్ణకుమారి, లలితమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నెమ్మికల్ బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు



**ఆత్మకూర్ ఎస్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన వెల్గూరి రాజేష్, లిఖిత దంపతుల కుమారుడు అద్వైత్(23 నెలలు) అతి చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించాడు. అద్వైత్ చిన్నప్పటినుంచి యాక్టివ్ గా ఉండడం గమనించిన తల్లి లిఖిత ప్రతిరోజు వివిధ రకాల అంశాలను చెబుతూ ఉండేది. బాబు 26 ఆంగ్ల వర్ణమాల పదాలు, 9 మంచి అలవాట్లు, ఐదు రకాల వాహనాలు, 9 మంది స్వతంత్ర సమరయోధుల పేర్లు, 10 శరీర భాగాలు, 10 రకాల జంతువులు, 12 రకాల ఫలాలు, నాలుగు రకాల రంగులను, అతి చిన్న వయసులోనే వివిధ కేటగిరీలలో 10 అంశాలను గుర్తించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రశంసా పత్రం, మెడల్ ను బహుకరించారు. అతి చిన్న వయసులోనే బాబు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించడంపై తల్లిదండ్రులు రాజేష్ లిఖిత దంపతులను నెమ్మికల్ గ్రామస్తులు అభినందించారు. మున్ముందు అద్వైత్ ఇలాంటివి మరెన్నో సంపాదించి నెమ్మికల్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఐకెపి కేంద్రాలను 2004లో తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని యండ్లపల్లి, హనుమతండా, బాలెంల గ్రామాలలో హకా, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ధాన్యాన్ని తీసుకువచ్చేటప్పుడు ఆరబెట్టుకొని, తేమ శాతం లేకుండా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఐకెపి సెంటర్లలో ధాన్యం వర్షాలకు తడవకుండా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో దగ్ధమైన కారు..

● పార్కింగ్ చేస్తుండగా చెలరేగిన మంటలు..



**దమ్మపేట, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** దమ్మపేట మండల కేంద్రంలో కారు దగ్ధమైన సంఘటన నెలకొంది.మండల కేంద్రం బాలాజీ నగర్ చెందిన వ్యక్తి ఇంటి ముందు కార్ పార్క్ చేస్తుండగా కారు ముందు భాగం ఇంజిన్ నుంచి దట్టమైన పొగరావటం గమనించి అప్రమత్తమై వెంటనే కారుల నుంచి దిగాడు.క్షణాల్లోనే కారులో మంటలు చెలరేగాయి.ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసే లోపే కారు పూర్తిగా కలి బూడిదైంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారులో షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయని తెలిపారు.జనావాసాల మధ్య ఈ సంఘటన జరగటంతో చుట్టుపక్క ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**రామన్నపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంత రావు.. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఎంత మంది సిబ్బంది విధులకు హాజరు అయ్యారని రిజిస్టర్ ను పరిశీలించారు. విధులకు అనధికార గైర్హాజర్ అయిన ఆయుర్వేదిక్ డాక్టర్ ను సస్పెండ్ చేస్తూ మిగతా వైద్యులకు షోకాస్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ చిన్ను నాయక్, తాసిల్దార్ లాల్ బహదూర్, వైద్యులు శ్రీనివాస్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి చదువుతోనే ఉజ్వల భవిష్యత్..

**మణుగూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జూనియర్ కళాశాలల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై, కళాశాలల్లో చేరికలు, ఉత్తీర్ణత శాతం, అవసరమైన మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రిన్సిపాల్‌లు ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించగా, తరగతి గదులు, లీకేజీ నివారణ, విద్యుతీకరణ, త్రాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ పనులను పర్యవేక్షించాలన్నారు. విద్యుతీకరణ పనులు అన్ని డిజిటల్ తరగతుల నిర్వహణకు అనుగుణంగా చేయాలని సూచించారు.

### మెరుగైన విద్య అందించాలి

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ విషయాన్ని గ్రామస్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేసే బాధ్యత అందరి మీద ఉందన్నారు.

### ఉత్తీర్ణత శాతం పెంచాలి

జిల్లాలోని ప్రతి కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలించి, తక్కువ ఫలితాలు నమోదైన కళాశాలల కారణాలను విశ్లేషించారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

అన్ని జూనియర్ కళాశాలలో 15 రోజుల్లోగా యూడీసీ పోర్టల్, ఎఫ్.ఆర్.ఎస్. రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేయాలని, విద్యార్థుల ఆధార్ సవరణలు, నవీకరణల కోసం కళాశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహించాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ లు, ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది, విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్ మరియు సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






### ఇరవై ఏళ్లుగా మైక్రోసాఫ్ట్‌లో జాబ్..

## లేఆఫ్ తర్వాత ఏం చేస్తున్నారంటే..

**న్యూఢిల్లీ:**చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటు కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల్లోనూ లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కంపెనీలో ఎన్ని ఏళ్లు పని చేశారని కాకుండా, చాలా కోణాల్లో ఆలోచించి సంస్థలు తమ ఉద్యోగులను ఇంటికి పంపించేస్తున్నాయి. ఇటీవల మైక్రోసాఫ్ట్‌లో ఇరవై సంవత్సరాలకు పైగా పని చేసిన జో్ఫ్రెండ్(62) అనే ఉద్యోగి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. తాను మైక్రోసాఫ్ట్ సంస్థలో కొనసాగాలనే ఉద్దేశంతో 65 ఏళ్ల వరకు కెరియర్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నట్లు అందులో చెప్పారు. అయితే మే 2025లో కంపెనీ తీసుకున్న నిర్ణయం వల్ల తాను



తీవ్ర ఆందోళనకు గురైనట్లు చెప్పారు. జో్ఫ్రెండ్ చేసిన పోస్ట్ ప్రకారం.. 'మైక్రోసాఫ్ట్ కంపెనీలో 20 ఏళ్లకుపైగా పని చేశాను. మే 2025లో కంపెనీ లేఆఫ్స్ ప్రకటిస్తున్నట్లు చెప్పింది. నాకు పెద్దగా ఆశ్చర్యం కలగలేదు. అయితే అందులో నా పేరు ఉన్నందుకు చాలా ఆందోళన చెందాను. కంపెనీలోని ఓ విభాగంలో తొమ్మిది మందితో కూడిన బృందాన్ని పర్యవేక్షించేవాడిని. ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించాను. నాతోపాటు 14 మంది సహోద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించారు. నేను ఉద్యోగంలో చేరిన కొద్ది రోజుల్లోనే మైక్రోసాఫ్ట్ సంస్థలో కొనసాగాలనే ఉద్దేశంతో 65 ఏళ్ల వరకు కెరియర్‌ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నాను. కానీ కంపెనీ లేఆఫ్స్ ప్రకటన చాలా ఆందోళనకు గురిచేసింది' అన్నారు. 'ఉద్యోగ మార్కెట్‌లోకి వెంటనే తిరిగి వెళ్లే బదులు ఈ మార్పును జీవితంలో కొత్త అధ్యాయానికి నాందిగా చూస్తున్నాను. నేను ఇటీవల ఓ ఆర్థిక సలహాదారుడిని కలిశాను. ఈ వ్యవహారాన్ని 'సెమీ-రిటైర్డ్' అని భావించాలని సూచించారు. ప్రస్తుతం యువ వ్యవస్థాపకులకు మార్గనిర్దేశం చేయడంలో, వ్యాపారాన్ని నిర్మించడంలో అధిక సమయం గడుపుతున్నాను' అని చెప్పారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రియాలిటీ, ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నేల చూపులు చూశాయి. దీనికితోడు గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలు ఒత్తిళ్లు ఎదుర్కొన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,625.71 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,778.84) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లోకి వచ్చిన




సూచీ.. తర్వాత మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 84,219.39 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 150.68 పాయింట్ల నష్టంతో 84,628.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.85 పాయింట్ల నష్టంతో 25,936.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి.

## షేర్ల విక్రయాలు - పన్ను మినహాయింపు

ప్ర.మా దగ్గర ఈక్విటీ షేర్లు ఉన్నాయి. అవన్నీ లిస్టెడ్..లాంగ్ టర్మ్. మూలధన లాభాల నుంచి మినహాయింపు పొందాలంటే సెక్షన్లలో నిర్దేశించిన విధంగా ఇన్వెస్ట్ చేస్తేనే మినహాయింపు ఇస్తారు. ఉదాహరణకు, ఇల్లు, భూమి.. రెండూ.. ఇటువంటివి అమ్మి, షరతులకు లోబడి మళ్లీ ఇళ్లు కొంటే మినహాయింపు ఇస్తారు. ఇలాంటి మినహాయింపు షేర్ల విషయంలో ఒక ఇంటికి తప్ప దేనికి లేదనే చెప్పాలి. బాండ్లకి మినహాయింపు లేదు. ఇల్లు అమ్మి, ఇల్లు కొంటే మినహాయింపు.. అలాగే ల్యాండ్, ఇండస్ట్రియల్ హబ్. కానీ బంగారం అమ్మి బంగారం కొంటే మినహాయింపు లేదు. అలాగే, వెండి, ఆభరణాలు కూడా. అయితే, మినహాయింపు విషయంలో ఒక్క గుర్తింపు పొందిన బాండ్లకు మాత్రం అవకాశం ఉంటుంది. అవేమిటంటే, నేషనల్ హైవే, రూరల్ ఎలక్ట్రిఫికేషన్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ బాండ్లు, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ బాండ్లు. ఇళ్లు మళ్లీ కొనుక్కోకపోయినా ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తే మినహాయింపు దొరుకుతుంది. ఇదొక మంచి అవకాశం. ఇక షేర్స్ విషయానికొస్తే.. లాంగ్ టర్మ్ అయి.. అంటే ఏడాది దాటి ఉండాలి ఇటువంటివి అమ్మితే ఏర్పడ్డ లాభాలకు సంబంధించి విషయాలను తెలుసుకుందాం. అలా ఏర్పడ్డ లాభాల మీద మొదటి రూ. 1,25,000లకు మినహాయింపు, బేసిక్‌గా దొరుకుతుంది. జీతంలో స్టాండర్డ్ డిడక్షన్‌లాగా. మిగతా లాభం మీద 12.5 శాతం పన్ను విధిస్తారు. మీ ఆలోచన లిస్టెడ్ షేర్ల మీదే ఉండాలి. హోల్డింగ్ పీరియడ్ ఏడాది దాటాలి. ఇక మీ చేతిలో ఉన్న మొత్తం మీ ఇష్టం. బంగారమే కొంటారో. వెండి కొంటారో .. పిల్ల పెళ్లో.. అబ్బాయి చదువో.. ల్యాండో. ఎలాగూ అమ్మే ముందు లాభం తెలుస్తుంది, కాబట్టి ఆ లాభం సుమారుగా రూ. 1,12,500 లోపల ఉంటుంది. కాబట్టి ఎటువంటి పన్ను భారం ఉండదు. ట్రెండింగ్‌లో కొన్న షేర్లు నష్టాలబాటలో ఉంటాయి. వాటిని వదిలించుకోండి. నష్టం ఏర్పడుతుంది. ఆ నష్టాన్ని మిగతా, మూలధన లాభంతో (షేర్ల మీద) సర్దుబాటు చేసుకోవచ్చు. మొత్తం మీద బేసిక్




లిమిట్ దాటకుండా ఉంటే, ఇప్పుడు మంచి షేర్లలో ఇన్వెస్ట్ చేయండి. పన్ను భారం ఉండదు. అమ్మగా వచ్చిన మొత్తం, పన్ను చెల్లించి మంచి షేర్లలో ఇన్వెస్ట్ చేయండి. కొత్త షేర్లు బాగా పెరిగితే, మీకు లాంగ్ రేంజిలో ప్రయోజనం ఉంటుంది. డివిడెండ్లతో పాటు ఆస్తి విలువ పెరిగిపోతుంది. కొంత మంది త్వరలో పెళ్లి చెద్దామనుకుంటున్నవారు బంగారం, వెండి కొంటున్నారు. 80సీలో ఉన్న ఈఎల్ఎస్ఎస్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు.. ఉత్తరోత్తరా మినహాయింపు దొరుకుతుంది. ఒక అవకాశం, ఇల్లు తప్ప ఏ ఆస్తి అమ్మినా, బంగారం, ల్యాండ్, షేర్లు వల్ల ఏర్పడ్డ క్యాపిటల్ గెయిన్స్‌తో సెక్షన్ 54 ఎఫ్ కింద ఒక ఇల్లు కొనవచ్చు/కట్టుకోవచ్చు. అమ్మకాల విలువలోనుంచి కాస్ట్ తీసివేసి, మిగతా పరిహారం ఇన్వెస్ట్ చేయాలి. చేసినంత మేరకే మినహాయింపు ఇస్తారు. నిర్దేశిత వ్యవధిలోపల కొనాలి/కట్టించాలి. ఆఇంటి మీద ఖర్చు రూ. 10 కోట్లు దాటకూడదు. దాటినా మినహాయంపు రూ. 10 దాటి ఇవ్వరు. షేర్లు అమ్మిన వ్యక్తి పేరు మీదే ఇల్లు కొనాలి. ముఖ్యంగా ఇల్లు కొనే వేళకు ఆ వ్యక్తి పేరుమీద ఇల్లు ఉండదు. అంటే ఈ రిలీఫ్ ఇల్లు లేని వాళ్లు కొనుక్కోంటేనే వస్తుంది. లిస్టెడ్ షేర్లు లాంగ్ టెర్మ్‌లో అమ్మితే, బేసిక్ లిమిట్ రూ. 1,25,000 తప్ప ఎలాంటి మినహాయింపు లేదు. మీరు చెప్పిన బాండ్లు కొనడం వల్ల ఎలాంటి మినహాయింపు లేదు. కొంత మంది ట్యాక్స్ హార్వెస్టింగ్ అని అంటున్నారు. అది ప్లానింగ్‌లో భాగం మాత్రమే. వృత్తి నిపుణులను సంప్రదించండి. మామూలుగా బేసిక్ లిమిట్ రూ. 3,00,000 లేదా రూ. 4,00,000 .. ప్లానింగ్ పేరున మీ ఆదాయాన్ని బేసిక్ లిమిట్‌కి తీసుకురాగలమా.. అది కుదరని పని. దాని కన్నా కేవలం ఆర్థికంగా లాభనష్టాలు అంచనా వేసి, చట్టప్రకారం మసులుకోవడమే మంచి పని.

## డ్రీమ్11 మళ్లీ వస్తోంది.. ఈసారి కొత్త అవతార్‌లో!

ప్రముఖ ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్ 11 కొత్త అవతార్‌లో ఎంట్రీ ఇవ్వనుంది. స్టాక్ బ్రోకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోకి ప్రవేశించనుంది. ఈ మేరకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డ్రీమ్ మనీ పేరిట స్టాక్ బ్రోకింగ్ సేవలను అందించేందుకు కంపెనీ సిద్ధమవుతోందని 'మింట్' తన కథనంలో పేర్కొంది. తద్వారా జెరోధా, ఏంజెల్ వన్, గ్రో వంటి సంస్థలకు పోటీగా డిస్కౌంట్ బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్‌గా అవతరించేందుకు సిద్ధమవుతోంది. కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు కారణంగా డ్రీమ్ 11 తన రియల్ మనీ గేమ్స్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కంపెనీ ఆదాయం 95 శాతం మేర క్షీణించింది. ఫ్రీ టు ప్లే, యాడ్ సపోర్టెడ్ మోడల్‌కు మారినా పెద్దగా ఫలితం లేకపోవడంతో స్టాక్ బ్రోకింగ్ సేవల్లో ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించుకుంది. డ్రీమ్ 11కు ప్రస్తుతం 26 కోట్ల యూజర్ బేస్ ఉంది. వీరిని రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్‌వైపు మళ్లించాలని కంపెనీ భావనగా కనిపిస్తోంది. ఒకప్పటితో పోలిస్తే స్టాక్ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పార్టిసిపేషన్ భారీగా పెరుగుతోంది. సులువుగా మార్కెట్లోకి ప్రవేశించే వీలుండడం, జీరో కమీషన్ ట్రేడింగ్ వంటి కారణంగా వీరి సంఖ్య వేగంగా వృద్ధి చెందుతోంది. అదే సమయంలో ఇప్పటికీ ప్రతి 12 మందిలో కేవలం ఒక్కరు మాత్రమే ఇన్వెస్టర్లుగా ఉన్నారు. అంటే మార్కెట్‌కు దూరంగా ఉన్న వారి సంఖ్య ఇంకా చాలా ఎక్కువగానే ఉందని నివేదికలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించడంపై డ్రీమ్ 11 దృష్టి పెట్టింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.60 | ₹ 5.62 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,10,750 (22 క్యారెట్లు) | ₹ 1,20,820 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,65,000

## 60 ఏళ్లలో 260 రెట్లు పెరిగిన వేతనాలు!

ఉద్యోగులకు, పెన్షనర్లకు కేంద్రం తీపికబురు అందించింది. ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ పెంచేలా 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం (అక్టోబర్28) ఆమోదం తెలిపింది. ఎనిమిదో సెంట్రల్ పే కమిషన్ విధి విధానాలకు(టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) రూపొందించేందుకు కేబినెట్ ఆమోదించింది. 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం 2025 జనవరి 16న స్పష్టం చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ కేంద్రస్థాయిలోని కీలక శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలతో ఈమేరకు సంప్రదింపులు జరిపింది. వీటిలో రక్షణ మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సిబ్బంది, శిక్షణ శాఖ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ ఈమేరకు ఏర్పాటు చేయనున్న ప్యానెల్‌లో ఆరుగురు సభ్యులు ఉంటారు. వారు 18 నెలల్లో తమ నివేదికను సమర్పిస్తారు. అయితే, ఈసారి త్వరగానే నివేదికను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. తద్వారా కొత్త సిఫార్సులను జనవరి 1, 2026 నుంచి అమలు చేసేందుకు వీలవుతుంది. ఎనిమిదో వేతన సంఘం దేశవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా క్లర్కులు, ప్యూన్లు, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) వంటి లెవల్ 1 హోదాల్లో ఉన్న వారు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒక వేతన సంఘాన్ని నియమిస్తుంది. ప్రస్తుత 7వ సీపీసీ 31 డిసెంబర్ 2025తో ముగియనుంది. 2024 జనవరిలో 8వ సీపీసీని ప్రకటించినప్పటికీ, టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)కు తాజాగా ఆమోదం తెలిపింది. ఇది పూర్తయి సభ్యులను నియమించే వరకు జీతాలు, అలవెన్సులు, పింఛన్లపై అధికారిక సమీక్ష మొదలుకాదని గమనించాలి. కొత్త కమిషన్ కింద వేతన సవరణలో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కీలకమైన అంశంగా మారుతుంది.

## అడిగినంత ఇవ్వకపోతే టెస్లాకు బై..బై?

### 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వకపోతే మస్క్ వెళ్లేపోయే ప్రమాదం


### హెచ్చరించిన కంపెనీ బోర్డు చైర్మన్ రాబిన్

వాషింగ్టన్: టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ప్రతిపాదిత 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల(సుమారు రూ.88 లక్షల కోట్లు) వేతన ప్యాకేజీని వాటాదారులు ఆమోదించడంలో విఫలమైతే అతడు సంస్థను విడిచిపెట్టే ప్రమాదం ఉందని టెస్లా బోర్డు ఛైర్మన్ రాబిన్ డెన్హోమ్ హెచ్చరిక జారీ చేశారు. నవంబర్ 6, 2025న జరగనున్న కంపెనీ వార్షిక సమావేశానికి ముందు డెన్హోమ్ వాటాదారులకు పంపిన లేఖలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఈసారి మస్క్ వేతన ప్యాకేజీకి సంబంధించిన ఓటు టెస్లా భవిష్యత్తుకు అత్యంత కీలకం అని లేఖలో స్పష్టం చేశారు. మస్క్ ప్రతిపాదించిన ఈ పరిహార ప్రణాళిక ఎందుకు కీలకమో డెన్హోమ్ లేఖలో వివరించారు. 'మస్క్ ఆధ్వర్యంలోని కంపెనీలు అత్యంత ప్రతిష్టాత్మకమైన పనితీరు లక్ష్యాలతో ముడిపడి ఉన్నాయి. 2035 నాటికి టెస్లా మార్కెట్ క్యాప్‌ను 1.36 ట్రిలియన్ డాలర్ల నుంచి 8.5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించుకున్నారు. ఏటా 20 మిలియన్ వాహనాలను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1 మిలియన్ రోబోటాక్సీలను తయారు చేయాలని, మరో 1 మిలియన్ ఆప్టిమస్ హ్యూమనాయిడ్ రోబోట్లను డెలివరీ చేయాలని నిర్ణయించుకున్నారు' అని చెప్పారు. డెన్హోమ్ తన లేఖలో.. ఈ లక్ష్యాలను సాధించడానికి మస్క్ నాయకత్వం చాలా అవసరమని చెప్పారు. మస్క్ లేకపోతే టెస్లా గణనీయమైన విలువను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మస్క్ వేతన ప్యాకేజీ ఓటు టెస్లాకు కీలకమైన భవిష్యత్ పెట్టుబడి అని చెప్పారు. అయితే ఈ ప్యాకేజీపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఐఎస్ఎస్ వంటి కార్పొరేట్ అడ్మినిస్ట్రేటివ్ అడ్వైజరీ సంస్థలు ఈ ప్యాకేజీ నిర్మాణంపై విమర్శలు గుప్పించాయి. దీనిపై మస్క్ స్పందిస్తూ విమర్శకులను 'కార్పొరేట్ టెర్రరిస్టులు' అని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, వాటాదారుల ఓటు నవంబర్ 5, 2025 రాత్రి 11:59 గంటలకు ముగియనుంది. టెస్లా వార్షిక సమావేశం నవంబర్ 6, 2025న నిర్వహించనున్నారు.



## ఎలాన్ మస్క్ మరో సంచలనం

**వాషింగ్టన్:**ప్రపంచ అపరకుబేరుడు ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెర తీశారు. వికీపీడియాకు పోటీగా.. గ్రోకిపీడియాను తీసుకొచ్చారు. ఇది ఏఐ ఆధారితంగా పని చేస్తుం దని.. వికీపీడియా కంటే పది రేట్లు ఎంతో బెటర్ అంటూ ప్రకటించారు. ఎలాన్



మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ గ్రోకిపీడియా ప్లాట్‌ఫారమ్‌ను ఇవాళ(అక్టోబర్ 28న) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది వాస్తవాలను ఆధారంగా తీసుకుని.. శరవేగంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా సమాచారం అందించడం దీని ఉద్దేశమని మస్క్ అంటున్నారు. అయితే.. ఇది ప్రారంభమైన కాసేపటికే భారీ ట్రాఫిక్ కారణంగా క్రాష్ అయ్యింది. దీంతో కాసేపటికి సేవల్ని పునరుద్ధరించారు. అంతేకాదు.. కొంత మంది ఇది వికీపీడియాతో పోలిస్తే కొత్తగా ఏం లేదని పెదవి విరుస్తున్నారు. పైగా ప్రాథమిక సమాచారాన్ని వికీపీడియా నుంచే తీసుకుంటోందని ఆరోపిస్తున్నారు. వికీపీడియాను జిమ్మీ వేల్స్ ల్యారీ సాంగర్ కలిసి 2001 జనవరి 15న స్థాపించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన సమాచార వేదికలలో ఒకటి. ఇది ఒక ఫ్రీ ప్లాట్‌ఫారమ్. ఇందులో ఎవరైనా సమాచారాన్ని పొందుపరచవచ్చు.. లాగిన్ అయ్యి ఎడిట్ కూడా చేయొచ్చు. ఇది వికీమీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. అయితే..వికీపీడియాకు పోటీగా, నిజమైన సమాచారం కోసం కొత్త వేదికలు అవసరం అంటూ మస్క్ చాలాకాలంగా చెబుతూ వస్తున్నారు. వికీపీడియాలోని సమాచారం విషయంలో స్పష్టత కొరవడింది.

## అధిక సంఖ్యలో టీకాల వల్ల పిల్లల్లో ఆటిజం

### జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు

న్యూఢిల్లీ:పిల్లలకు మితిమీరిన సంఖ్యలో ఇస్తోన్న టీకాల వల్ల ఆటిజం కేసులు పెరిగే అవకాశం ఉన్నట్లు జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఇటీవల చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. భారతదేశంలో ఆటిజం కేసులు పెరుగుతున్నాయని, దీనికి తల్లిదండ్రులు పిల్లలకు ఇప్పిస్తున్న టీకాలు కూడా కారణమని వెంబు ఎక్స్(గతంలో



ట్విట్టర్) వేదికగా అభిప్రాయపడ్డారు. వెంబు ఈ వ్యాఖ్యలు చేస్తూ మెక్ కలౌ ఫౌండేషన్ నివేదిక ఫలితాలను ఉటంకించారు. 300కు పైగా అధ్యయనాలను సమీక్షించి రూపొందించిన ఈ నివేదికలో రెండేళ్లలోపు పిల్లలకు సుమారు 32 టీకాలు వేయిస్తున్నట్లు చెప్పారు. ఇది ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌కు కారణమవుతున్నట్లు తెలిపారు. వెంబు తన పోస్ట్‌లో 'తల్లిదండ్రులు ఈ విశ్లేషణను తీవ్రంగా పరిగణించాలి. చిన్న పిల్లలకు మితిమీరిన సంఖ్యలో టీకాలు ఇస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఇది భారతదేశంలో కూడా వ్యాపిస్తోంది. ఇండియాలోనూ ఆటిజం వేగంగా పెరుగుతున్నట్లు తెలుస్తుంది' అని పేర్కొన్నారు. వెంబు వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో చర్చకు దారితీశాయి. కొందరు నెటిజన్లు ఆయన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ 'ఈ మెసేజ్‌ను పంపడానికి చాలా ధైర్యం కావాలి' అని ప్రశంసించగా, మరికొందరు టీకాల ఆవశ్యకతను, అవి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో పోషించిన పాత్రను నొక్కి చెబుతూ విమర్శిస్తున్నారు.

### విమానంలో కలకలం..

## ప్రయాణికులపై భారతీయ విద్యార్థి దాడి

**వాషింగ్టన్:**లుఫ్తాన్సా విమానంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. విమానంలో ఓ భారతీయ విద్యార్థి.. తోటి ప్రయాణికులపై దాడి చేశాడు. పదునైన మెటల్ ఫోర్క్‌తో ఇద్దరు టీనేజర్లపై దాడికి పాల్పడ్డాడు. షికాగో నుంచి జర్మనీకి ప్రయాణిస్తున్న విమానంలో ఘటన జరిగింది. నిందితుడిని ప్రణీత్ కుమార్ ఉసిరిపల్లి(28)గా అధికారులు గుర్తించారు. ఈ ఘటనతో విమానంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రయాణికులు భయాందోళన చెందారు. ఈ హింసాత్మక ఘటన కారణంగా పైలట్లు విమానాన్ని బోస్టన్‌కు మళ్లించాల్సి వచ్చింది. అధికారుల సమాచారం మేరకు.. విమానం అట్లాంటిక్ మహా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ప్రణీత్ కుమార్.. 17 ఏళ్ల ఇద్దరు టీనేజర్లపై ఫోర్క్‌తో దాడి చేశాడు. మొదట నిద్రలో ఉన్న ఓ యువకుడి భుజంపై ఫోర్క్‌తో గాయపరిచాడు. అనంతరం మరో యువకుడిపై తల వెనుక భాగంలో గాయపరిచాడు. అతన్ని అడ్డుకునేం దుకు ప్రయత్నించిన విమాన సిబ్బందిపై కూడా దాడి చేశాడు. ఈ ఘటన అనంతరం లుఫ్తాన్సా ఫ్లైట్ 431 బోస్టన్ లోగన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యవసరంగా దారి మళ్లించారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ఫెడరల్ ఏజెంట్లు, పోలీసులు విమానంలోకి ప్రవేశించి ప్రణీ త్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన ఇద్దరు యువ కులను ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనలో ప్రణీత్‌కు గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష, 2,50,000 డాలర్ల జరిమానా విధించవచ్చు.

## రాజ్యాంగ విరుద్ధమైనా.. 'మళ్లీ నేనే!?'

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(79) తన మనసులోని మాట బయటపెట్టారా?. ముచ్చటగా మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ పడాలనుకుంటున్నారా?. జపాన్ పర్యటనకు ముందు ఆయన చేసిన వ్యాఖ్యల అంతర్యం అదేనంటూ చర్చ నడుస్తోంది ఇప్పుడు. వైట్‌హౌజ్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ తాజాగా ట్రంప్ మూడో దఫా పోటీపై ఆసక్తికర వ్యాఖ్య చేశారు. జపాన్ పర్యటనకు బయల్దేరే ముందు విమానంవద్ద మీడియా ఆయన్ని ఆ వ్యాఖ్యలపై ప్రశ్నించింది. దానికి ట్రంప్ స్పందిస్తూ.. "మూడోసారి పోటీ చేయడం నాకు ఇష్టమే. నా వద్ద అత్యుత్తమ నెంబర్లు ఉన్నాయి" అంటూ బదులిచ్చారు. అయితే..ఆ వెంటనే "ఇంకా ఆ విషయంపై నిజంగా ఆలోచించలేదు" అని అన్నారు. ట్రంప్ తన తరువాత రిపబ్లికన్ పార్టీని నడిపే నాయకులుగా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్లను ప్రస్తావించారు. మా వద్ద గొప్ప నాయకులు ఉన్నారు అంటూ రుబియో వైపు చూపిస్తూ.. 'వాళ్లలో ఒకరు ఇక్కడే ఉన్నారు' అని చమత్కరించారు. అలాగే.. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ప్రశంసిస్తూ.. అవును, జేడీ అద్భుతంగా ఉన్నాడు. ఉపాధ్యక్షుడు గొప్పవాడు. వీళ్లిద్దరిని ఎదుర్కొనే వారు ఉండరేమో అని ట్రంప్ అన్నారు. అమెరికాకు అధ్యక్ష ఎన్నికలు 2028 సంవత్సరంలో జరగనున్నాయి. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. ఒక వ్యక్తి అధ్యక్ష పదవికి రెండుసార్లు మాత్రమే ఎన్నిక కావచ్చు. మూడోసారి పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధం. అయితే స్టీవ్ బానన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ట్రంప్ 2028లో మూడోసారి అధ్యక్షుడిగా అవుతారు. దీనికి ఒక ప్రణాళిక ఉంది.



కఠినమైన అడ్డంకే ఉన్నా.. దాన్ని అధిగమించే మార్గాలు ఉన్నాయి. 2016, 2024లో ట్రంప్ సాధించారు. వచ్చేసారి కూడా సాధించగలరు అని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ అమెరికాకు నాలుగు పర్యాయాలు అధ్యక్షుడిగా పని చేశారు. అయితే.. 1951లో రాజ్యాంగానికి 22వ సవరణ ద్వారా రాటిఫై చేశారు. ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే, అమెరికా రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంటుంది. రాజ్యాంగ సవరణ చేయాలంటే, అత్యధిక రాష్ట్రాల ఆమోదం అవసరం. ఇది రాజకీయంగా చాలా కష్టమైన ప్రక్రియ. ఇది ప్రస్తుతం సాధ్యపడే అవకాశాలు లేవు. స్టీవ్ బానన్, ట్రంప్ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీసేలా ఉన్నా.. న్యాయపరంగా అవి అమలులోకి రావడం అసాధ్యం. ఇదిలా ఉండగా.. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ మలేషియా నుంచి జపాన్ చేరుకున్నారు. సోషల్ ట్రూత్‌లో ఈ మేరకు.. మలేషియా అద్భుతమైన దేశం. ముఖ్యమైన వాణిజ్య ఒప్పందాలు, రేర్ ఎర్త్ డీల్స్ సంతకం చేశాం. ముఖ్యంగా థాయ్‌లాండ్ మరియు కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. యుద్ధం లేదు! కోట్లాది ప్రాణాలు రక్షించబడ్డాయి.

## 8వ వేతన కమిషన్‌కు పచ్చజెండా

అమలు చేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంపై.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం గత 11 ఏళ్లుగా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమం లో మంగళవారం కేంద్ర కేబినెట్ మరో చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులపై ఎరువుల ధరలు భారం పడకుండా, ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.37,952 కోట్ల న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ కారణాలతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. ఈ ధరల ప్రభావం ఏమాత్రం రైతులపై పడకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై పడుతున్న భారాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇవాళ సమావేశమైన కేంద్ర కేబినెట్.. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి.. డై అల్యూమినియం ఫాస్ఫేట్ , మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ , మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ , ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ , 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ , అల్యూమినియం సల్ఫేట్ వంటి దాదాపు 28 ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని వివరించారు కిషన్‌రెడ్డి. ఇందుకోసం.. అంతర్జాతీయంగా పెరిగిన ధరలతో ఈ ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై భారం పడకుండా.. రబీ సీజన్ కోసం రూ.37,952 కోట్లు కేటాయిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. ఇది ఎరువులు ఉత్పత్తి కంపెనీలకు కూడా భారం పడకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు.

# పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతిఒక్కరు స్మరించుకోవాలి

- అమరవీరులకు జోహార్లు తెలుపుతూ కొనసాగిన సైకిల్ ర్యాలీ
- ఉత్సాహంగా పాల్గొన్న యువకులు పోలీసు అధికారులు, సిబ్బంది
- ర్యాలీలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేసిన
- పెద్దపెల్లి డిసీపీ కరుణాకర్ రామగుండం ఏసిపి మాడత రమేష్



**ముత్తారం అక్టోబర్ 28(జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం 8.00 గంటలకు పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇద్దులాపూర్ నుండి ముత్తారం మండలం పోతారం సర్వారం,లక్కారం, మచ్చుపేట గ్రామాలను కలుపుకొని రామగిరి మండలం బేగంపేట్ వరకు ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి కరుణాకర్,రామగుండం ఏసిపి మాడత రమేష్,మంథని సిఐ రాజు గౌడ్ పాల్గొని,జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను,కఠినతరమైన విధులను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీ ఇద్దులాపూర్ గ్రామ ఎంట్రన్స్ నుంచి ప్రారంభమై రామగిరి పోలీస్ వద్దన ముగించడం జరిగిందన్నారు. పోలీసు అమరవీరులను త్యాగాలు స్మరించుకుంటూ,నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ,పబ్లిక్ పోలీస్ రిలేషన్ ను మరింత పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, మంథని ఎస్సై సాగర్, కమాన్ పూర్ ఎస్సై ప్రసాద్,రామగిరి ఎస్సై దివ్య,మహిళ పోలీస్ కానిస్టేబుల్లు సౌజన్య,శ్వేత,ప్రత్యుష కాంగ్రెస్ పార్టీ నాయకులు,గాధం శ్రీనివాస్,ముత్తారం మాజీఎంపీపీ అత్తే చంద్రమౌళి తోపాటు నాగరాజు,హరీష్ సత్యనారాయణ, తోపాటు యువకులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దర్గాను తొలగించకా.. కోటి లింగాలను తొలగించాలి

## బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల్లో నాలుగు నెలలుగా భక్తులను అయోమయానికి గురి చేస్తున్నారని బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ అన్నారు. మంగళవారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజన్న దర్శనాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ధర్మం కోసం పనిచేయడం లేదని,సెక్యులర్ వాదులుగా పనిచేస్తున్నారన్నారు. రాజన్న ఆలయం లోపల వున్నా కోటిలింగాలను తొలగించే ముందు దర్గాను తొలగించాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి పనులకు అడ్డుపడబోమని,దర్గాను తొలగించకుండ,హిందూ దేవత విగ్రహాలను ముట్టుకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని,వేములవాడ బంద్ కూడ చేస్తామని హెచ్చరించారు. అయన వెంట బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్,నాయకులు రేగుల మల్లికార్జున్ సంటి మహేష్,కటుకం శ్రీనివాస్ రేగుల రాజ్ కుమార్,గోడిసెల శ్రీనివాస్,బిల్లా కృష్ణ,వినోద్ రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.



# మంత్రి వివేక్‌ను కలిసిన బీడీ టేకాదారులు

**ముస్తాబాద్ అక్టోబర్ 28( జనం సాక్షి) :** బీడీ కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం అని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ముస్తాబాద్‌కు చెందిన తెలంగాణ బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టేకేదారులు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి వివేక్ ను హైదరాబాదు లోని గోల్కొండ హెూటల్లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా బద్దెపూర్ శ్రీనివాస్ మంత్రికి వినతి పత్రం అందించారు. పిఎఫ్ తో సంబంధం లేకుండా బీడీలు చుట్టే కార్మికులందరికీ పెన్షన్ వర్తింపజేయాలని కోరామన్నారు. అలాగే 2014 నుంచి ఉన్న పీఎఫ్ ను కటాఫ్ తేదీని ఎత్తివేయాలని కోరడం జరిగిందన్నారు. అర్హులైన బీడీ కార్మికులకు 4000 పెన్షన్ ఇందిరమ్మ ఇండ్లు కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. ఈ మేరకు మంత్రి వివేక్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి గారితో ఈ విషయం చర్చించామని డిసెంబర్ ఆఖరు నాటికి ప్రభుత్వం బీడీ కార్మికులకు పింఛన్ పెంచే విషయంలో నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారని బద్దేపూరి శ్రీనివాస్ తెలిపారు మంత్రిని ఈ సందర్భంగా టేకేదారులు సన్మానించారు తిరునగరి రంగయ్య ,కొంక రాజు,

# రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ , మంగళవారం టీజిఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిని హైదరాబాద్ బస్ భవన్ నందు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బస్సుల కొరత, గ్రామీణ ప్రాంతాలకు తగిన సర్వీసుల లేమి, మరియు రోడ్డు కనెక్టివిటీ సమస్యలను వివరించారు. ఎల్లారెడ్డి ప్రజల తరపున రెప్రెసెంటేషన్ అందించి, ప్రజల అవసరాలను స్పష్టంగా ప్రస్తావించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మరిన్ని కొత్త బస్సులను కేటాయించాలని,పట్టణంలో కొత్త ఆర్టీసీ డిపోను స్థాపించాలని,గ్రామీణ మార్గాల్లో సర్వీసులను పెంచి, ఫ్రీక్వెన్సీ మెరుగుపరచాలి అని డిమాండ్ చేశారు. ఇటీవల ఎల్లారెడ్డికి 10 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించబడినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల రవాణా సౌకర్యాలను మరింత విస్తరించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ఎండీకి వివరించారు. ఎల్లారెడ్డి ప్రజల రవాణా సౌకర్యం, అభివృద్ధి, మరియు ప్రజల అవసరాలు తీర్చడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ఎండి నాగిరెడ్డి ఎల్లారెడ్డి ప్రజల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తాము అని హామీ ఇవ్వడం జరిగింది.


# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యూ సదస్సులలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే, ఎన్నికల నిబంధనల మేరకు శనివారం లోగా సమయానికి పూర్తి చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం క్రమబద్ధంగా నిర్వహించాలంని సూచించారు. ఎస్.ఐ.ఆర్ అమలు కోసం చేపడుతున్న కసరత్తు గురించి మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2002 ఓటరు జాబితాలో 2025 ఓటరు జాబితాను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని,తప్పిదాలకు తావు లేకుండా మ్యాపింగ్ పూర్తి చేయాలని అన్నారు. బీ ఎల్ ఓ సూపర్వైజర్లు ఒక్కో పోలింగ్ స్టేషన్ వారీగా బీ ఎల్ ఓలతో స్వీయ పర్యవేక్షణలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మదన్ మోహన్, తహసిల్దార్ ఉమలత,రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## రైతులు మద్దతు ధరను పొందాలి: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 28 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద మంగళవారం మొక్కజొన్న, సోయా ధాన్యం కొనుగోలు కేంద్రాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. మొక్కజొన్న ఎకరానికి 18.50 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరుగుతుందని, క్వింటాలుకు 2400 రూపాయలు, సోయా దాన్యం క్వింటాలుకు 5328 రూపాయల మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం మహేష్ కుమార్, నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

# భూమి భూజ చేసిన ఎమ్మెల్యే



**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 28 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని 2 బీహెచ్‌కే గృహాల సముదాయాలకు మంచి నీటి సౌకర్యం కల్పించడానికి గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో సంపు నిర్మాణ పనులను మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ నిధులు 33 లక్షల రూపాయలతో 2 బీహెచ్‌కే గృహాల సముదాయాలకు మంచి నీటి సౌకర్యం కల్పించడానికి మిషన్ భగీరథ ట్యాంకును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వని, పేదల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు మోహన్, నాగిరెడ్డి, శామప్ప, మల్లప్ప పటేల్, మొగుల గౌడ్, బస్వరాజ్ దేశాయ్, హైమద్, యువ నాయకులు పాండు నాయక్, శ్రీనివాస్ గౌడ్, నాగరాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కలిగోట సూరమ్మ చెరువు ప్రాజెక్టులో

# మరో ముందడుగు

- ముందుగా భూ సేకరణకు 10 కోట్లు నిధులు
- నేడు 35.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కుడి కాలువ ఏడమ కాలువ నిర్మాణానికి మార్గం సుగుమం

**కథలాపూర్, అక్టోబర్ 28,(జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని కలికోట సూరామ్మ చెరువు ప్రాజెక్టు లో మరో ముందడుగు పడిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కళికోట సూరమ్మ చెరువు కూడి ఎడమ కాలువ నిర్మాణం భూ సేకరణ కోసం ప్రభుత్వం గత నెలలో 10 కోట్ల నిదులను మంజూరు చేయగా సోమవారం 35 కోట్ల 50 లక్షల నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగింది. గతంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణం చేయవలసిందిగా అనేక ఆందోళనలు చేసిన విషయం విధితమే. నేడూ ఎమ్మెల్యేగా గెలిచాక సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనుల శరవేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్ హెూదాలో ప్రాజెక్టు సందర్శించి అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తానని తెలిపారు. ప్రస్తుతము నీటిపారుదల శాఖ మంత్రి గతంలో రుద్రంగి పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా నేడు భూసేకరణకు 35 కోట్ల 50 లక్షల నిధులు మంజూరి చేయడం జరిగింది.. 45 కోట్ల 50 లక్షలతో కుడి ఎడమ కాలువ నిర్మాణానికి భూసేకరణ చేయడం వల్ల ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా కొనసాగడంతో పాటు కుడి ఎడమ కాలువల నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

# ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

## అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** విద్యార్థులకు అన్ని విధాలుగా క్రీడలలో పాల్గొనడానికి వనరులను కల్పించాలని, తగిన ప్రోత్సాహం అందించాలని తద్వారా వారి విజయ అవకాశాలు మెరుగుపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినంద సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు అన్ని క్రీడా రంగాలలో నైపుణ్యం వచ్చే విధంగా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడంతోపాటు సరైన శిక్షణ అన్ని వేళల్లోవిజేతలుగా ఉంటారని వారు చెప్పారు. క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామని, వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటటువంటి పోటీలకు ఎంపిక చేస్తున్నారని వారు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో నిర్వహించినటువంటి ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 14 చెస్ పోటీలలో శివస్ అండర్ 17 విభాగంలో పి.విశ్వంత్, వి. అభిరామ్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన సందర్భంగా విజేతలకు పుష్ప గుచ్ఛాలను అందజేసి రానున్న రోజుల్లో నిర్వహించేటువంటి రాష్ట్రస్థాయి పోటీలలోను జయకేతనం ఎగరవేయాలని మరి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజంసాగర్ ఎంపీడీవోగా శివకృష్ణ

**నిజంసాగర్ :** నిజంసాగర్ మండల మండల పరిషత్ అభివృద్ధి శాఖ అధికారిగా డి. శివకృష్ణ నియమితులయ్యారు. ఈయన ట్రైనింగ్ పూర్తి చేసుకొని మొదటిసారిగా నిజంసాగర్ ఎంపీ డీవోగా మంగళవారం నాడు బాధ్యతలు చేపట్టారు.


# ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 జనంసాక్షి :** బకాయి పడ్డ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కామారెడ్డి జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిపి 8 వేల కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కన్వీనర్ పి. శివ ప్రసాద్ ఆరోపించారు. ఈ డబ్బులు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు కాలేజీ యాజమాన్యాల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, దీంతో విద్యార్థులపై ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కాలేజీ యాజమాన్యాలతో జరిపిన సమావేశాల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. దీనివల్ల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ప్రభుత్వానికి దీనితో సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బకాయిలు తక్షణం విడుదల చేయాలని, లేదంటే ఎమ్మెల్యేల ఒక నెల వేతనాన్ని కుదించి విద్యార్థులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సనత్ రాజు, ఎల్.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సెంటర్‌కు

# ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ధర్నా





- స్థలాన్ని కేటాయించే వరకు ధాన్యం కొనుగోళ్లు జరగనివ్వం
- 40వేల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని ఎక్కడ అమ్ముకోవాలో చెప్పండి..?
- ప్రభుత్వం స్పందించకుంటే విడతలవారీగా ఉద్యమాలు తప్పవని హెచ్చరిక

**చిగురుమామిడి అక్టోబర్ 28 (జనం సాక్షి) :** రైతులు పండించిన పంటను కొనుగోలు సెంటర్‌లో విక్రయించేందుకు స్థలం లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వ స్థలాన్ని ఐకెపి సెంటర్‌కు కేటాయించాలని బొమ్మనపల్లి గ్రామ ప్రజలు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. తాహసిల్దార్ వచ్చి తమకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించేది లేదని బైఠాయించారు. చిగురుమామిడి ఎస్ఐ సాయి కృష్ణ తమ సిబ్బందితో అక్కడికి రాగానే తహసిల్దార్ ముద్దసాని రమేష్, ఇరిగేషన్ ఏఈ నెహ్రూ అక్కడికి చేరుకొని ప్రజలతో మాట్లాడారు. 40వేల క్వింటాళ్ల వరి పంటను పండించే గ్రామంలో తమ పంటను విక్రయించుకునేందుకు స్థలం లేక నానా ఇబ్బందులు పడుతున్నామని కత్తుల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ స్థలాన్ని ఐకెపికి కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, జిల్లా కలెక్టర్‌ను, ఆర్డీవోను,తాసిల్దార్ ను పలుమార్లు కలిసి తమ సమస్యను చెప్పామన్నారు. సర్వే నెంబర్ 685లో ఐకెపి సెంటర్ కు స్థలం కేటాయించే వరకు ఎలాంటి కొనుగోలు జరగనీయబోమని ట్రాక్టర్ సంఘం,రైతు సంఘం, హమాలీ సంఘం నాయకులు కత్తుల రమేష్,చట్ల మొగిలి, మామిడి రాజు, పెద్ద బత్తుల రాజయ్య,మామిడి వెంకటయ్యలు స్పష్టం చేశారు. తాము చాలా రోజులుగా కోరుతున్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే అన్ని విధాలుగా గ్రామ ప్రజలకు ఉపయోగపడుతుందని, ప్రభు త్వానికి ఏమైనా ఇబ్బందులు ఉంటే అందు లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఐకెపికి కేటాయించాలన్నారు. బొమ్మనపల్లి గ్రామ ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తారని తహసిల్దార్ హామీ ఇచ్చారు. తమ న్యాయ మైన డిమాండును నెరవేర్చకుంటే తాసిల్దా ర్ కార్యాలయంతో పాటు కలెక్టరేట్ కార్యా లయాన్ని ముట్టడిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, నాయకులు కంది శంకర్, పెండ్యాల సదానందం,తోట శ్రీనివాస్, కత్తుల ప్రశాంత్ యాదవ్,మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల శారద మహిళా సంఘం నాయకులు జంగం సరవ్వ, మిట్టపల్లి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ నుంచి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా ఎంపిక



**కామారెడ్డి, అక్టోబర్ 28:** నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (గ్రేడ్-1 (మహిళా, శిశు సంక్షేమ శాఖ)గా ఎంపికైన నేనావత్ కస్తూరిని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అభినందించి మెమొంటో అందజేశారు. బీఏ ఏక్లారా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన కస్తూరి వరంగల్‌లో ఇంటర్మీడియట్, కోటి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. 2024లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఎంపికై నిజాంసాగర్ పీఎస్‌లో చేరారు. విధుల్లో నిబద్ధతతోపాటు నిరంతర అభ్యాసం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 2025లో టీఎస్‌పీఎస్సీ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. పోలీసు శాఖలోని సమస్యలు, సమయ కొరత మధ్య ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఈ విజయం సాధించినందుకు ఎస్పీ ప్రశంసించారు. భవిష్యత్తులో తన ప్రతిభతో మంచి పేరు సంపాదించి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.



## ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేసిన కలెక్టర్

**సదాశివ నగర్ అక్టోబర్ 28 (జనం సాక్షి)** కామారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ గారు సదాశివ నగర్ మండలం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటికి మార్కింగ్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది లబ్ధిదారులు త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం పరిశీలించి వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని టార్పోలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు .సిబ్బంది కూడా తేమ శాతం రాగానే ధాన్యం మిల్లుకు తరలించాలని సూచించా రూ. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీల పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

**ఎస్ఐ అజ్మీరా రమేష్**




**కొండమల్లేపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ప్రైవేటు వ్యాపారుల చేతిలో సామాన్యులు అవసరానికి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించలేక అవస్థల పాలవుతున్నారని కొందరు అధిక వడ్డీ ఆశ చూపించి, నమ్మించి, వ్యక్తుల, వ్యాపారుల నుండి డిపాజిట్లు వసూలు చేసి చివరికి మోసగిస్తున్నారని జనంసాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి వెంటనే పోలీసులు స్పందించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పత్రికా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అధిక వడ్డీలకు ఆశపడి ప్రజలు బాధితులుగా మారొద్దన్నారు. వడ్డీ వ్యాపారులు సామాన్య ప్రజలను, చిరు వ్యాపారస్తులను వేధిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వేధింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. డబ్బులు చెల్లించని వారి నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్షలు తప్పవన్నారు. మీటర్ వడ్డీ, ఆధిక వడ్డీలపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వారి ఫిర్యాదులు స్వీకరించి తగిన బుద్ధి చెప్తామన్నారు. పట్టణ కేంద్రంలో ఎవరైనా అధిక వడ్డీలకు అప్పులిస్తే చర్యలు తీసుకుంటామని నూటికి రూ. 3, రూ. 5, రూ. 10 ఇలా ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చినట్లు మా దృష్టికి వస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. ఖాళీ ప్రామిసరీ నోట్ మీద సంతకం చేయించుకొని డబ్బులు ఇవ్వరాదన్నారు. డబ్బు వసూళ్లకు ఇళ్ల వద్దకు ఇతరులను పంపి బెదిరింపులకు గురి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. కొండమల్లేపల్లి పట్టణంలో అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చే వాళ్ళు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నామని త్వరలో ఆధిక వడ్డీ వ్యాపారులను పట్టుకుంటామన్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆధిక వడ్డీల వ్యాపారం నిర్వహిస్తున్నారని తెలిసిందని ఇలాంటి చర్యలకు పాల్పడి ఉద్యోగాలను పోగొట్టుకోవద్దన్నారు.

పట్టణ కేంద్రంలో రుణాలు ఇచ్చే కొన్ని సంస్థలు తమ పరిధి దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్వరలో అన్ని రుణాల సంస్థలపై పూర్తిగా సోదాలు నిర్వహిస్తామన్నారు. రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు, మాచర్ల, గుంటూరు, పిడుగురాళ్ల నుండి వచ్చే వ్యక్తుల దగ్గర రుణాలు తీసుకోవద్దని ప్రజలకు సూచించారు. పక్క రాష్ట్రం నుండి వచ్చి రుణాలు ఇచ్చే వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అధిక వడ్డీలపై ఎవరైనా బహిరంగంగా వచ్చి ఫిర్యాదులు చేస్తే విచారించి కేసులు నమోదు చేస్తామన్నారు.





# అవినీతి లేకుండా సుపరిపాలన

- ప్రతిఫలం ఆశించకుండా పనిచేయాలి
- విజిలెన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 28 (జనం సాక్షి) :** విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2025 లో భాగంగా డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శిఖగోయల్ ఆదేశానుసారం హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిజాయితిగా ఉండాలని, ప్రభుత్వ శాఖ ల ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో, అవినీతి రహితంగా, పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్సు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విజిలెన్స్- అందరి బాధ్యతగా ఉద్యోగులు గుర్తించాలి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా సర్వీస్ లో చేరినప్పుడు కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి శాఖ ఉద్యోగి తన పరిధి లో చేయాల్సిన సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అవినీతి లేకుండా ,ఎటువంటి ప్రతి ఫలం ఆశించకుండా సుపరిపాలన అందించాలని అన్నారు. జిల్లా కేంద్రం నుండి గ్రామం వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మంచి సేవలు అందించాలని సూచించారు. ప్రతి సంవత్సరం విజిలెన్స్ వారోత్సవాలు జరపాలని, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ యొక్క ఉద్దేశాలను ప్రతి మండలంలో ప్రతి గ్రామంలోని పౌరులకు చేరే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తో విధి నిర్వహణలో నిజాయితీ తో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం, బాధ్యతయుతంగా వ్యవహరించడం, ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టు బడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, (లోకల్ బాడీస్) అదనపు కలెక్టర్ సుదీర్, ఆర్ డి ఓ మంగీ లాల్ విజిలెన్స్ అధికారులు రఘు రామ్ రావు ,వెంకట్ రెడ్డి ఏ ఓ పర్వీన బేగం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దారుణాన్ని దాచిన హెడ్‌మాస్టర్

- ఇంట్లో చెబితే ఇంటికే పంపిస్తానని బెదిరింపులు
- కురాక్యాల పాఠశాల ఘటనలో నిగ్గుతేలిన నిజాలు
- నివేదిక అందజేసిన విచారణ కమిటీ
- బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన యాకుబ్ పాషా
- వాస్తవాలు దాచడం, నిర్లక్ష్యం కారణంగా ప్రధానోపాధ్యాయురాలు సస్పెండ్
- ఆఫీస్ అటెండర్ యాకూబ్ పాషా రిమాండ్,
- మహిళా కమిషన్ ఆగ్రహం, సమగ్ర విచారణ ఆదేశం




**కరీంనగర్ జిల్లా బ్యూరో/గంగాధర, అక్టోబర్ 28 (ఈనాడు):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ మహ్మద్ యాకూబ్ పాషా మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనను ఉన్నతాధికారులకు తెలియజేయకుండా దాచిపెట్టినందుకు పాఠశాల గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు టి.కమలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు యాకూబ్ పాషాను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ఘటనపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్ అయింది. సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులను ఆదేశించారు. కురిక్యాల పాఠశాలలో కొన్ని రోజులుగా యాకూబ్ పాషా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడనే ఫిర్యాదులు రావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాల సెలబ్రేషన్స్ సందర్భంగా విద్యార్థినులతో ఫొటోలు తీసుకుని వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్, పోక్సో, ఐటీ చట్టాల కింద కఠిన సెక్షన్లలో కేసు నమోదు చేశారు. కరీంనగర్ సీసీఎస్ గౌస్ ఆలం మాట్లాడుతూ, నిందితుడిని రేకుర్తి చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని తెలిపారు. ఏసీపీ విజయ్ కుమార్ విచారణలో కొందరు విద్యార్థినులపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు.

ఘటన తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముగ్గురు సభ్యుల అధికారుల బృందాన్ని విచారణకు ఆదేశించారు. బృందం నివేదికలో ప్రధానోపాధ్యాయురాలు కమల సంఘటనను దాచిపెట్టేందుకు సిబ్బందిని బెదిరించారని, విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేశారని, వాస్తవాలు ఉన్నతాధికారులకు తెలియజేయలేదని పేర్కొంది. దీంతో కమలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదలి వెళ్లరాదని ఆదేశించారు. యాకూబ్ పాషా ఇదివరకే సస్పెన్షన్‌కు గురయ్యాడు.

మైనర్ బాలికలు, మహిళలపై వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ విజయ్ కుమార్ హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు, ఉద్యోగినులు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. విద్యాసంస్థల్లో బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. విద్యాసంస్థలు స్వేచ్ఛాయుత, సురక్షిత, గౌరవప్రద వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి భద్రతా చర్యలు బలోపేతం చేయాలని ఆదేశించారు. కేసు పురోగతిని కమిషన్ పర్యవేక్షిస్తుందని, బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## త్వరలో నర్సాపూర్ ఎకో పార్క్ కాటేజీలు ప్రారంభం

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 ( జనం సాక్షి ):** కాటేజీలు రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండా సురేఖ, గారి చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ డీఎఫ్ఓ జోజి అటవీ శాఖ సిబ్బందితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ ఎకో పార్క్ కాటేజీలు సాధ్యమైనంత త్వరగా యాత్రికులకు అందుబాటులోకి తీసుకు రావడానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. నర్సాపూర్ ఎకో పార్క్లో యాత్రికుల సౌకర్యార్థం సుమారు 42 కాటేజీలు పి.పి.పి మోడ్ లో అటవీ శాఖ మరియు ప్రైవేట్ యాజమాన్య సహకారంతో నిర్మాణాలు పూర్తిచేసుకుని త్వరలో ప్రారంభించుకుని యాత్రికులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నర్సాపూర్ ఎకో పార్క్ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుందని, చూడ చక్కని ప్రాంతంగా వెలసిల్లుతూ యాత్రికుల మదిని కట్టిపడేస్తుందని ఆయన అన్నారు. ఎంతోమంది ప్రకృతి ప్రేమికులు, యాత్రికులు సెలవు దినాల్లో నర్సాపూర్ ఎకోపార్క్ సందర్శించి ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఆ రోజంతా సంతోష దాయకంగా గడుపుతారని మరింత సౌకర్యాలు యాత్రికులకు కల్పించాలని ఉద్దేశంతో కాటేజీ నిర్మాణాలు ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి అటవీ శాఖ అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తాటిపల్లి వైన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

- ఈనెల 28 నుంచి నవంబర్ 1 వరకు అవకాశం
- ఎక్సైజ్ సూపరిడెంట్ నవీన్ చంద్ర

**సంగారెడ్డి, అక్టోబర్ 28 ( జనం సాక్షి) :** సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మునిపల్లి మండలం తాటిపల్లి వైన్ షాప్ నంబర్ 24 డ్రా వాయిదా వేయబడింది. దీనికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ 28.10.2025 నుండి 01.11.2025 వరకు కొనసాగుతుందని సంగారెడ్డి ఎక్సైజ్ సూపరిడెంట్ నవీన్ చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి నవంబరు ఒకటి వరకు దరఖాస్తుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు అదే విధంగా, డ్రా కార్యక్రమం 03.11.2025 డు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సదా శివనగర్ మండల కేంద్రం, రామారెడ్డి మండలం లోని ఉప్పల్ వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు తుపాను ప్రభావం వలన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో అన్ని వరి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లను చేయాలనీ, రైతులు నష్టపోకుండా, ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో పాటు అవసరమైన సౌకర్యాలు వెంటనే వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో వర్షా ప్రభావంతో అవసరమైతే వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కాగా, కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. కేంద్రాల వద్ద వడ్లకాంటాలను పరిశీలించి, వాతావరణం బాగలేనందున కాంట వేసిన బస్తాలు సంరక్షించుకోవాలని సెంటర్ ఇంఛార్జ్‌కి , సంఘ కార్యదర్శికి సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతుల తమ పంటను తీసుకోవచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, తదితర పాటించాలని, వర్షం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వడ్ల కుప్పలు వర్షానికి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైస్ మిల్లు వద్ద వడ్ల సంచులు దించుకున్న వెంటనే, రిసిప్ట్ పొంది వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయవలసిందిగా సెంటర్ ఇంఛార్జ్‌కి సూచించారు. జిల్లాలో మొత్తం 427 కేంద్రాలు, 233 ఫాక్స్ కేంద్రాలు, 193 ఐకెపి, గ్రేడ్ ఎ రకం రూపాయల క్వింటాలుకు 2389, సాధారణ రకం క్వింటాలుకు 2369 కలెక్టర్ వెంట డిప్యూటి కలెక్టర్ రవితేజ, డిఆర్వో మదన్ మోహన్ డిసిఓ రామ్మోహన్ క్లస్టర్ ఆఫీసర్ లక్ష్మణ్, డిఎం, డిసిఎస్ఓ (సిఎస్) ఏవో, ఏఈఓ సంఘ కార్యదర్శులు, సెంటర్ ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు.






# నేటి నుంచి భారత్ - ఆసీస్ టీ20 సిరీస్

## ప్రధాన ఆకర్షణగా నిలవనున్న అభిషేక్, హెడ్

భారత్ - ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ 20 సిరీస్ అక్టోబర్ 29 నుంచి ప్రారంభం కానుంది. కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. యువ సంచలనం అభిషేక్ శర్మ, ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఈ సిరీస్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. వీరిద్దరూ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అద్భుత ప్రదర్శన చేశారు. మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్ వంటి ఆటగాళ్ల ప్రదర్శన కూడా ఆసక్తికరంగా ఉంటుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు భారత్ - ఆస్ట్రేలియా జట్లు సిద్ధమయ్యాయి. వన్డే సిరీస్‌తో ఆస్ట్రేలియా ఫ్యాన్స్‌తో పాటు భారత అభిమానులకు కూడా ఓ మంచి బ్రేక్‌ఫాస్ట్ అందించిన ఆసీస్ - ఇండియా జట్లు.. టీ20లతో ఫుల్ మీల్స్ అందించేందుకు సిద్ధమయ్యాయి. అక్టోబర్ 29 నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్ నవంబర్ 8తో ముగియనుంది. ఈ టీ20 సిరీస్‌లో టీమిండియా నుంచి అభిషేక్ శర్మ, ఆస్ట్రేలియా నుంచి ట్రావిస్ హెడ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నారు.

అక్టోబర్ 29న భారత్ - ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇక రెండో మ్యాచ్ అక్టోబర్ 31న మెల్‌బోర్న్ వేదికగా సాగనుంది. మూడో మ్యాచ్‌లో హోబార్ట్‌లోని బిలీవర్ ఒవల్ మైదానం వేదికగా నవంబర్ 2న, నాలుగో మ్యాచ్ గోల్డ్ కోస్ట్‌లోని బెల్ పిప్పెన్ ఒవెల్ వేదికగా నవంబర్ 6న.. ఇక చివరి మ్యాచ్ బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా నవంబర్ 8న జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 1:45 నిమిషాలకు ప్రారంభం అవుతాయి. మ్యాచ్ లైవ్‌లను జియో హాట్ స్టార్, స్టార్ స్పోర్ట్స్ వేదికగా వీక్షించొచ్చు. ఆస్ట్రేలియా, భారత జట్లలోని ఓపెనర్ల వీరంగం కోసం ఇరు జట్ల అభిమానులు ఎదురుచూస్తున్నారు. టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇటీవల సృష్టించిన సంచలనాలు అన్నీ ఇన్నీ కావు. ఆసియా కప్‌లోనూ తన బ్యాటింగ్‌తో టీమిండియాను ఒంటిచేత్తో గెలిపించాడు. మరి ఆసీస్ పిచ్‌లపై ఎలాంటి ప్రభావం చూపుతాడోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. టీమిండియా అంటేనే విరుచుకుపడే హెడ్, ఈ సిరీస్‌లో ఏ రేంజ్‌లో ఆడతాడో చూడాలి. ట్రావిస్ హెడ్ - అభిషేక్ శర్మ ఇద్దరూ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి ఓపెనింగ్ పార్టనర్‌షిప్‌తో ఐపీఎల్‌లో రికార్డులు బద్దలుకొట్టారు. వీళ్లిద్దరితో పాటు టీమిండియా నుంచి తిలక్ శర్మ, ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్ ఇన్నింగ్స్‌లు కూడా ప్రత్యేకం కానున్నాయి.

### టీమిండియా స్క్వాడ్

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభమన్ గిల్, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దుబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

### ఆస్ట్రేలియా స్క్వాడ్

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మాహ్లీ బియర్డ్‌మన్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షిస్, నాథన్ ఎలిస్, జోష్ హేజెల్‌వుడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కూహ్నెమన్, మిచెల్ ఒవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టొయినీస్, ఆడమ్ జాంపా.




## సూర్య పేలవ ఫామ్‌పై ఆందోళన అవసరం లేదు

**సూర్యకుమార్ యాదవ్‌కు అండగా గౌతమ్ గంభీర్**

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అండగా నిలిచాడు. సూర్య పేలవ ఫామ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నాడు. దూకుడుగా ఆడాలనేది జట్టు నిర్ణయమని, ఆ ప్రయత్నంలోనే సూర్య విఫలమవుతున్నాడని వివరణ ఇచ్చాడు. ఈ ఏడాది 11 టీ20లు ఆడిన సూర్యకుమార్ యాదవ్ 11.11 సగటుతో 100 పరుగులు మాత్రమే చేశాడు. గత 7 మ్యాచ్‌ల్లో సూర్య 72 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా కప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచినా.. బ్యాటర్‌గా సూర్య నిరాశపర్చాడు. ఈ క్రమంలోనే అతనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సూర్యకుమార్ యాదవ్ మునపటిలా ఆడలేకపోతున్నాడని, జట్టుకు భారంగా మారాడనే కామెంట్లు వినిపిస్తున్నాయి. కెప్టెన్సీ లేకుంటే సూర్యకు తుది జట్టులో చోటు దక్కేది కాదనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో సూర్య ఫామ్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ఈ సిరీస్‌లో తప్పకుండా సూర్య రాణిస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. 'నిజాయితీగా చెప్పాలంటే సూర్య బ్యాటింగ్ ఫామ్‌పై నాకు ఎలాంటి ఆందోళన లేదు. ఎందుకంటే దూకుడైన బ్యాటింగ్ అప్రోచ్‌ను కొనసాగించాలని మేం జట్టుగా నిర్ణయించుకున్నాం. ఈ అప్రోచ్‌ను అనుసరించినప్పుడు వైఫల్యాలు కూడా ఎదురవుతాయి. 30 బంతుల్లో 40 పరుగులు చేయడం సూర్యకు పెద్ద కష్టం. అలా చేసి విమర్శల నుంచి తప్పించుకోవచ్చు. కానీ మేం అలా చేయలనుకోవడం లేదు. వ్యక్తిగత ప్రదర్శనల కన్నా జట్టు విజయానికే ప్రాధాన్యత ఇస్తున్నాం.

## 8 డిగ్రీల ఉష్ణోగ్రతలో ప్రాక్టీస్..

భారత్ - ఆస్ట్రేలియా టీ20 సిరీస్ మొదలవబోతోంది. అక్టోబర్ 29 న ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. కానీ కాన్‌బెర్రాలో విపరీతమైన చలితో టీమిండియా ఆటగాళ్లు తెగ ఇబ్బంది పడుతున్నారు. 8 డిగ్రీల ఉష్ణోగ్రతలో డబుల్ జాకెట్లు వేసుకున్నా వణికిపోతూనే ప్రాక్టీస్ చేస్తున్నారు. వన్డే సిరీస్ ఓటమి తర్వాత టీ20 సిరీస్‌ను ఎలాగైనా గెలవాలని టీమిండియా చూస్తోంది. ఈ సిరీస్ టీ20 వరల్డ్ కప్ 2026కి కీలకం కానుంది. భారత్ - ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ఇలా ముగిసిందో లేదో అలా టీ20 సిరీస్ ఆరంభానికి సిద్ధమైంది. టీ20 సిరీస్‌తో పాటు చలికాలం కూడా ఎంటర్ అవడంతో పాపం టీమిండియా ప్లేయర్లు తెగ అవస్థలు పడుతున్నారు. భారత్ - ఆస్ట్రేలియా మధ్య తొలి టీ20 మ్యాచ్, అక్టోబర్ 29న కాన్‌బెర్రా వేదికగా జరగనుంది. దాంతో టీమిండియా ప్లేయర్లు రెండ్రోజుల ముందు నుంచే ప్రాక్టీస్ సెషన్ ప్రారంభించారు. అయితే కాన్‌బెర్రాలో విపరీతమైన చలి వాతావరణం ఉండటంతో అలానే ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. టీమిండియా టీ20 స్క్వాడ్ ప్రాక్టీస్ సెషన్ వీడియోను బీసీసీఐ విడుదల చేసింది. కాన్‌బెర్రా వేదికగా మొదటి టీ20 జరగనుండటం తో.. సోమవారం భారత జట్టు క్రీడాకారులు ప్రాక్టీస్ మొదలుపెట్టారు. అయితే, కాన్‌బెర్రా లో కేవలం 8 డిగ్రీల ఉష్ణోగ్రతే ఉండటంతో, పాపం ప్లేయర్లు చలికి అల్లాడిపోయారు. అంత చలిలో కూడా క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశారు. ప్రాక్టీస్ సెషన్‌లో ప్రతీ ప్లేయర్ డబుల్ జాకెట్ వేసుకున్నప్పటికీ చలికి తట్టుకోలేక పోయారు.

భారత జట్టు ఆటగాళ్ల హావభావాలు, ఫన్నీ ఎక్స్‌ప్రెషన్‌ను క్యాపచ్యూర్ చేసిన బీసీసీఐ వాటన్నింటినీ ఓ వీడియోగా చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ చలికి వణికిపోయారు. అయినా కూడా ప్రాక్టీస్ సెషన్ స్కిప్ చేయకుండా అలానే కొనసాగించారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను 1 -2 తేడాతో ఓడిపోవడంతో.. టీ20 సిరీస్‌ను ఎలాగైనా కైవసం చేసుకోవాలని భారత్ చూస్తోంది. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు ఇటీవల ఆసియా కప్ 2025లో ఓటమి ఎరుగకుండా వరుస విజయాలతో టైటిల్ సొంతం చేసు కుంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత నుంచి టీ20ల్లో టీమిండియా దూసుకుపోతోంది. ఆల్‌రౌండర్లతో సత్తా చాటుతూ ప్రతీ సిరీస్‌లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. మరి ఆస్ట్రేలియాపై కూడా విజయం సాధిస్తుందా? లేదా? అనేది వేచి చూడాలి. భారత్ - ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 మరి కొద్ది నెలల్లోనే ఉండటంతో ఈ సిరీస్ ఇరు జట్లకి చాలా కీలకంగా మారనుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 అక్టోబర్ 2025

# 'హైడ్రా' తవ్వితీసిన బమ్మకున్నద్దౌలా చెరువు

- పాతబస్తీలో చారిత్రక చెరువు పునరుద్ధరణ
- నవంబరు నాటికి పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పలు సూచనలు





హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) : పాతబస్తీలో చారిత్రక బమ్మకున్నద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా సిద్ధమౌతోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు మంగళవారం బమ్మకున్నద్దౌలా చెరువు పునరుద్ధరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా.. ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పుడు చెరువును 18 ఎకరాల మేర విస్తరించి.. వరద కట్టడితోపాటు.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. చెరువులోకి వరద నీరు చేరేలా.. నిండితే పోయేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్లను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.

### చెరువు చుట్టూ ఆకర్షణలు

చెరువు చుట్టూ బండ్ నిర్మించి వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. అలాగే చెరువు కట్ట చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. అలాగే చెరువు లోపలి వైపు కూడా ఎవరూ లోనకు వెళ్లకుండా గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ప్లే ఏరియాలు ఏర్పాటు చేస్తునారు. అలాగే వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు నిర్మిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు చుట్టూ రహదారులు నిర్మించడంతో పాటు.. గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు నాటుతున్నారు. పచ్చిక బైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తూనే.. నగిషీలు చెక్కుతున్నారు. నిజాంల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకుండా కాపాడుతూ.. మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో కూడా మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. ఔట్‌లెట్‌కు మళ్లీ గేట్లు బిగిస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేదదీరేవిధంగా రూపొందించడమే కాకుండా.. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్మకున్నద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్మకున్నద్దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.

# కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా

- లేదంటే కెటిఆర్, హరీష్ రావు వీడుతారా
- జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ సవాల్



హైదరాబాద్, అక్టోబర్28 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రచార కార్యక్రమాలు రద్దు చేసుకున్న బిఆర్ఎస్

హైదరాబాద్, అక్టోబర్28 (జనంసాక్షి) : బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. మంగళవారం నాటి పార్టీ కార్యక్రమాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రద్దు చేశారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ప్రటకించారు. మరోవైపు జూబ్లీహి ల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో తప్పిన ముప్ప

- ఎయిరిండియా బస్సుకు అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్28 (జనంసాక్షి) : దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం సమయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథాప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది.

# డాక్టర్ ఆత్మహత్య కేసులో కొత్త విషయాలు

- ప్రశాంత్ బంకర్ అనే టెక్కీకి కూడా భాగస్వామ్యం
- ఆ దిశగా పోలీసుల ముమ్మర దర్యాప్తు

ముంబై, అక్టోబర్28 (జనంసాక్షి) : మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న మహిళా డాక్టర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలి ఆత్మహత్య కేసును కొలిక్కి తీసుకొచ్చేం దుకు పోలీసులకు కీలకమైన ఆధారాలు లభించాయి. ఎస్సై గోపాల్ బదానే తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మరికొన్ని ఆధారాలు దొరికాయి. డాక్టర్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్న ప్రశాంత్ బంకర్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో ఆమె ఎప్పటి కప్పుడు మెసేజ్‌లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ సూసైడ్ చేసుకోవడానికి ముందు మానసికంగా చాలా కుంగిపోయి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ ఇంట్లో మహిళా డాక్టర్ పూజకు హాజరయ్యిందని.. కానీ అక్కడ గొడవ జరిగిన తర్వాత ఆమె అక్కడినుంచి వెళ్లి హోటల్‌లో చేరి, తీవ్ర మనోవేదనతో ఉరి వేసుకొని చనిపోయిందని తెలిపారు. సతారా పోలీసు విభాగానికి చెందిన ఎస్సై గోపాల్ బదానే పలుమార్లు తనపై లైంగిక దాడి చేశాడని ఇప్పటికే ఆమె సూసైడ్ నోట్ లో తెలిపింది. మరో వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేయగా.. కేసు విచారణ కొనసాగు తుంది. మహారాష్ట్ర మహిళా సంఘం చైర్‌పర్సన్ రూపాలి చకాంకర్ మాట్లాడుతూ.. బంకర్ ఇంట్లో వైద్యురాలు లక్ష్మీ పూజకు హాజరై, అక్కడ ఫోటోలు తీసుకునే విషయంలో గొడవలు జరిగాయని తెలిపారు. తర్వాత డాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయిందని.. బంకర్ తండ్రి ఆమెను తిరిగి తీసుకురాగానే, ఆమె మరోసారి హోటల్‌కు వెళ్లిపోయిందని చెప్పారు. ఇదే విషయాన్ని పోలీసు అధికారి తుషార్ దోషి కూడా ధృవీకరించారు.

# సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న రేవంత్

- పాలమూరు-రంగారెడ్డి పై నిర్లక్ష్యం
- జిల్లా ప్రజలు రేంవత్‌ను క్షమించరు
- ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు
- జాగృతి జనంబాటలో కవిత డిమాండ్





మహబూబ్‌నగర్, అక్టోబర్28 (జనంసాక్షి) : సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చారిత్రక అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్టుల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చిన కవిత ప్రజలతో మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక త్తటెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్-ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలనికవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారానీటి సమస్యలను అధిగమించామని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగించుకోవాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ సహా అన్ని పనులు 80 శాతం వరకు అప్పుడే పూర్తయ్యాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రేవంత్ రెడ్డి గెలిచి కూడా రెండేళ్లు అయ్యిందని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇవ్వటానికి ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకొని ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎవరు గెలిచిన ఉపయోగమేమీ?

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా చేపట్టి రెండు సంవత్సరాలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మహబూబ్ నగర్ జిల్లా లో జాగృతి జనంబాట కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న కవితకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బైపాస్ రోడ్డులో స్వాగతం పలికారు జాగృతి కార్యకర్తలు అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలలో ఎవరు గెలిచిన ప్రజలకు వచ్చే లాభం ఏమి లేని కారణంగా ఈ ఎన్నికలకు జాగృతి దూరంగా ఉందని అన్నారు ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకరావడంలో భాగంగా జాగృతి జనంబాట కార్యక్రమం చేపట్టమని తెలిపారు..

# అంగన్‌వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం

- సుప్రీం కోర్టు స్టేను తొలగించుకునేలా చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని మంత్రి సీతక్క ఆదేశాలు
- లా సెక్రటరి, పీఆర్సీ చైర్మన్ తో సమావేశమైన మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమయంలో నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం నాడు లా సెక్రటరీ బీ. పాపిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్, పీఆర్సీ చైర్మన్ ఎన్. శివశంకర్‌లతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల నియామకాల్లో ఎదురవుతున్న న్యాయ చిక్కులపై చర్చించారు. న్యాయ చిక్కులను అధిగమించే దిశలో వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు. రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు అంగన్వాడీ ఖాళీలుండగా, వాటి భర్తీపై గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్, హెల్పర్ పోస్టులను ఎస్టీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వం, చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకోవడం సులువవుతుందన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతం మించిపోవడంతో, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా లా సెక్రటరీ పాపిరెడ్డికి మంత్రి సీతక్క సూచించారు. రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్‌లో నిపుణుడైన ఎన్. శివశంకర్ సలహాలతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. అయితే మంత్రి సీతక్క ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు.. ఇప్పటికే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పర్యటించి అంగన్వాడీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ఆ రాష్ట్రాల్లో అంగన్వాడీ పోస్టులు ప్రభుత్వ సర్వీస్ కిందకు రాకపోవడం వలన సబార్డి నేట్ సర్వీస్ రూల్స్ వర్తించ వని, దీంతో రిజర్వేషన్లు 50 శాతం పరిమితి వర్తించదని అధికారులు వివరించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్వాడీ పోస్టులు ఎస్టీలకే రిజర్వ్ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా తెలంగాణలోనూ అదే విధానాన్ని అవలంబించి సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు సుప్రీం కోర్టులో వెకేట్ పిటిషన్ దాఖలు చేసి, స్టేను తొలగించుకునే చర్యలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సుప్రీం కోర్టు స్టేను తొలగించుకునేందుకు చట్టపరమైన చర్యలు ప్రారంభించి, 10 రోజుల్లో నియామక ప్రక్రియకు మార్గం సుగమం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేసే దిశలో కొత్త నియమాకాలు దోహద పడుతాయని..అందుకే అంగన్వాడీల నియమాకాలను సత్వరం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# ఆర్ఎస్ఎస్, బీజేపీపై రాజకీయ, సైద్ధాంతిక పోరాటం

- సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్




హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాటం చేయాలని సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందుకోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తామని చెప్పారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందనీ, ఇంకా తుది తీర్పును వెల్లడిరచలేదని గుర్తు చేశారు. ఈసీ స్వతంత్రంగా వ్యవహరించాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సీపీఐ(ఎం) అఖిల భారత స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆరు రోజులపాటు నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌కరత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు చేయాలని ఈసీ ప్రకటించిందని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదన్నారు. మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందనీ, ఇంకా తుది తీర్పు వెల్లడిరచలేదని గుర్తు చేశారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని చెప్పారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తే ప్రజలు గందరగోళానికి గురవుతారని అన్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించిందని చెప్పారు. రాజకీయ ఉద్దేశంతో ఈసీ నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. ఈసీ స్వతంత్రంగా వ్యవహరించాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసీ తీరుపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలే లక్ష్యంగా పాలన సాగుతున్నదని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ బలోపేతానికి, నాయకుల ఎదుగుదలకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### లౌకిక శక్తులను ఒక వేదిక మీదకు తేవడమే లక్ష్యం : రాఘవులు

పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంత, రాజకీయ అవగాహనను పెంచడం కోసమే ఈ శిక్షణ తరగతులను నిర్వహించామని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. రాబోయే కాలంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తమ పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామని అన్నారు. లౌకిక శక్తులన్నింటినీ ఒక వేదిక మీదకు తేవడం తమ లక్ష్యమన్నారు.

### ఫీజు బకాయిలను విడుదల చేయాలి : జాన్‌వెస్లీ

రాష్ట్రంలో పెండిరగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేయడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ధ్రువపత్రాలు కాలేజీ యాజమాన్యాల వద్ద ఉన్నాయని అన్నారు. ఉన్నత చదువులకు వెళ్లడానికి ఉద్యోగాలు చేయడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విద్యార్థి సంఘాల రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీపీఐ(ఎం) మాజీ ఎంపీ పికే బిజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370